www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 29-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 | సంచిక (Issue) : 361

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా. 8.22 తదుపరి పంచమి; నక్షత్రం: విశాఖ రా. 8.37 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా.12.51-2.33; దుర్ముహూర్తం: ఉ.8.42-9.30, మ.12.45-1.33; అమృతఘడియలు: ఉ.11.05-12.49; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.16; సూర్యాస్తమయం: 6.25 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వేడి నీళ్లు పోసి.. రోకలి బండతో కొట్టి..

మద్యం మత్తులో వేధిస్తున్నాడనే ఆగ్రహంతో భర్తను చిత్రహింసలు పెట్టి చంపిన భార్య

ఇద్దరు స్నేహితులతో కలిసి తాళ్లతో కట్టేసి ఒంటిపై కారంపొడి చల్లి దాడి

రోకలి బండతో కొట్టడంతో తలపై గాయాలు.. ఆపై అంబులెన్స్‌కు ఫోన్ చేసిన వైనం

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త హేమంత్ మృతి.. కరీంనగర్‌లో ఘటన 14



టికెట్ రాకపోవడంతో

ఎంపీ ఆత్మహత్య

పురుగుల మందు తాగిన ఈరోడ్ ఎంపీ

నాలుగు రోజులుగా కోయంబత్తూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గణేశమూర్తి మృతి 12



ఆన్సర్ షీట్ చూపించలేదని

కత్తితో పొడిచారు

టెన్త్ విద్యార్థిపై ముగ్గురు సహచరుల దాడి

మహారాష్ట్రలోని థాణేలో ఘటన

తప్పిన ప్రాణాపాయం 12



బీఆర్ఎస్‌కు బై బై

వరంగల్ స్థానం నుంచి వైదొలిగిన కడియం కావ్య



రేపు కాంగ్రెస్‌లోకి కేశవరావు

కుమార్తె విజయలక్ష్మితో కలిసి చేరిక

పార్టీ మార్పుపై కేసీఆర్, కేకే మధ్య ఆసక్తికర చర్చ 13

పార్టీలో మీకు ఏం తక్కువ చేశా?

పదేళ్లు అధికారం అనుభవించి.. పార్టీని వీడుతారా?

అవకాశవాద రాజకీయాలు తగవు

నిర్ణయాన్ని మార్చుకోండి: కేసీఆర్

చచ్చే దాకా కాంగ్రెస్‌లోనే ఉంటా: కేకే

కేకే వెంటే ఇంద్రకరణ్, అరవింద్‌రెడ్డి

కొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కూడా చేరే అవకాశం

గులాబీ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన

కబ్జాలు, లిక్కర్ స్కాం, ఫోన్ ట్యాపింగ్ పరిణామాలు

బీఆర్ఎస్ ప్రతిష్ఠను దిగజార్చాయని అసంతృప్తి

కేసీఆర్‌కు లేఖ.. వరంగల్ నుంచే కాంగ్రెస్ తరఫున పోటీ!

కడియం శ్రీహరి కూడా కారు దిగనున్నారని తేటతెల్లం

ఆయనతో నేరుగా కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దల చర్చలు

ఒకట్రెండు రోజుల్లో శ్రీహరి, కావ్య కాంగ్రెస్‌లోకి

వీరితో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలూ?



హైదరాబాద్, వరంగల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. వరంగల్ లోక్‌సభ స్థానానికి అభ్యర్థిగా పార్టీ ఖరారు చేసిన కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య పోటీ నుంచి తప్పుకొంటున్నట్లు, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు ఆమె లేఖ రాశారు. గులాబీ పార్టీకి కావ్య రాజీనామా చేయడంతో సీనియర్ నేత, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా కారు దిగనున్నారనేది స్పష్టమైంది. నేడో రేపో ఆయన బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరనున్నారని విశ్వసనీయ సమాచారం. కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు ఢిల్లీ అధిష్ఠానం పెద్దలే ఆయనతో చర్చించి రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే తొలుత కడియం కుమార్తె కావ్య బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. కడియం శ్రీహరి తన కుమార్తె కావ్యతో కలిసి ఒకట్రెండు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా.. బీఆర్ఎస్ తరఫున గట్టిగా గళం వినిపించే కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరనుండటం ఆ పార్టీకి గట్టి దెబ్బేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వారం క్రితమే కావ్యను వరంగల్ స్థానం నుంచి అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించారు. అప్పటి నుంచే ఆమె పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అయితే బీఆర్ఎస్‌లో జరుగుతున్న అంతర్గత వ్యవహారాలు నచ్చకే కడియం శ్రీహరి, కావ్య పార్టీ మారాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ నేతలపై భూ కబ్జాల ఆరోపణలు, లిక్కర్ స్కాం, ఫోన్ ట్యాంపింగ్ లాంటి పరిణామాలు పార్టీ ప్రతిష్ఠ దిగజార్చాయంటూ కేసీఆర్‌కు రాసిన లేఖలో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక నిన్నటిదాకా వరంగల్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న కావ్య, అదే స్థానం నుంచి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయనున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ నేతలతో కడియం శ్రీహరి చేసిన చర్చల్లో భాగంగా ఈ మేరకు అంగీకారం



మిగతా 13వ పేజీలో...



ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో వాదనల అనంతరం తిహాడ్ జైలుకు వెళ్తున్న సీఎం కేజ్రీవాల్

అసలు కుంభకోణం ఈడీదే!

బీజేపీ కోసం బలవంతపు వసూళ్ల రాకెట్

శరత్ రూ.55 కోట్లతో బెయిలు కొన్నాడు

బీజేపీకి బాండ్లు ముట్టాకే బెయిలొచ్చింది

రాజకీయ కుట్రతోనే నన్ను అరెస్టు చేశారు

నలుగురు చెబితే సీఎంను అరెస్టు చేస్తారా?

నన్ను ఇరికించి ఆప్‌ను లేకుండా చేద్దామని ప్లాన్

ఈడీ కోర్టులో కేజ్రీవాల్ స్వయంగా వాదనలు

ఏప్రిల్ 1 వరకూ ఈడీ కస్టడీలోనే సీఎం

జైలు నుంచి పాలనను అడ్డుకోలేమన్న హైకోర్టు

కేజ్రీవాల్‌పై రాష్ట్రపతే తేల్చుకోవాలని స్పష్టీకరణ

కోర్టు ఆదేశాల ప్రకారం జైల్లో వసతుల్లేవ్!

ములాఖత్‌లో భర్త దృష్టికి తీసుకొచ్చిన కవిత

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఆమ్‌ఆద్మీ పార్టీని లేకుండా చేయాలనే కుట్రతోనే తనను అరెస్టు చేశారని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. మద్యం విధానం కేసులో వంద కోట్లు చేతులు మారాయన్న ఈడీ ఆరోపణ కూడా అబద్ధమన్నారు. నిజమైతే వంద కోట్లు ఏమయ్యాయో, ఎక్కడున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న శరత్ చంద్రారెడ్డి బీజేపీకి రూ.55 కోట్లు విరాళంగా ఇచ్చి బెయిల్‌ను కొనుక్కున్నాడని ఆరోపించారు. ఈ దందాకు సంబంధించి తన దగ్గర పూర్తి ఆధారాలున్నాయని ప్రకటించారు. అసలు మనీ ట్రయల్ జరిగిందే బీజేపీ, శరత్ మధ్య అని చెప్పారు. ఈడీ జోక్యం తర్వాతే కుంభకోణం మొదలైందని వ్యాఖ్యానించారు. బీజేపీ తరఫున ఈడీ బలవంతపు వసూళ్ల రాకెట్‌ను నడుపుతోందని ఆరోపించారు. అరెస్టు తర్వాతే శరత్ బీజేపీకి రూ.55 కోట్లు చెల్లించాడన్నారు. ఆ తర్వాతే ఆయనకు బెయిలు

మిగతా 12వ పేజీలో...



తనఖా భూముల పాస్‌బుక్‌లకు విముక్తి

విడుదలకు అనుమతిస్తూ ప్రభుత్వ నిర్ణయం

సబ్ రిజిస్ట్రార్లకు ప్రత్యేక అధికారాలు 14

ధరణి కారణంగా నిలిచిన 'తనఖా' పాస్‌బుక్‌లు

అప్పులు చెల్లించిన తర్వాత కూడా రైతులకు తిప్పలు

తాజా నిర్ణయంతో ఊరట

కేటీఆర్‌పై జీరో ఎఫ్‌ఐఆర్

సీఎం రేవంత్‌పై అవినీతి ఆరోపణలే కారణం 13

వరంగల్‌లో నమోదు.. హైదరాబాద్‌కు బదిలీ

ప్రభాకర్‌రావు ఆదేశించారు.. రాధాకిషన్

అమలు చేశారు!

రాధాకిషన్, డీఎస్పీ గట్టుమల్లు అరెస్టు!!

హవాలా, వ్యాపారులకు బెదిరింపుల కోణంలో దర్యాప్తు

విచారణ పురోగతిని పర్యవేక్షిస్తున్న ఎస్ఐబీ

ఎస్ఐబీలో రిటైర్డ్ అధికారుల పాత్రపైనా ఆరా

సర్వీసులో ఉన్న కొందరికి బిగుస్తున్న ఉచ్చు?

భుజంగరావు, తిరుపతన్నకు ఐదు రోజుల కస్టడీ

ప్రణీత్‌రావు కస్టడీ పిటిషన్‌ను కొట్టివేసిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో గురువారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అప్పట్లో ఓఎస్డీ హోదాలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా వ్యవహరించిన రాధాకిషన్‌రావును దర్యాప్తు అధికారులు అరెస్టు చేశారు. ఆయనతోపాటు.. ఎస్ఐబీలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన గట్టుమల్లు(ప్రస్తుతం డీఎస్పీ)ను అదుపులోకి

మిగతా 14వ పేజీలో...

కేసీఆర్ ఫాంహౌస్‌ను సీజ్ చేయాలి

'ట్యాపింగ్' బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

డీజీపీ రవి గుప్తాకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు 14

నా ఫోన్ ట్యాప్ చేశారు

ఆడియో 1,2,3 పేర్లతో సంభాషణలు బయటపెట్టారు

బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోండి

డీజీపీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నిందితుడు నందకుమార్ 14



తాజ్ ఫలక్‌నుమాలో గురువారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీజేఐకి రేవంత్ జ్ఞాపికను బహూకరించారు

హైకోర్టు జడ్జిగా మౌసమీ భట్టాచార్య ప్రమాణ స్వీకారం 13

త్వరలో కొడంగల్‌కు

సిమెంట్ పరిశ్రమలు

ఫార్మా కంపెనీలతో ఉద్యోగ అవకాశాలు

ఫ్యాక్టరీలకు భూములివ్వకపోవడం పద్ధతి కాదు.. భూ సేకరణకు సహకరించాలి

పట్టా, అసైన్డ్ భూములకు ఒకటే ధర

కొడంగల్‌ను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.. కార్యకర్తలతో భేటీలో సీఎం

6న తుక్కుగూడ సభకు రావాలని పిలుపు

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 99.86% పోలింగ్

కొడంగల్‌లో ఓటేసిన సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): "నా ప్రతీ కష్టంలో కొడంగల్ ప్రజలు అండగా ఉన్నారు. నన్ను ఇంతగా ఆదరించిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. నన్ను సీఎం పదవిలో కూర్చోబెట్టిన నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిద్దాలన్నదే నా ప్రయత్నం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓటు వేసేందుకు గురువారం కొడంగల్‌కు వచ్చిన రేవంత్ రెడ్డి తన నివాసంలో

మిగతా 3వ పేజీలో...

10 సీట్లు పక్కాగా

గెలవాల్సిందే!

రాష్ట్రంలో రెండంకెల స్థానాలపై కమలం గురి

కచ్చితంగా 10 సీట్లు.. 35 శాతం ఓట్లే లక్ష్యం

మోదీ హవా, 'అయోధ్య' కలిసొస్తుందన్న ధీమా

కేటగిరీలుగా పార్లమెంటు నియోజకవర్గాల విభజన

మెజారిటీ సీట్లిస్తే రాష్ట్రాభివృద్ధిలో తమదైన ముద్ర చూపుతామంటూ బీజేపీ నేతల ప్రచారం



హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కచ్చితంగా 10 సీట్లు గెలుచుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో రెండంకెల స్థానాలు సాధించడమే ధ్యేయంగా ముందుకెళుతోంది. గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఓటుబ్యాంకు గణనీయంగా పెరిగిందని భావిస్తున్న పార్టీ అగ్రనాయకత్వం.. ఈ ఎన్నికల్లో డబుల్ డిజిట్ కచ్చితంగా సాధిస్తామన్న ధీమాతో ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ 10 స్థానాలు కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో పనిచేస్తోంది. ఎన్నికల్లో కనీసం 12 స్థానాలు, 35 శాతం ఓట్లు సాధించాలని పార్టీ అగ్రనేత అమిత్ షా ఇటీవలి రాష్ట్ర పర్యటన సందర్భంగా పార్టీ ముఖ్యనేతలకు

మిగతా 3వ పేజీలో...

న్యాయ వ్యవస్థపై రాజకీయ కుట్ర

సీజేఐకు 600 మంది సుప్రీంకోర్టు లాయర్ల లేఖ

ఇది పాతకాలపు కాంగ్రెస్ సంస్కృతి: మోదీ 12



తొలిసారి గాల్లోకి ఎగిరిన

తేజస్ మార్క్-1ఏ

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తొలి ప్రయాణం విజయవంతం 12

లోక్‌సభ రెండోదశ ఎన్నికలకు

నోటిఫికేషన్

88 స్థానాలకు మొదలైన నామినేషన్ల పర్వం

ఏప్రిల్ 4న ఆఖరు

5న నామినేషన్ల పరిశీలన

అదే నెల 26న పోలింగ్ 12

పది రోజుల క్రితం బెదిరింపు లేఖ

కులం పేరుతో దూషించారు

నా శవంపై ఎన్నికలు జరపాలనుకుంటున్నారు

బీజేపీపై కర్ణాటక మంత్రి, ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే ఆగ్రహం 12



నిందితుల బెయిల్ రద్దు కోరే హక్కు అప్రూవర్‌కు ఉంటుంది

దస్తగిరి పిటిషన్‌ను తిరస్కరించలేం

తెలంగాణ హైకోర్టు స్పష్టీకరణ

అవినాశ్ బెయిల్ రద్దుపై విచారణ 4వ తేదీకి వాయిదా 14




Centuary MATTRESSES
INDIA KA SLEEP SPECIALIST
SUNRISERS HYDERABAD
OFFICIAL SPONSOR OF SUNRISERS HYDERABAD
Sleep Cooler.
Sleep Better.™
Q-GEL™ MATTRESS
Powered by
CuSense™ Technology
CuSense® Technology
Centrik Pro Responsive Cushioning©
Ergo-form Transition Foam©
Euro top
ANTI SLIP
Grip+© Fabric
CertiPUR-US
Certification of Quality
NEW LAUNCH OFFER
FREE
Antimicrobial Bedsheet
CuSense™ Pillow Set
10% off
*T&C Apply
WARANGAL: SAI THIRUMALA FURNITURE 9849497812 | SRI MARUTHI FURNITURE 9398313370 | DEENAR FURNITURE 9676154052 | CLASSIC FURNITURE 9032391291 | CLASSIC FURNITURE 9032391291 | SAI COMMUNICATIONS 9849838946.
FOR TRADE & BULK ENQUIRY: 8008266628



నల్లగొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ హరిచందన

ధాన్యం కొనుగోళ్లు షురూ

- నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో 19 సెంటర్లు ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 7,149 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యాసంగి ధాన్యానికి సంబంధించి కొనుగోలు సెంటర్లు ప్రారంభయ్యాయి. గురువారం నల్లగొండ జిల్లా అర్జాలబావి పీఏసీఎస్‌లో, నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలో కొనుగోలు కేంద్రాలను ఉన్నతాధికారులు లాంఛనంగా ప్రారంభించారు. వాస్తవానికి ఏప్రిల్ 1న కొనుగోళ్లు ప్రారంభమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. అయితే నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో కాస్త ముందుగానే వరినాట్లు పడి, కోతలు ఊపందుకోవడంతో వడ్లు కొనాలంటూ రైతుల నుంచి డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని సర్కారు ఐదు రోజుల ముందుగానే కొనుగోలు కేంద్రాలను తెరిచింది. నల్లగొండ, నిజామాబాద్ జిల్లాలో కలిపి గురువారం 19 కొనుగోలు కేంద్రాలను తెరిచినట్లు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా 7,149 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. ఈ కేంద్రాల ద్వారా 75.2 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా నల్లగొండ, నిజామాబాద్‌లో మార్చి చివరి వారంలోనే కోతలు మొదలయ్యాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవటంతో... రైస్‌మిల్లర్లు, ట్రేడర్లు కనీస మద్దతు ధర కన్నా తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా రైతులు నష్టపోతున్నారు. దీన్ని గుర్తించి.. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలంటూ కమిషనర్ చౌహాన్‌ను సర్కారు ఆదేశించింది. ఈ మేరకు ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, జిల్లా స్థాయిలో నిర్ణయం తీసుకొని సెంటర్ల ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్లకు కమిషనర్ చౌహాన్ సూచించారు. కాగా రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కొనుగోలు కేంద్రాలను ముందుగా ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర సర్కారు లేఖరాసింది. ఈ మేరకు ఈనెల 25 నుంచే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు, సెంటర్ల ఏర్పాటు చేసుకోవొచ్చంటూ కేంద్రం నుంచి ప్రత్యేక అనుమతులొచ్చాయి.

10 సీట్లు పక్కాగా గెలవాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశించిన సంగతి తెలిసిందే. కచ్చితంగా 10 సీట్లలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జాతీయ నాయకత్వం రాష్ట్ర పార్టీకి స్పష్టం చేసింది. ప్రధాని మోదీ హవాతో పాటు అయోధ్య రామమందిరం అంశం తమకు బాగా కలిసొస్తాయని భావిస్తున్న అధిష్ఠానం.. తమ లక్ష్యాన్ని సాధించేందుకు అంతర్గత కసరత్తు ముమ్మరం చేస్తోంది. కచ్చితంగా గెలిచే నియోజకవర్గాలపై ఎక్కువగా దృష్టి పెడుతోంది. వీలైనంత ఎక్కువగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల పర్యటనలు ఏర్పాటు చేయడం, క్షేత్రస్థాయిలో కేడర్‌ను మరింత క్రియాశీలం చేయడం, ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి, పార్టీ శ్రేణులకు మధ్య సమన్వయ సమావేశాలు నిర్వహించడం, సామాజికంగా ప్రభావితం చేసే ప్రముఖులు, ఆయా వర్గాల ముఖ్యులతో విస్తృత భేటీలు వంటి కార్యక్రమాలను చేపడుతోంది. మొత్తం 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ, నియోజకవర్గాలవారీగా సమన్వయ సమావేశాలు నిర్వహించడంతో పాటు ప్రచారం కూడా ఉధృతం చేస్తోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 7 శాతం ఓట్లు సాధించిన తాము, కొద్దిరోజులకే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలుచుకోవడంతో పాటు 20 శాతం ఓట్లు సాధించామని బీజేపీ నేతలు గుర్తుచేస్తున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లు సాధించడంతో పాటు 14 శాతం ఓట్లు వచ్చాయని, ఎంపీ ఎన్నికల్లో మోదీ హవాతో ఈ ఓటుబ్యాంకు 35 శాతానికి చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మెజారిటీ సీట్లిస్తే..

కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, రాష్ట్రంలో తమకు ఎక్కువ సీట్లిస్తే అభివృద్ధి, సంక్షేమ



కార్యక్రమాలు మరింత విస్తృతమవుతాయని కమలనాథులు ప్రచారం చేస్తున్నారు. నలుగురు ఎంపీలను గెలిపిస్తేనే ఐదేళ్లలో రాష్ట్రానికి రూ.2.50 లక్షల కోట్లు ఇచ్చారని.. ఈ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో గెలిపిస్తే రాష్ట్రాభివృద్ధిలో తమదైన ముద్ర చూపిస్తామని బీజేపీ నేతలు అంటున్నారు.

లక్ష్యం.. 35 శాతం ఓట్లు..

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్లలో కనీసం 370 ఓట్లు సాధించడమే లక్ష్యంగా బీజేపీ పెట్టుకుంది. ఈ దిశగా పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సీనియర్ నేతలకు సమన్వయ బాధ్యతలు అప్పగించింది. ప్రతి రెండు, మూడు సెగ్మెంట్లకు ఒక జాతీయ స్థాయి నేత ఈ విధులు నిర్వహించనున్నారు. దీంతో పాటు 32 విభాగాలతో రాష్ట్రస్థాయి ఎన్నికల నిర్వహణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీని 8 క్లస్టర్లుగా విభజించి బాధ్యతలు అప్పగించనున్నారు. ప్రధాని మోదీకి జనాదరణ పెరిగిందని, ఇది తమ విజయావకాశాలను మరింత మెరుగుపరుస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది.

చేరికలతో మరింత బలోపేతం!

రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కేడర్ చేరికలతో తాము మరికొంత బలపడినట్లు బీజేపీ నాయకత్వం భావిస్తోంది. గడిచిన కొద్దిరోజుల్లో ఇద్దరు బీఆర్ఎస్ సిటింగ్ ఎంపీలతో పాటు పలువురు సీనియర్ నేతలు కాషాయ కండువాలు కప్పుకొన్న సంగతి తెలిసిందే. దీంతో తమకున్న సంప్రదాయ ఓటుబ్యాంకుకు వీరి చేరిక అదనపు బలం అవుతుందని పార్టీ ముఖ్యనేత ఒకరు అభిప్రాయపడ్డారు. మరోవైపు 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో తమ బలం, బలహీనతలను పరిగణనలోకి తీసుకున్న నాయకత్వం.. వాటిని ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించింది. గట్టి పట్టున్నట్లుగా భావిస్తున్న 10 పార్లమెంటు నియోజకవర్గాలను కేటగిరీ 'ఏ'లో చేర్చింది. గత ఎన్నికల్లో గెలుచుకున్న కరీంనగర్, నిజామాబాద్, సికింద్రాబాద్, ఆదిలాబాద్‌తో పాటు చేవెళ్ల, మహబూబ్‌నగర్, జహీరాబాద్, మల్కాజిగిరి, మెదక్, భువనగిరి నియోజకవర్గాలు ఈ జాబితాలో ఉన్నాయి. వరంగల్, నాగర్‌కర్నూలును 'బి' కేటగిరీలో చేర్చింది. మిగతా ఐదింటిని 'సి' కేటగిరీలో చేర్చారు. జహీరాబాద్ సిటింగ్ బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరడంతో ఆయన సామాజికవర్గం ఓటుబ్యాంకు తమకు అదనపు బలం అవుతుందని పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. మహబూబ్‌నగర్ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన డీకే అరుణ, ఈసారి కచ్చితంగా గెలుస్తానన్న ధీమాతో ఉన్నారు. ఇప్పటికే ఆమె విస్తృత ప్రచారం చేస్తున్నారు. పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో స్థానికంగా పట్టున్న ఇతర పార్టీల నేతలను ఆమె బీజేపీలో చేర్చుకుంటున్నారు.

పురపాలక అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయండి

- సీఎంకు రాష్ట్ర మునిసిపల్ కౌన్సిల్ ఫోరం వినతి

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన 16 కార్పొరేషన్ల తరహాలో పట్టణ ప్రగతి కోసం పురపాలక అభివృద్ధి బోర్డును కూడా ఏర్పాటు చేయాలని రాష్ట్ర మునిసిపల్ కౌన్సిల్ ఫోరం సీఎం రేవంత్‌ను కోరింది. ఈ సందర్భంగా రాష్ట్ర మునిసిపల్ కౌన్సిల్ ఫోరం చైర్మన్ భూక్యా రాము నాయక్ మాట్లాడుతూ పురపాలక ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి రూ. 2000 కోట్ల నిధులు కేటాయించి పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం దోహద పడాలని కోరారు. రాష్ట్రంలోని 142 మునిసిపాలిటీలలో అన్ని విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని విన్నవించారు. మునిసిపాలిటీలకు భవనాలు మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని చాంబర్ ఆఫ్ చైర్మన్ భవనం శిథిలావస్థలో ఉందని, నూతన భవనాన్ని మంజూరు చేయాలని రాము నాయక్ కోరారు.

తుంగభద్ర బోర్డు చైర్మన్‌గా వీరేంద్రశర్మ

తుంగభద్ర బోర్డు చైర్మన్‌గా వీరేంద్ర శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ గురువారం నిర్ణయం తీసుకుంది. వీరేంద్ర శర్మ ప్రస్తుతం బెంగళూరులో కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)కి చెందిన మానిటరింగ్ (సౌత్) ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటిదాకా కృష్ణా బోర్డు మెంబర్ సెక్రటరీగా ఉన్న డీఎం రాయిపూరే తుంగభద్ర బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చూసేవారు. ఆయన్ను తప్పించి వీరేంద్ర శర్మకు చైర్మన్‌గా అదనపు బాధ్యతలను కేంద్రం అప్పగించింది.

పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో 524 కోట్ల మోసం

- బ్యాంకు ఖాతాల నుంచి 32.34 కోట్లు అటాచ్ చేసిన ఈడీ

పార్ట్ టైం ఉద్యోగాల పేరుతో చేసిన మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) 580 బ్యాంకు ఖాతాల నుంచి రూ.32.34 కోట్లు అటాచ్ చేసింది. పర్యాటక, హోటళ్లు, రిసార్టుల వెబ్‌సైట్లకు లైకులు, రివ్యూలు ఇచ్చే పార్ట్ టైం ఉద్యోగంతో రోజుకు రూ.1,500 వరకు సంపాదించవచ్చంటూ అమాయకులను బురిడీ కొట్టించి సైబర్ కేటుగాళ్లు దేశవ్యాప్తంగా రూ.524 కోట్లు కొల్లగొట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో విచారణ చేపట్టిన ఈడీ దేశవ్యాప్తంగా 580 బ్యాంకు ఖాతాల నుంచి రూ.32.34 కోట్లు అటాచ్ చేసింది. వాట్సాప్, టెలిగ్రామ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో లైకులు, రివ్యూలు, 5 స్టార్ రేటింగ్ ఇచ్చి సులభంగా డబ్బు సంపాదించవచ్చని నిరుద్యోగులు, అమాయకుల్ని ఆకట్టుకునేలా సైబర్ కేటుగాళ్లు ప్రచారం చేస్తారు. వారి ఉచ్చులో చిక్కిన వారికి మొదట నమ్మకం కలిగేలా కొంత మొత్తం వారి ఖాతాల్లో జమచేస్తారు. ఆ తర్వాత ఎక్కువ మొత్తం సంపాదించవచ్చని ఆశ కలిగిస్తారు. ఈ క్రమంలోనే బ్యాంకు ఖాతా, వ్యక్తిగత వివరాలు తీసుకుని మోసాలకు పాల్పడుతుంటారు. ఇలా మోసపోయిన బాధితుల ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ తరహాలో సైబర్ నేరగాళ్ల మోసానికి సంబంధించి దేశవ్యాప్తంగా 50కిపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు తేలింది. సైబర్ కేటుగాళ్లు 175 బ్యాంకు ఖాతాలను ఉపయోగించి రూ.524 కోట్లు కొల్లగొట్టినట్లు విచారణలో తేలింది. ఈ బ్యాంకు ఖాతాల నుంచి ఆ మొత్తాన్ని 480 ఖాతాలకు మళ్లించి క్రిప్టో కరెన్సీ, హవాలా రూపంలో దేశం దాటించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు.

మరో కేసులో రూ.70 లక్షల స్థిరాస్తులు అటాచ్

బ్యాంకును మోసం చేసిన కేసులో హైదరాబాద్‌లోని జస్లీన్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన రూ.70 లక్షల విలువైన స్థిరాస్తులు అటాచ్ చేసినట్లు ఈడీ వెల్లడించింది. ఫోర్జరీ, నకిలీ పత్రాలతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.12 కోట్లు రుణం తీసుకుని మోసానికి పాల్పడ్డ కేసులో చెన్నై సీబీఐ అధికారులు జస్లీన్ ఎంటర్‌ప్రైజెస్‌పై కేసు నమోదు చేశారు.

కోర్టు ఆదేశాల ప్రకారం జైలులో వసతుల్లేవు!

- ములాఖత్‌లో భర్త అనిల్ దృష్టికి తీసుకొచ్చిన కవిత
- మంగళసూత్రం, మందులు, కళ్లజోడు, పుస్తకాలను అనుమతించాలని న్యాయవాది ద్వారా కోర్టుకు వినతి



న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో తిహాడ్ జైలులో ఉన్న కవితను భర్త అనిల్ కలిశారు. గురువారం ఉదయం 8 నుంచి 8.20 గంటల వరకు ములాఖత్‌లో భాగంగా కవితతో ఆయన మాట్లాడినట్లు తెలిసింది. జైలులో వసతులు, భోజనం తదితర విషయాలపై ఆరా తీసినట్టు సమాచారం. "చిన్న కుమారుడు ఆర్య 11వ తరగతి పరీక్షలు ఎలా రాస్తున్నాడు? అమ్మ బాగానే ఉందని ఆర్యతో చెప్పండి" అని అనిల్‌తో ఆమె చెప్పినట్లు తెలిసింది. కాగా, కోర్టు ఆదేశాల ప్రకారం జైలులో ఎలాంటి వసతులు, సౌకర్యాలు కల్పించడం లేదని ఆమె అనిల్ దృష్టికి తీసుకొచ్చినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విషయమై కవిత తరఫున న్యాయవాది... రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించినట్టు తెలిసింది. కవితకు జైలులో మంగళసూత్రం, కళ్లజోడు, పుస్తకాలు, మందులు అనుమతించాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం.

బాబోయ్.. ఎండలు!

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- నల్లగొండ జిల్లా తిమ్మాపూర్‌లో 42.4 డిగ్రీలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దారెత్తిస్తున్నాయి. మార్చి నెలాఖరులోనే ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మధ్యాహ్నం వేళ జిల్లాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. పశుపక్ష్యాదులు వేడికి సతమతమవుతున్నాయి. గురువారం నల్లగొండ జిల్లా తిమ్మాపూర్‌లో 42.4 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా అర్లి (టి)లో 42.3, అదే జిల్లా తలమడుగు, సూర్యాపేట జిల్లా తొగర్రాయి, మేడ్చల్ జిల్లా బాలానగర్‌లో 42.1, అదే జిల్లా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లిలో 42, యాదాద్రి భువనగిరి జిల్లా మల్యాలలో 41.8, రంగారెడ్డి జిల్లా నాగోల్‌లో 41.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశముందని పలు జిల్లాల్లో వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

- ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు ఇంటర్ బోర్డు హెచ్చరిక
- మార్చి 31 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించవద్దని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ కాలేజీలను ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశించింది. వేసవి సెలవులు మార్చి 31 నుంచి మే 31వ తేదీ వరకు ఉంటాయని, జూన్ 1 నుంచి కాలేజీలు పనిచేస్తాయని గురువారం అధికారులు వెల్లడించారు. ఈ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఎలాంటి తరగతులు నిర్వహించవద్దని, ఒకవేళ నిబంధనలు పాటించకుండా తరగతులు నిర్వహిస్తే కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోనున్నట్టు హెచ్చరించారు. కాగా, ఇంటర్మీడియట్ మొదటి ఏడాది అడ్మిషన్లను ఇప్పుడే చేపట్టవద్దని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి త్వరలో షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు.

జేఈఈ మెయిన్ పరీక్ష షెడ్యూల్‌లో మళ్లీ మార్పు

జేఈఈ మెయిన్ (సెషన్-2) పరీక్ష షెడ్యూల్‌లో మళ్లీ స్వల్ప మార్పు చేశారు. ఏప్రిల్ 4 నుంచి 15 వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) గత నెలలో ప్రకటించింది. తాజాగా ఈ పరీక్షలను ఏప్రిల్ 4 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొంది. సిటీ ఇంటిమేషన్ స్లిప్పుల విడుదల సందర్భంగా గురువారం ఓ ప్రకటనలో ఈ తేదీలను వెల్లడించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం పేపర్-1 (బీఈ/బీటెక్) పరీక్షలు ఏప్రిల్ 4, 5, 6, 8, 9 తేదీల్లో, పేపర్-2 పరీక్షను ఏప్రిల్ 12న నిర్వహించనున్నారు. పేపర్-1 పరీక్ష రెండు షిఫ్టుల్లో (ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు; మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు) జరగనుంది. పేపర్-2 పరీక్ష ఒకే షిఫ్టు (ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు) నిర్వహించనున్నారు.

జెన్‌కో ఏఈ, కెమిస్ట్ పరీక్ష వాయిదా

ఎన్నికల కోడ్ దృష్ట్యా అసిస్టెంట్ ఇంజనీర్స్ (ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్), కెమిస్ట్ ఉద్యోగాల భర్తీ కోసం తెలంగాణ జెన్‌కో నిర్వహించతలపెట్టిన కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) వాయిదా పడింది. ఈ నెల 31న పరీక్ష జరగాల్సి ఉంది. అయితే లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాయిదా వేస్తున్నామని, కోడ్ ఎత్తివేసిన తర్వాత పరీక్ష తేదీని www.tsgenco.co.in వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని జెన్‌కో సీఎండీ రిజ్వీ తెలిపారు.

నీట్, జేఈఈ సాధనకు 'కోటా' గ్రాండ్ టెస్ట్స్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నీట్-యూజీ, జేఈఈ అడ్వాన్స్‌డ్- 2024 పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం టెస్ట్ సిరీస్, గ్రాండ్ టెస్ట్స్ అండ్ సొల్యూషన్స్‌ను డిజిటల్ బుక్‌లెట్స్‌గా సిద్ధం చేసినట్లు 'కోటా పేజెస్' సంస్థ తెలిపింది. మరింత సమాచారం కోసం NEET 2024, JE-EA 2024 అని టైపు చేసి 98490-16661 నంబరుకు వాట్సాప్ మెసేజ్ చేయాలని సూచించింది.

పది బయోసైన్స్ ప్రశ్నపత్రంలో అసంబద్ధ ప్రశ్న

- విద్యార్థులు నష్టపోతారంటున్న విషయ నిపుణులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 28: పదో తరగతి పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన బయోలాజికల్ సైన్స్ ప్రశ్నపత్రంలోని పార్ట్-ఏ, సెక్షన్-2లో అడిగిన ఆరో ప్రశ్న విద్యా ప్రమాణాలకు, బ్లూప్రింట్‌కు విరుద్ధంగా ఉన్నట్లు బయోసైన్స్ ఉపాధ్యాయులు, విషయ నిపుణులు చెబుతున్నారు. దీంతో విద్యార్థులు సమాధానాలు రాయలేని పరిస్థితి ఏర్పడటం వల్ల వారు నష్టపోతారంటున్నారు. ఈ తరుణంలో పరీక్షకు హాజరైన విద్యార్థులందరికీ 4 గ్రేస్ మార్కులు కలపాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇక పార్ట్-ఏ సెక్షన్-2లోని 5వ ప్రశ్నలో ఇంగ్లిష్ మీడియంలో artificial vegetative propagation అని ఉండాల్సిన చోట vegetativeను విస్మరించారు. తెలుగు మీడియం ప్రశ్న పత్రంలో సరిగ్గానే ఉంది.

సంగారెడ్డి జిల్లాలో నకిలీ అధికారి గుట్టురట్టు

- సీసీఎల్ఏ ఆఫీసర్‌నంటూ వ్యక్తి హల్‌చల్
- ప్రభుత్వ భూముల పరిశీలన
- అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేతలు



సాయి అనిరుధ్

పటాన్‌చెరు, మార్చి 28: ప్రభుత్వ భూములు కాపాడేందుకు, అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం తనను ప్రత్యేక అధికారిగా నియమించిందని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పరిచయం చేసుకున్నాడు. రికార్డులు పరిశీలించాడు, అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేతలకు తెగబడ్డాడు. చివరికి అతను అధికారే కాదని తెలియడంతో ఇప్పుడు కటకటాలు లెక్కిస్తున్నాడు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువుకు చెందిన సాయి అనిరుధ్ (30) డిగ్రీ వరకు చదివాడు. వారం రోజులుగా అమీన్‌పూర్ తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయాలకువెళ్లి తాను సీసీఎల్ఏ నుంచి వచ్చిన ప్రత్యేక అధికారినని, ఇక్కడ ప్రభుత్వ భూములు కబ్జాకాకుండా, అక్రమ నిర్మాణాలు జరగకుండా చూసేందుకు ప్రత్యేకంగా తనను నియమించారని పరిచయం చేసుకున్నాడు. నమ్మిన అక్కడి వారు అతడు అడిగిన వివరాలు అందించారు. అంతటితో ఆగకుండా రెవెన్యూ సిబ్బందిని వెంటబెట్టుకుని పలు సర్వే నంబర్లలో ప్రభుత్వ భూములను పరిశీలించాడు. రెండు రోజుల క్రితం అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడాలోని ఓ కాలనీలో అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారని పంచాయతీ సెక్రటరీ రమేశ్‌కు చెప్పాడు. దగ్గరుండి ప్రొక్లెయిన్‌తో కొన్ని ఇళ్లను పాక్షికంగా ధ్వంసం చేయించాడు. అనుమానం వచ్చిన పటేల్‌గూడా పంచాయతీ సెక్రటరీ రమేశ్ పోలీసులకు సమాచారం అందించాడు. అనిరుధ్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, అసలు అధికారే కాదని తేలింది.

99.86 శాతం పోలింగ్

1439 మందిలో.. 1437 మంది ఓటేశారు.. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతం

మహబూబ్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 10 పోలింగ్ కేంద్రాల్లో గురువారం.. 1439 మంది ఓటర్లకు గాను 1437 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో పోలింగ్ శాతం 99.86గా నమోదైంది. 8 పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం సభ్యులు ఓటు వేయగా నాగర్‌కర్నూలు కేంద్రంలో బిజినేపల్లి మండలం గుడ్లనర్వ ఎంపీటీసీ సభ్యురాలు శారదమ్మ అమెరికాలో ఉండడంతో ఓటేయలేకపోయారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మంతన్‌గోడ్‌కు చెందిన సుమిత్ర పోలింగ్‌లో పాల్గొనలేదు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా మొదటి రెండు గంటలు మందకొడిగా సాగింది. గోవా, హైదరాబాద్, కర్ణాటక తదితర ప్రాంతాల్లో క్యాంపులకు వెళ్లిన ప్రజాప్రతినిధులు 11 గంటల తర్వాత పోలింగ్ కేంద్రాలకు రావడంతో మధ్యాహ్నం 2 గంటలకల్లా మెజారిటీ పోలింగ్ పూర్తయింది. క్రాస్ ఓటింగ్ ద్వారా గట్టెక్కుతామని కాంగ్రెస్ భావిస్తుంటే, బీఆర్ఎస్ మాత్రం ఎంత క్రాస్ ఓటింగ్ అవుతుందోనని ఆందోళన చెందుతోంది. లోక్‌సభ ఎన్నికల ముంగిట ఈ పోలింగ్ జరుగుతుండడంతో గెలుపుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ ఎన్నిక కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు భారీగా ఖర్చు చేశారు. తాయిలాలు, క్యాంపులకు రూ.కోట్లలో వెచ్చించారు. పోలింగ్ ముగిసిన వెంటనే



కొడంగల్‌లో ఓటు వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

బ్యాలెట్ బాక్సులను అధికారులు మహబూబ్‌నగర్‌లోని కాలేజీకి తరలించారు. ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఉదయం పోలింగ్ ప్రారంభమైన తర్వాత బీఆర్ఎస్ తరఫున రెండున్నర తులాల గోల్డ్ కాయిన్స్ పంచారని ప్రచారం జరగ్గా కాంగ్రెస్ తరఫున బీఆర్ఎస్ సభ్యులకు కూడా డబ్బులు ముట్టాయని వదంతులు వ్యాపించాయి. గద్వాల పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి, స్థానిక సీఐకి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మహబూబ్‌నగర్ కలెక్టర్ రవి గుగులోత్, అన్ని జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.


కొడంగల్‌లో ఓటు వేసిన సీఎం

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తన ఎక్స్ అఫీషియో ఓటును కొడంగల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కొడంగల్ చేరుకున్న ఆయన ఓటు వేసిన తర్వాత లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్‌లో, ఎమ్మెల్యేలు వారివారి నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో తమ ఎక్స్ అఫీషియో ఓటు వేశారు. ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అనూహ్యంగా షాద్‌నగర్‌లో ఓటు వేశారు.

కొడంగల్‌కు సిమెంట్ పరిశ్రమలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. త్వరలోనే కొడంగల్ ప్రాంతానికి సిమెంట్ పరిశ్రమలు రానున్నాయని చెప్పారు. ఈ ప్రాంతంలో సున్నపు గనులు ఉన్నా గత పాలకుల నిర్లక్ష్యంతో పరిశ్రమలు రాలేదన్నారు. సిమెంట్‌తోపాటు ఫార్మా పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కోకాపేటలో ఐటీ పరిశ్రమలు రావడం వల్లనే అక్కడి భూముల ధరలు పెరిగి ఎకరం రూ.100కోట్లు పలుకుతోందని, అక్కడి రైతులు శ్రీమంతులయ్యారని గుర్తు చేశారు. అదే మాదిరిగా ఇక్కడ కూడా పరిశ్రమలు వస్తేనే భూముల ధరలు పెరుగుతాయన్నారు. భూసేకరణకు ప్రజలు సహకరించకుంటే ఈ ప్రాంతం నష్టపోతుందన్నారు. సామాజిక అభివృద్ధి పనులకు భూములివ్వకుండా అడ్డుకోవడం మంచి పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేందుకు భవిష్యత్తులో మరోసారి అవకాశం వస్తుందో రాదో తెలియదని, వచ్చిన దాన్ని సద్వినియోగం చేసుకుందామని చెప్పారు. భూసేకరణలో పట్టా భూములకు ఎంత ధర ఇస్తామో.. అసైన్డ్ పట్టా రైతులకు కూడా అంతే ధర చెల్లించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. తాను ఎక్కడున్నా ఓ కన్ను కొడంగల్‌పై ఉంటుందన్నారు. అభివృద్ధి అంటే రానున్న రోజుల్లో కొడంగల్‌నే ఆదర్శంగా తీసుకునేలా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్‌తో లక్ష ఎకరాలకుపైగా నీరు అందనుం



దని చెప్పారు. కొడంగల్ అభివృద్ధికి అంతా కలిసి రావాలని కోరారు. తాను ఏ స్థాయికి ఎదిగినా కొడంగల్ కుటుంబ సభ్యుడినే అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి కొడంగల్ నుంచి 50 వేల మెజార్టీ అందించి తన గౌరవాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 6న రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ బహిరంగ సభకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి బలాన్ని ఢిల్లీలో చాటేలా లోక్‌సభ ఎన్నికల్లో తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రేవంత్‌ను కలిసిన నీలం మధు

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించడంపై సీఎంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

యేసు బోధనలు మానవాళికి స్ఫూర్తిదాయకం

- గవర్నర్, సీఎం గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. యేసు చూపిన కరుణ, సేవ, ప్రేమ మార్గంలో అందరం పయనించాలన్నారు. యేసు బోధనలు మానవాళికి ఎంతో స్ఫూర్తిదాయకమని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాంతి, కరుణ సందేశాలతో పాటు యేసు క్రీస్తు నేర్పిన త్యాగం, సేవ, దయ, ప్రేమ, సోదరభావం ఎన్నటికీ మానవాళికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. యేసు త్యాగాల జ్ఞాపకంగా జరుపుకొనే గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదర, సోదరీమణులు ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన యేసుక్రీస్తు త్యాగాన్ని, ధైర్యాన్ని గుర్తు చేసుకున్నారు. మంత్రి సీతక్క కూడా అందరికీ గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు.

అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య

- రోటవేటర్‌లో పడి రైతు దుర్మరణం
- విద్యుదాఘాతంతో మరొకరు మృతి

గద్వాల క్రైం, మధిర రూరల్, గూడూరు, మార్చి 28: అప్పుల బాధతో ఓ అన్నదాత ఆత్మహత్య చేసుకోగా, పొలం పనులు చేస్తుండగా ప్రమాదాలకు గురై ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. వివరాలిలావున్నాయి. గద్వాల పట్టణంలోని సుంకులమ్మ మెట్టు సమీపంలో నివాసం ఉంటున్న రైతు బద్రి నారాయణ(65) కొంతకాలంగా పంటలు చేతికి రాకపోవడంతో రూ. 10 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. వీటికి వడ్డీలు పెరగడంతో మనస్తాపానికి గురై గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం జిల్లా మధిర మండలం నిధానపురంలో రైతు అమరవాది నర్సిరెడ్డి (56) కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేశాడు. పంట కాలం పూర్తికావడంతో గురువారం చేనులోని మిర్చి చెట్లను తొలగించటానికి ట్రాక్టర్‌కు రోటవేటర్‌ను తగిలించుకొని పొలానికి వెళ్లాడు. చెట్లను తొలగిస్తుండగా అడ్డుపడిన చెత్తను తీసే యత్నంలో ప్రమాదవశాత్తు రోటవేటర్‌లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మదనాపురం శివారు దూపతండాకు చెందిన రైతు మాలోతు లాలు (45) గురువారం మిర్చి, పత్తి పంటలకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. నీరు రాకపోవడంతో బావిలోకి దిగి మోటారుకు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు.

చేనేతలకు పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి: చాడ

హైదరాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి చేనేతలకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి లేఖ రాశారు. పెండింగ్ బకాయిల కోసం 45 రోజులుగా చేనేతలు ఆందోళనలు, నిరవధిక నిరాహారదీక్షలు చేస్తున్నారని, భిక్షాటన కూడా చేస్తున్నారని లేఖలో ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలకు సంబంధించి రూ.270 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, అవి చెల్లించకపోవడంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మూతపడి ఉపాధి కరువై చేనేతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చాడ వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ


నివేదికలు, నిజాలు!

వికసిత భారత్, అచ్చేదిన్, అమృత్‌కాల్ ఇత్యాది అద్భుతపదజాలంతో ఎన్నికల్లో ఘన విజయాలు సాధించాలని భారతీయ జనతాపార్టీ అనుకుంటూంటే, దేశంలో పరిస్థితులు అంత పచ్చగా ఏమీ లేవని, పైగా దిగజారిపోతున్నాయని ఇటీవల వెలువడిన నివేదికలు తేల్చేస్తున్నాయి. ఉపాధి దెబ్బతిన్నదనీ, అసమానతలు ఆకాశాన్నంటాయని, సగం బలం అనుకున్న సంతోషానికి కూడా ఈ దేశపౌరుడు నోచుకోవడం లేదని ఆ సూచికలూ సర్వేలు హెచ్చరిస్తున్నాయి. భారతదేశంలో కొందరు పోగేస్తున్న సంపద గురించి, అసంఖ్యాకులైన సామాన్యజనం సంపాదన కృశించిపోవడం గురించి ఎంతోకాలంగా చదువుతున్నదీ, చూస్తున్నదే మరోమారు మన కళ్ళముందు ఆవిష్కృతమైంది.

నోబెల్ విజేత థామస్ పికెట్టీ సహా నలుగురు ఆర్థికవేత్తలు తయారుచేసిన నివేదికకు ఓ ప్రత్యేకస్థానం ఉంది. బ్రిటీషువాడి ఏలుబడిలో కంటే ఇప్పుడే భారతదేశంలో అసమానతలు అధికంగా ఉన్నాయని ఈ వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ అధ్యయనపత్రం హెచ్చరిస్తున్నప్పుడు అవమానం కలగడం సహజం. అందుకే కాబోలు, దానిమీద అనుమానాలు రేపే కార్యక్రమం కూడా వెంటనే మొదలైంది. కానీ, భారతదేశాన్ని ప్రత్యేకంగా తప్పుడు లెక్కలతో తప్పుబట్టడం వల్ల సదరు ఆర్థికవేత్తలకు ఒరిగేదేమీ ఉండదు. పైగా, వారు చెప్పిన విషయాలు మన ఊహకు అందనివీ కావు. ఆదాయ అసమానతల్లో మనదేశం దక్షిణాఫ్రికాలను, దక్షిణమెరికాలను సైతం దాటేసిందని ఈ పత్రం హెచ్చరిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలిదశాబ్దాల్లో బలహీనుల పక్షాన నిలిచిన దేశం, ఆర్థిక సంస్కరణల అనంతరకాలంలో బిలీయనీర్ల రాజ్యంగా అవతరించిందని చెబుతోంది. ఒకశాతం అపరకుబేరుల దగ్గర నలభైశాతం దేశ సంపద పోగుపడిందని అంటూ, 1982నాటికి వీరి ఆదాయాలు, సంపదలు ఎలా ఉన్నాయో, అనంతర దశాబ్దాల్లో అవి ఎంతవేగంగా వృద్ధిచెందాయో వివరించింది. ఆర్థిక సంస్కరణలతోనూ, అనంతరం ప్రస్తుత పాలకుల ఏలుబడిలోనూ అపరకుబేరుల సంఖ్యలోనూ, వారి ఆదాయాల్లో అనూహ్యమైన పెరుగుదల ఉందని అర్థం. 167 సంపన్న కుటుంబాలమీద ఓ రెండుశాతం అధికంగా పన్నువేస్తే జాతీయ ఆదాయంలో అరశాతం పెరుగుతుందట. గత దశాబ్దిన్నరలోనే అసమానతలు అమితవేగంగా హెచ్చాయని ఈ పత్రం పునరుద్ఘాటించడంతో పాటు శతకోటీశ్వరులమీద విధించే పన్నుల విధానంలోనూ విప్లవాత్మకమైన మార్పులు రావాలని ఆకాంక్షించింది. కానీ, కుబేరులతో పాలకులకు ఉన్న పేగుబంధం తెలిసిందే. ఆర్థిక వ్యత్యాసాలను చక్కదిద్దడానికి ఈ పత్ర రచయితలు చేసిన చక్కని సూచనలు ఈ ప్రభుత్వాలకు పట్టవు. దేశ ఆర్థికరంగం ఎదుగుతున్నదనీ, అగ్రరాజ్యాలను దాటేస్తున్నామని గర్విస్తున్న దశలో, కార్మికశక్తిని సద్వినియోగపరచడంలోనూ, ఉపాధి కల్పించడంలోనూ ఎంతో వెనుకబడివున్నామని మరో నివేదిక హెచ్చరిస్తోంది. శ్రామికశక్తిలో నైపుణ్యాలను పెంచడం, తయారీరంగాన్ని అభివృద్ధిపరచడంతో పాటు మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు ఆచరణలో ఎందుకు విఫలమైనాయన్నది సమీక్షించుకోవడం అవసరం. శ్రామికశక్తిలో దాదాపు సగం ఇంకా వ్యవసాయరంగంమీదే ఆధారపడి బతుకులీడ్వడం సరికాదు. డెమోగ్రాఫిక్ డివిడెండ్ గురించి ఉపన్యాసాలు ఇచ్చేముందు ఉన్న శక్తిని సద్వినియోగం చేసుకోవడం, మిగతారంగాలకు విస్తరించడం మీద దృష్టిపెట్టాలి. చదువున్నవారు, లేనివారు కూడా ఒకే దుస్థితిలో ఉన్నట్టు ఈ నివేదిక తేల్చింది. పదేళ్ళకాలంలో పాతికకోట్లమంది పేదలు పేదరికం నుంచి విముక్తిపొందారని పాలకులు పనిగట్టుకొని మరీ ప్రచారం చేసుకుంటారు. కానీ, ఉపాధికీ ప్రభుత్వానికీ సంబంధం లేదని కేంద్రప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వాదిస్తారు. ఆర్థికంగా అతివేగంగా ఎదుగుతున్న అత్యధికజనాభా గల ఈ దేశం యువత ఎదుర్కొంటున్న సమస్యను విస్మరించడం ప్రమాదం. మరిన్ని ఉద్యోగాలు ఇవ్వండి, ఉపాధి కల్పించండి అంటూ పరిశ్రమల సంఘాలకు, సమాఖ్యలకు విజ్ఞప్తిచేయడంతో సరిపెట్టకుండా, నిరుద్యోగికతను నిర్మూలించే విషయంలో కలసికట్టుగా పనిచేయడం అవసరం.

పదేళ్ళుగా నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు పేదల బతుకులను మార్చివేశాయని, పేదరికంగా నుంచి బయటపడవేశాయని భారతీయ జనతాపార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. కానీ, ఆకలినుంచి ఆనందం వరకూ ప్రతీ విషయంలోనూ పరిస్థితులు దిగజారాయని, ఇరుగుపొరుగు చిన్నాచితకా దేశాలకంటే మనం దయనీయంగా ఉన్నామని ఇటువంటి నివేదికలు ఎప్పటికప్పుడు గుర్తుచేస్తూనే ఉన్నాయి.

నిరంకుశత్వం వైపు పరిగెడుతున్న ప్రజాస్వామ్యం



> కఠోర వాస్తవం ఏమిటంటే, ప్రపంచం మొత్తం ప్రస్తుతం 'నిరంకుశత్వాలు, ప్రజాస్వామ్యాలు'గా విడిపోయింది. మనం అనుకుంటున్న మెజారిటీ ప్రజాస్వామ్యాలు కూడా దాదాపుగా అర్ధ నిరంకుశాలే. ప్రజాస్వామ్యం భవిష్యత్తు విషయంలో అసంతృప్తి సర్వత్రా వ్యక్తమవుతున్నది.

ప్రజాస్వామ్య ప్రభుత్వాల ఏర్పాటు దిశగా గణనీయమైన పురోగతి భారత ఉపఖండంలోనూ, సమీప తూర్పు దేశాల్లోనూ ఏనాడో ఆరంభమైంది. సమాజంలో 'స్వేచ్ఛ, ఆమోదయోగ్యత, సమానత్వం, సమగ్రత'ల ప్రాతిపదికగా, సనాతన భారతీయ ధర్మానికి అనుగుణంగా, పౌరులకు నాణ్యమైన, గౌరవప్రదమైన జీవనం లభించేలా పరిఢవిల్లిన మహత్తర ప్రజాస్వామ్య భావన భారతదేశం స్వంతం. భారతదేశంలోని సర్వతంత్ర స్వతంత్ర గణతంత్ర రాజ్యాల నాటి నుండే తొలినాటి ప్రజాస్వామ్య సంస్థల ఆవిర్భావం జరిగిందని చరిత్ర చెపుతున్నది. ప్రాచీన భారతావనిలోనే ప్రజాస్వామ్య రాష్ట్రాలు ఉద్భవించాయని గ్రీక్ చరిత్రకారుడు డియోడోరస్ సైతం ధ్రువీకరించాడు.

భారతదేశంతో సహా బ్రిటీష్ సామ్రాజ్య పరిధిలోని పలు దేశాలు బ్రిటీష్ పార్లమెంట్ విధానాన్ని స్వీకరించాయి. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం, 1950లో రాజ్యాంగం ఏర్పడినాక, సమాఖ్య విధాన పార్లమెంటరీ తరహా ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు కావడంతో, ఆధునిక ప్రజాస్వామ్యం ప్రారంభమైంది. భారత మొదటి ప్రధానమంత్రి నెహ్రూ ప్రజాస్వామ్యానికి పటిష్ఠమైన పునాదులు వేసినప్పటికీ, అడపాదడపా అనేక అవాంతరాలను ఎదుర్కుంటూ నిలదొక్కుకుంది. 'ఆధునిక ప్రజాస్వామ్యానికి ఆద్యుడు'గా అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్‌ను పేర్కొంటారు. మరో మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ ప్రజాస్వామ్యాన్ని "ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకొనే ప్రభుత్వం"గా నిర్వచించాడు. ఆంగ్లేయ తత్త్వవేత్త, వ్యావహారిక సత్తావాదం స్థాపకుడు జాన్ లాక్‌ను కూడా 'ప్రజాస్వామ్య పితామహు'డని అంటారు.

ప్రజలచే పాలన అనే స్ఫూర్తికి కాని, పౌరులకు తాము కోరుకునే, తమ గొంతు వినే వ్యవస్థగా కాని ఆధునిక ప్రజాస్వామ్యం కట్టుబడిలేదనాలి. అప్పుడప్పుడో, ఒక క్రమపద్ధతిలోనో, న్యాయబద్ధంగానో అన్యాయబద్ధంగానో నిర్వహిస్తున్న ఎన్నికలు మాత్రమే ప్రజాస్వామ్యానికి నిదర్శనం, గీటురాయి అనే అపోహ కలుగుతున్నది. కఠోర వాస్తవం ఏమిటంటే, ప్రపంచం మొత్తం ప్రస్తుతం 'నిరంకుశత్వాలు, ప్రజాస్వామ్యాలు'గా విడిపోయింది. వాస్తవానికి మనం అనుకుంటున్న మెజారిటీ ప్రజాస్వామ్యాలు కూడా దాదాపుగా అర్ధ నిరంకుశాలే. ప్రజాస్వామ్యం భవిష్యత్తు విషయంలో అసంతృప్తి సర్వత్రా వ్యక్తమవుతున్నది.

పరిపక్వత చెందిన ప్రజాస్వామ్యంలో నాయకులు ప్రజల భాగస్వామ్యాన్ని, సలహాలను, సూచనలను స్వాగతిస్తారు, ప్రోత్సహిస్తారు. అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి పుష్కలంగా అవకాశాలు కలిగించి, విభిన్న దృక్కోణాలకు విలువ ఇస్తారు. అలాంటి ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం పాత్ర తక్కువ నియంత్రణలు కలిగిందిగా, ప్రజలు నమ్మినదాన్ని, కోరుకున్న దాన్ని సులభతరంగా పొందడానికి సహకరించేదిగా ఉంటుంది. ప్రజలు తాము ఎంపికచేసుకున్న రాజకీయ పార్టీలోకాని, ఇతర సమూహాలలోకాని నిరభ్యంతరంగా చేరే అవకాశం ఉంటుంది. ప్రజాస్వామ్యం పరిపక్వత చెందక, నియంతృత్వ ధోరణులు ఉన్న చోట పార్టీ, ప్రభుత్వం, దేశంపై సంపూర్ణ నియంత్రణ చేసే ఒకే ఒక్క నాయకుడు వుంటాడు.

'నిరంకుశ తరహా ప్రజాస్వామ్య నాయకత్వం', 'ప్రజాస్వామ్య నియంతృత్వం' అనే రెండు విచిత్ర ప్రజాస్వామ్య విధానాలు ఇటీవలికాలంలో ఆవిర్భవించి, పుంజుకుంటున్నాయి. ఈ రెండింటిలోనూ నిర్ణయాధికారాలన్నీ ఒకే ఒక్క వ్యక్తి (నాయకుడు) చేతుల్లో కేంద్రీకృతమై ఉంటున్నాయి. క్యాబినెట్ సహచరులతో సహా, పౌర సంఘాల, బ్యూరోక్రాట్ల, మేధావుల, వివిధ రంగాలకు చెందిన నిపుణుల సూచనలు కూడా ససేమిరా పట్టించుకోని పరిస్థితి ఉంటున్నది.

భారతదేశానికి సంబంధించినంత వరకు 'ప్రజాస్వామ్య నియంతృత్వం' ఇందిరాగాంధీ పాలనలో మొదలైందని చెప్పాలి. ప్రాంతీయపార్టీల ఆవిర్భావంతో, వ్యవస్థాపకుడి తిరుగులేని ఆధిపత్యం ప్రజాస్వామ్యానికి ఇబ్బందికరంగా మారిందనవచ్చేమో!

స్వాతంత్ర్యానంతర భారతావనిలో రాజకీయ పార్టీల నిర్ణయాధికారం ఒక అద్భుతమైన 'టీం వర్క్'లాగా ఉండేది. కాంగ్రెస్ పార్టీ 'పార్లమెంటరీ బోర్డ్' కానీ, కమ్యూనిస్ట్ పార్టీ 'పోలిట్ బ్యూరో' కానీ, అలాంటి ఏర్పాటే ఉన్న జనసంఘ్ లేదా దాని రూపాంతరమైన భారతీయ జనతా పార్టీ కాని, 'ఏకాభిప్రాయం' ఆధారంగా నిర్ణయాలు తీసుకునేవి. క్రమేపీ 'ఏకాభిప్రాయం' అర్థమే మారిపోయి, 'ఏక వ్యక్తి అభిప్రాయం'గా, ఏకస్వామ్యంగా మారింది.

ఒకానొక కాలంలో ఏ రాజకీయ పార్టీలోనైనా అంచెలంచెలుగా నిచ్చెన మెట్లు ఎక్కాలంటే పార్టీ ప్రాథమిక సభ్యత్వం తప్పనిసరి. అదిప్పుడు పూర్తిగా గత చరిత్ర. అలాగే సర్పంచ్ స్థాయి నుంచి కేంద్రమంత్రి స్థాయికి ఎదిగేవారు. ఇక ఇప్పుడు అన్నీ సత్వరమార్గాలే! చిలక్కొయ్యకు తగిలించిన చొక్కాలు మార్చినంత సులభం. మరీ చెప్పాలంటే, రసాయన శాస్త్రంలోని 'సబ్లిమేషన్' ప్రక్రియలో ఒక పదార్థం నేరుగా ఘనస్థితి నుండి మధ్యస్థ ద్రవస్థితి దాటవేసి, వాయుస్థితికి మారడంలాగా. చాలామందిలో రాజకీయ భావజాలం కాని, నిబద్ధత కాని అసలే లేవు. ఒక హార్డ్‌కోర్ కమ్యూనిస్ట్ పార్టీ వ్యక్తి, లేదా నిబద్ధతగల ఒక సెక్యులర్ పార్టీ సభ్యుడు, రాత్రికి రాత్రే సభ్యత్వంతో సంబంధం లేకుండా, మతతత్త్వ పార్టీ పక్షాన ఎన్నికల బరిలో దిగుతున్నారు. అలాగే ఇటు నుండి అటు మారుతున్నారు. అలా మారినవారికి వెంటనే పార్టీ టికెట్ ఇవ్వకూడదన్న నిబంధన పెట్టే ధైర్యం ఎన్నికల కమీషన్కు ఏమాత్రం లేదు. పలుకుబడి కలవారికి, సంపన్నులకు, పార్టీ సభ్యత్వం తీసుకుని, కొంతకాలం వేచి వుండి, ఆ తరువాతే ఎన్నికలలో పోటీ చేయాల్సిన అవసరం లేనే లేదు. దీన్నే ఆంగ్లంలో 'లీప్ ఫ్రాగింగ్' అంటారు. రాజకీయ పార్టీగా నమోదు చేసుకుంటున్నప్పుడు ఉన్నతమైన ఆదర్శాలను వల్లించని రాజకీయపార్టీ వుండదు. ఆచరణలో మాత్రం శూన్యం.

ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగానూ, భారతదేశంలోనూ, కొన్ని రాష్ట్రాలలోనూ చోటుచేసుకుంటున్న కొన్ని సంఘటనల అంతరార్థాలను నిశితంగా అవగతం చేసుకున్న వారిని ఆందోళనకు కలుగుతున్నది. కాంగ్రెస్ పార్టీ హిందు సమాజాన్ని అణచి వేసేందుకు వక్రీకరించిన రాజ్యాంగాన్ని మార్చాలంటే తమ పార్టీకి 400 లోక్‌సభ స్థానాలు అవసరమౌతాయని కర్నాటక బీజేపీ ఎంపీ అనంత్ కుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలు జుగుప్సాకరంగా ఉన్నాయి. బీజేపీ అధినాయకత్వం ఆ వ్యాఖ్యలను ఖండించినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిదంబరం ఆ మాటలు 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ముగింపు'గా ముద్రవేశారు.

డాక్టర్ ఎన్. భాస్కర రావు అనే ఒక సామాజిక పరిశోధనా మార్గదర్శి 'రెజువెనేటింగ్ ద రిపబ్లిక్' అనే తన ఆంగ్ల పుస్తకంలో ప్రజాస్వామ్యంపై వ్యాఖ్యానిస్తూ– చాలామంది భారతీయులకు, అందునా యువతకి, స్వాతంత్ర్య సౌధం ఎంతమంది త్యాగాల పునాది మీద నిర్మించబడిందో అవగాహన లేదంటారు. వారికి స్వాతంత్ర్యం, గణతంత్రం, రాజ్యాంగం లాంటివాటి ద్వారా ప్రయోజనాలు పొందడం మాత్రమే కావాలని చెబుతారు. నిజానికి ఇన్ని దశాబ్దాల కాలంలో దేశ గణతంత్ర పరిస్థితి ఒకేలా స్థిరంగా లేదని, మొదటి 25 సంవత్సరాలు ఒకే ఒక పార్టీ పెత్తనం నడిచిందని, తరువాతి 25 యేళ్లలో సంకీర్ణ ప్రభుత్వాలు నడిచాయని, ప్రస్తుతం ఒకే నాయకుడు, ఒకే పార్టీ అన్న లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయని చెబుతారు. ఇదే పంథా మరొక 25 యేళ్ల సాగుతుందా అన్నది ప్రజల ఊహాగానాలకే వదిలేద్దామంటారు.

ఏటా ప్రపంచ దేశాలలో ప్రజాస్వామ్య పరిస్థితుల మీద నివేదిక విడుదల చేసే 'వెరైటీస్ ఆఫ్ డెమోక్రసీస్' అనే సంస్థ తన నివేదికలో నియంతృత్వం పరంగా ప్రపంచ దేశాలలో భారత్ 'విశ్వగురు' స్థానంలో ఉందని పేర్కొంది. ఎన్నికలు జరిగే నియంతృత్వ దేశం స్థాయికి భారత దేశం పడిపోయిందని వెల్లడించింది. భారత్ అసలు ప్రజాస్వామ్య దేశంగానే లేదని తీర్మానించింది. అలాగే, మూడింట రెండువంతులకు పైగా భారతీయులు దేశంలో 'నిరంకుశ' లేదా 'సైనిక' పాలనకు మద్దతు ఇస్తున్నట్లు 'ప్యూ రీసర్చ్ సెంటర్' నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఇలాంటి కథనాలు భారత దేశంలో ప్రజాస్వామ్య పరిస్థితిపై ఆందోళన కలిగిస్తున్నాయి.

• వనం జ్వాలానరసింహారావు

అప్పలసూరి చరిత్ర కోసం

మామిడి అప్పలసూరి జీవితచరిత్ర ఈపాటికే గ్రంథస్థం కావలసింది. సూరి జీవితచరిత్ర అంటే ఓ విధంగా అది సామాజికచరిత్ర. సామాజిక సంఘర్షణ చరిత్ర. మరీ ముఖ్యంగా శ్రీకాకుళ రైతాంగ పోరాట చరిత్ర! దురదృష్టవశాత్తూ చరిత్ర సృష్టించిన వాళ్ళెవరూ చరిత్రను రాయలేరు (ఎక్కడో కొద్దిమంది తప్ప). భారతదేశ రాజకీయాలను పార్లమెంటరీయేతర సాయుధ రాజకీయబాటకు మలుపు తిప్పిన శ్రీకాకుళ రైతాంగ పోరాటం చారిత్రాత్మకమైనది. కానీ ఆ పోరాటాన్ని చేసినవారెవరూ ఆ చరిత్రను రాయలేరు. అధికశాతం ఆదివాసీలు, దళితులు కావటం, రైతాంగం కావటం... కొన్నికారణాలు. ఆ పోరాటంలోకి దూకిన ఉపాధ్యాయులు, వైద్యులు, ఉద్యోగులు, మేధావులు, నాయకులూ కూడా రాయలేకపోయారు, పోరాటంలో మునిగీ తేలటాన, కొందరు అమరులవటాన! ఆ పోరాటానికి అయిదు దశాబ్దాల తర్వాత కూడా ఆ పోరాట చరిత్ర రావలసినంత సమగ్రంగా రానేలేదు. 1997 మార్చి 21న అమరులైన మామిడి అప్పలసూరి జీవిత చరిత్ర ఎప్పుడో రావలసీ, రాకపోవడంలో ఇదిగో ఇన్నిన్ని కారణాలున్నవి.

కోమర్తిలో ఆరంభించిన వ్యవసాయకార్మిక సంఘం (1956?) నుండీ వ్యవసాయక విప్లవం (దున్నేవానికే భూమి కీలక నినాదంగా సాగిన విప్లవోద్యమం) దాకా అప్పలసూరి కీలకపాత్ర పోషించేరు. సాయుధబాటను సమర్థించారు. తరువాత సవరణ జరగాలన్నారు. సాయుధబాట కాలంలో పోలీసు కస్టడీల నుంచీ, చెరసాల నుంచీ పరారై ఉద్యమాలు నిర్మించారు. ఎనభైల తర్వాత మైదాన ప్రాంత ప్రజా ఉద్యమాలు నిర్మాణం చేశారు. ఇలా ఎన్నెన్నో సంఘటనలు అప్పలసూరి జీవనయానంలో జరిగాయి.

అప్పలసూరి జీవించి ఉండగా వివరాలు సేకరించకపోవటం, అప్పలసూరి సహచరులు జీవించి ఉండగా కూడా సేకరించకపోవటం, కొద్దిమంది (తేజేశ్వరరావు లాంటి వారు) జీవించివుండినా జ్ఞాపకశక్తి సన్నగిల్లటంతో అసమగ్ర సమాచారమే దొరుకుతోంది. దుప్పల గోవిందరావు, చౌదరి



సంపూర్ణమ్మ, డా. బి.శివరామిరెడ్డి, భూపాల్‌రెడ్డి వంటి కొందరు కొన్ని ముఖ్యమైన ఘటనలను, వారి జ్ఞాపకాలమేర అందించేరు. అప్పలసూరి రాసిన డైరీలలో కొంత, పార్వతీపురం కుట్రకేసు ఛార్జిషీట్లలో కొంత, ఇంకా చెరుకూరి సత్యనారాయణ 'సూర్యోదయం కుట్ర కాదు' పుస్తకం, డా. బి.శివరామిరెడ్డి 'మహత్తర శ్రీకాకుళ పోరాటం' పుస్తకాల నుంచి మరికొన్ని ఆధారాలతో సాధ్యమైనంత విషయసేకరణ జరుగుతోంది. వీటన్నిటితో 'మండేటి సూరీడు... మామిడి అప్పలసూరి' పుస్తకాన్ని తీసుకు రానున్నాం.

1980లో అప్పలసూరి జైలు నుంచి విడుదలై వచ్చిన తర్వాత మైదాన ప్రాంతంలో– ముఖ్యంగా అటు బొబ్బిలి, పార్వతీపురం తాలూకాలలో, ఇటు నరసన్నపేట, శ్రీకాకుళం తాలూకాలలో– ఉద్యమాలు నిర్మించారు. తనదైన రాజకీయ పంథాలో సీవోసీలో కొనసాగుతూ రైతాంగ పేదల సమితి సంస్థ ద్వారా వ్యవసాయ రంగ పేదలను, ప్రగతిశీల కార్మిక సంఘం సంస్థ ద్వారా కార్మికులను కదలించి మిలిటెంట్ పోరాటాలు నడిపేరు. సాంస్కృతిక రంగంలో కూడా జనకళామండలి నిర్మాణంతో ప్రజలను చైతన్యపరిచేరు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా సాగిన ఆ ఉద్యమాలూ, వాటి వెనక అప్పలసూరి కృషీ చెప్పగలిగే వారుండినా ఎందరిని సంప్రదించగలమో, వారెంత వివరించగలరో చూడాలి.

నిజానికి మామిడి అప్పలసూరిపై ఈ పుస్తకాన్ని మార్చి 21 అప్పలసూరి వర్ధంతి నాటికే తేవాలనుకున్నాం గానీ విషయసేకరణ తగిన సమయంలో జరగలేదు. అంచేత కవర్ పేజీ మాత్రమే కోమర్తి అమరవీరుల స్తూపం వద్ద ఆవిష్కరించేం. ఈ ఏడాది మే 4 న మామిడి అప్పలసూరి సహచరి మామిడి లచ్చమ్మ వర్ధంతి రోజుకు పుస్తకాన్ని తేదలిచాం. ఈలోగా అప్పలసూరికి సంబంధించిన ఏ అనుభవమైనా, ఏ విశేషమైనా మీ దగ్గర ఉంటే మాకు అందించి, అప్పలసూరి చరిత్రను సమగ్రం చేయడానికి సహకరించ కోరుతున్నాం. ఆ వివరాలను 94400 31961 ఫోన్ నెంబరుకు వాట్సాప్ చేయగలరు.

• అట్టాడ అప్పల్నాయుడు
(కోమర్తి అమరవీరుల స్మారక కమిటీ తరఫున)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

చైతన్య స్ఫూర్తి స్మరణానంద



లోక్‌సభ ఎన్నికల పండుగ హడావిడి సమయాన ఓ వార్త మనసులో కొన్ని క్షణాల పాటు అలజడిని సృష్టించింది. భారతదేశ ఆధ్యాత్మిక స్పృహలో అగ్రగణ్యుడైన శ్రీమత్ స్వామి స్మరణానంద జీ మహరాజ్ శివైక్యం చెందడం వ్యక్తిగత నష్టం లాంటిది. కొన్ని సంవత్సరాల క్రితం, స్వామి ఆత్మస్థానంద జీ మహా మరణం, ఇప్పుడు స్వామి స్మరణానంద జీ శాశ్వతంగా నిష్క్రమించడం చాలా మందిని విషాదంలోకి నెట్టింది. కోట్లాది మంది భక్తులు, సాధువులు, రామకృష్ణ మఠం, మిషన్ అనుచరుల మాదిరిగానే నా హృదయం కూడా బాధగా ఉంది.

ఈనెల ప్రారంభంలో బెంగాల్ పర్యటనకు వెళ్లినప్పుడు, స్వామి స్మరణానంద ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు ఆస్పత్రికి వెళ్లాను. స్వామి ఆత్మస్థానంద మాదిరిగానే, ఆచార్య రామకృష్ణ పరమహంస, మాతా శారద మరియు స్వామి వివేకానంద ఆలోచనల ప్రపంచవ్యాప్తవ్యాప్తికి స్వామి స్మరణానంద తన జీవితాన్ని అంకితం చేశారు. ఈ వ్యాసం రాస్తున్నప్పుడు ఆయనతో జరిపిన సమావేశాలు, ఆయనతో నా సంభాషణలు, ఆ జ్ఞాపకాలు నా మదిలో సజీవంగా ఉన్నాయి.

2020 జనవరిలో బేలూరు మఠంలో ఉన్న సమయంలో స్వామి వివేకానంద గదిలో కూర్చొని ధ్యానం చేశాను. ఆ పర్యటనలో నేను స్వామి స్మరణానందతో ఆత్మస్థానందజీ గురించి చాలాసేపు మాట్లాడాను. రామకృష్ణ మిషన్‌తో, బేలూరు మఠంతో నాకు ఎంత సన్నిహిత సంబంధం ఉందో మీకు తెలుసు. ఒక ఆధ్యాత్మిక సాధకుడిగా, గత ఐదు దశాబ్దాలుగా, నేను పలువురు సాధువులను, మహాత్ములను కలిశాను, అనేక ప్రదేశాలకు వెళ్ళాను. రామకృష్ణ మఠంలో కూడా ఆధ్యాత్మికతకు తమ జీవితాలను అంకితం చేసిన సాధువులతో నాకు పరిచయం ఏర్పడింది. వారిలో స్వామి ఆత్మస్థానందజీ, స్వామి స్మరణానంద జీ వంటి ప్రముఖులు ఉన్నారు. జీవితంలో అత్యంత ముఖ్యమైన కాలంలో, అటువంటి సాధువులు నాకు ప్రజా సేవయే దేవునిసేవ అనే నిజమైన సూత్రాన్ని బోధించారు. 'ఆత్మనో మోక్షార్థ జగద్ధితాయ చ' అనే రామకృష్ణ మిషన్ సిద్ధాంతానికి స్వామి ఆత్మస్థానానంద జీ, స్వామి స్మరణానంద జీ జీవితాలు చెరగని ఉదాహరణ.

విద్యాభివృద్ధికి, గ్రామీణాభివృద్ధికి రామకృష్ణ మిషన్ చేస్తున్న కృషి మనందరికీ స్ఫూర్తిదాయకం. భారతదేశ ఆధ్యాత్మిక స్పృహ, విద్యా సాధికారత, మానవతా సేవ సంకల్పానికి రామకృష్ణ మిషన్ కృషి చేస్తోంది. 1978లో బెంగాల్ ను వరదలు ముంచెత్తినప్పుడు రామకృష్ణ మిషన్ తన నిస్వార్థ సేవతో అందరి హృదయాలను గెలుచుకుంది. 2001లో కచ్ భూకంపం వచ్చినప్పుడు విపత్తు నిర్వహణకు రామకృష్ణ మిషన్ అన్ని విధాలుగా సహాయం చేయడానికి సిద్ధంగా ఉందని నాకు ఫోన్ చేసి చెప్పిన మొదటి వ్యక్తుల్లో స్వామి ఆత్మస్థానంద ఒకరు. ఆయన సూచనల మేరకు రామకృష్ణ మిషన్ భూకంప విపత్కర సమయంలో ప్రజలకు ఎంతో సాయం చేసింది.

కొన్నేళ్లుగా స్వామి ఆత్మస్థానానంద జీ మరియు స్వామి స్మరణానంద జీ వివిధ పదవుల్లో ఉంటూ సామాజిక సాధికారతకు పెద్దపీట వేశారు. ఆధునిక విద్య నైపుణ్యం, మహిళా సాధికారత పట్ల ఇలాంటి మహానుభావులు ఎంత అంకితభావంతో ఉండేవారో ఈ మహానుభావుల జీవితాలు తెలిసిన వారికి తప్పకుండా గుర్తుండే ఉంటుంది. స్వామి ఆత్మస్థానందజీ మహోన్నత వ్యక్తిత్వంలోని ప్రత్యేకత నన్ను బాగా ఆకట్టుకుంది ప్రతి సంస్కృతి, ప్రతి సంప్రదాయం పట్ల ఆయనకున్న గౌరవం, ప్రేమ దీనికి కారణం, అతను భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో చాలా కాలం గడిపాడు, నిరంతరం ప్రయాణించేవాడు. గుజరాత్‌లో ఉంటూ గుజరాతీ మాట్లాడటం నేర్చుకున్నాడు. నాతో కూడా ఆయన గుజరాతీలోనే మాట్లాడేవారు. భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో అనేక దశలలో, మన మాతృభూమిని స్వామి ఆత్మస్థానంద, స్వామి స్మరణానంద వంటి ఎందరో సాధువులు ఆశీర్వదించారు. సమాజ శ్రేయస్సు కోసం కలసికట్టుగా పనిచేయాలని ఈ సాధువులు మనకు దీక్షను అందించారు. రాబోయే కాలంలో ఈ ఆలోచనలు అభివృద్ధి చెందిన భారతదేశానికి, అమృత్ కాలానికి సంకల్పశక్తిగా మారతాయి. అలాంటి మహనీయులకు యావత్ దేశం తరఫున మరోసారి నివాళులర్పిస్తున్నాను. రామకృష్ణ మిషన్‌తో సంబంధం ఉన్న వారంతా ఆయన చూపిన మార్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తారనే నమ్మకముంది.

ఓం శాంతి



• నరేంద్ర మోదీ
భారత ప్రధానమంత్రి

మన ఆత్మగౌరవ ప్రతీకకు 'భారతరత్న' ఇంకెన్నడు?

తెలుగుదేశం పార్టీని ప్రకటించిన సందర్భంలో నందమూరి తారకరామారావు "ఈ పార్టీ పేదవాడి ఆకలిమంటల్లోంచి పుట్టింది" అని చెప్పినప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు. అప్పటి వరకూ ఏ రాజకీయ నాయకుడూ ఉపయోగించని పదజాలం అది. ఆ సమయంలోనే ఓ విలేకరి "మీ సిద్ధాంతం ఏమిటి రామారావు గారూ?" అని ప్రశ్నించినపుడు ఎన్టీఆర్ నోటి వెంట సమాధానం బుల్లెట్‌లా వెలువడింది: "గ్రంథాలయాల్లో దుమ్ము పేరుకుపోయిన పుస్తకాల్లో మీకు మా సిద్ధాంతం కన్పించదు. మీ వీధిలో ఉన్న పేదవాడి ఆకలి చూపులలో మాత్రమే అది మీకు దర్శనమిస్తుంది" అంటూ ఆవేశంతో చెప్పారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ ప్రకటించిన ఎన్నికల ప్రణాళికలో, "పేదవాడికి పట్టెడన్నం పెట్టడం, నిలువనీడ కల్పించడం, ఒంటి నిండా బట్ట కప్పుకొని ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితి కల్పించడం" తొలి ప్రాధాన్యతాంశంగా పేర్కొన్నారు. 1983లో అధికారంలోకి రాగానే కిలో రూ.2లకు 25 కిలోల బియ్యం పథకం, పక్కా గృహ నిర్మాణం, సగం ధరకే జనతా వస్త్రాలు వంటి పథకాలు అమలు చేశారు.

సబ్సిడీ బియ్యం పథకం ప్రభుత్వ ఖజానాకు భారం అవుతుందని కొందరు అధికారులు చెప్పినపుడు "పేదవాడికి ఇంత నైవేద్యం పెట్టలేని ప్రభుత్వం దేనికండి?" అంటూ ఎన్టీఆర్ వారి మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీని స్పష్టమైన సిద్ధాంతాలతో, విధానాలతో, ఉన్నత రాజకీయ విలువలతో నడిపిన ఎన్టీఆర్ ఎన్నడూ వాటి నుండి దూరంగా జరగలేదు, ఎప్పుడూ రాజీపడలేదు. పరిపాలనలో సామాజిక న్యాయం, సంస్కరణలకు పెద్దపీట వేసి సంక్షేమాన్ని, అభివృద్ధిని సమతుల్యం చేశారు. సామాన్యులు, రైతులు, మహిళలు బడుగు బలహీన వర్గాల సాధికారత కోసం ఎన్టీఆర్ చేసిన కృషి, కల్పించిన రాజకీయ భాగస్వామ్యం, ప్రవేశపెట్టిన పథకాలు ఆనాడు దేశానికే దిక్సూచిగా నిలిచాయి.

కారణాలు ఏవైనా ఆనాడు దేశంలోని ప్రాంతీయ పార్టీలంటేనే సంకుచిత భావాలు కలిగి ప్రాంతీయతత్వాన్ని రేపుతాయనే అపప్రథ బలంగా నాటుకొని ఉండేది. తెలుగుదేశం పార్టీని సైతం అదేగాటన కట్టాలని కొందరు చూశారు. ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా దేశ రాజధాని ఢిల్లీ వెళ్లి అక్కడ ఏర్పాటుచేసిన 'మీట్ ది ప్రెస్'లో పాల్గొన్నప్పుడు ఎన్టీఆర్‌ను ఓ విలేకరి "మీరు ప్రాంతీయవాది కదా? కేంద్రంతో కలిసి పనిచేయడం ఇబ్బంది కాదా?" అని అడిగాడు. దానికి సమాధానంగా ఎన్టీఆర్ "నేను మొదట భారతీయుణ్ణి. తర్వాతే తెలుగువాణ్ణి. అయినా రాష్ట్రాలు బలంగా ఉండాలని కోరుకోవడం ప్రాంతీయవాదం కాదు. రాష్ట్రాలు బలంగా ఉంటేనే కేంద్రం బలంగా ఉండగలుగుతుంది" అని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ అనగానే తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని అందరూ అంటారు. నిజానికి ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవమే కాదు దేశంలోని రాష్ట్రాల ఆత్మగౌరవాన్ని సైతం నిలబెట్టారంటే అతిశయోక్తి కాదు. రాష్ట్రాల యూనియన్ అయిన భారతదేశంలో సమాఖ్య విధానం సంపూర్ణంగా అమలై వికేంద్రీకరణ జరగడం కోసం ఎన్టీఆర్ చేసిన కృషి అసామాన్యం, అద్వితీయం. పేరుకే ఫెడరలిజం కాకుండా రాష్ట్రాలు ఆత్మగౌరవంతో మనుగడ సాగించేలా కేంద్రం సహకరించాలని, అందు కొరకు రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇచ్చితీరాల్సిందేనని నాటి కేంద్ర ప్రభుత్వంపై ఎన్టీఆర్ ఒత్తిడి పెంచారు. రాష్ట్రాల హక్కుల సాధన కోసం ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఒక వేదికపైకి తెచ్చి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కేంద్రీకృత విధానాలను ఎండగట్టారు. ఎన్టీఆర్ చొరవతో కేంద్ర–రాష్ట్ర సంబంధాల మీద ఏర్పాటయిన 'సర్కారియా కమిషన్'కు అనేక విజ్ఞప్తులు పంపి రాష్ట్రాలకు మరిన్ని నిధులు, అధికారాలు అందించేందుకు అవసరమైన సూచనలు చేయాలని కోరారు. ప్రాంతీయ ప్రయోజనాలు, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే లోక్‌సభలో ప్రాంతీయ పార్టీలు ఎక్కువ ప్రాతినిధ్యం పొందడానికి కృషి చేయాలని, అందుకు కాంగ్రేసేతర పక్షాల మధ్య ఐక్యత సాధించాలని చెప్పేవారు. జాతీయ స్థాయిలో కాంగ్రేసేతర పార్టీలన్నింటినీ ఒక వేదిక మీదకు తీసుకురావడానికి ముందుగా ఆ ప్రయోగాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనే ఆచరించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఒక పక్క సీపీఐ, సీపీఎంలతో, మరోపక్క బీజేపీ, జనతా పార్టీలతో పొత్తు కుదుర్చుకొని రాష్ట్రంలోని 42 లోక్‌సభ స్థానాల్లో 35 స్థానాలను గెలుచుకొని లోక్‌సభలో అతి పెద్ద పార్టీగా తెలుగుదేశంను నిలిపి దేశం దృష్టిని తన వైపు తిప్పుకోగలిగారు.

> ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీని స్పష్టమైన సిద్ధాంతాలతో, విధానాలతో, ఉన్నత రాజకీయ విలువలతో నడిపిన ఎన్టీఆర్ ఎన్నడూ వాటి నుండి దూరంగా జరగలేదు, ఎప్పుడూ రాజీపడలేదు. రాష్ట్రానికి, దేశానికి ఎన్టీఆర్ చేసిన సేవల్ని పరిగణనలోకి తీసుకొన్నప్పుడు, అనితర సాధ్యమైన ఆయన నట జీవితాన్ని లెక్కలోకి తీసుకొన్నప్పుడు ఎన్టీఆర్‌కు 'భారతరత్న' లభించాలని కోరుకోవడం అత్యాశ కాబోదు.




1984 ఆగస్టులో గవర్నర్ రామ్‌లాల్, నాదెండ్ల భాస్కరరావు, కేంద్రంలోని ఇందిరా గాంధీ ప్రభుత్వం కుమ్మక్కై తనను పదవీచ్యుతుడిని చేశాక నెల రోజులపాటు ఎన్టీఆర్ చేసిన ప్రజాస్వామ్య పోరాటం స్వాతంత్ర్యానంతర దేశ రాజకీయ చరిత్రలో ఓ ఉజ్వల ఘట్టంగా మిగిలిపోతుంది. తిరిగి అధికారంలోకి వచ్చాక, ఎన్టీఆర్ కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ విధానాలపైన తన పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. రాష్ట్రపతి పాలన విధించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను తొలగించాలని డిమాండ్ చేయడంతోపాటు రాష్ట్ర చట్టాలను కేంద్రం వీటో చేసేందుకు అధికారం కల్పించే ఆర్టికల్ 200, 201లను సవరించాలని ఎన్టీఆర్ చేసిన ప్రతిపాదన ఆనాడు దేశంలో ఓ సంచలనం. అలాగే, అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తి అమలు జరగాలంటే వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, ప్రజారోగ్యం, సాంఘిక సంక్షేమం వంటి కార్యక్రమాలను రాష్ట్రాలే నిర్వహించుకొనే అవకాశం కల్పించాలని, బాధ్యతలకు తగినట్టుగా నిధుల సేకరణకు, పన్ను అధికారాలను హేతుబద్ధంగా కేంద్రం–రాష్ట్రాల మధ్య విభజించాలని కోరారు.

కేంద్ర జాబితాలో ఉన్న ఎక్సయిజ్, ఇన్‌కంటాక్స్, కస్టమ్స్ డ్యూటీ మొదలయిన ఆదాయాల్లో రాష్ట్రాలకు సముచిత వాటాలు ఇవ్వాలంటూ ఎన్టీఆర్ చేసిన ప్రతిపాదనలు జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. దాని ఫలితంగానే ఆనాడు 9, 10వ ఫైనాన్స్ కమిషన్లు రాష్ట్రాల వాదనలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్రాలకు పన్నుల్లో ఎక్కువ వాటా ఇవ్వాలని సిఫార్సు చేశాయి. అంతేకాదు, మార్కెట్ రుణాల్లో రాష్ట్రాల వాటా పెంచాలని, రాష్ట్ర స్థాయి ప్రభుత్వరంగ సంస్థలు కూడా బాండ్ల ద్వారా వనరులు సేకరించేందుకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ఎన్టీఆర్ కేంద్రంపై ఒత్తిడి చేశారు. చట్టబద్ధ వనరుల వాటాలో కేంద్రం అనుసరించే ద్వంద్వ వైఖరిని ఉపేక్షించబోమంటూ రాష్ట్రాల తరఫున ఎన్టీఆర్ చేసిన హెచ్చరిక నాడు దేశంలోని కాంగ్రేసేతర ప్రభుత్వాలకు సైతం కళ్లు తెరిపించినట్లయింది. అప్పటివరకు కేంద్రం ఎంతిస్తే అంత తీసుకొనే విధానమే అమలయ్యేది. దానిని ఎన్టీఆర్ వ్యతిరేకించిన తర్వాత కేంద్రం–రాష్ట్రాల మధ్య సంబంధాలలో గుణాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. మరో విధంగా చెప్పాలంటే కేంద్రాన్ని యాచించే స్థాయి నుంచి ఆత్మగౌరవంతో తమ హక్కుల సాధన కోసం రాష్ట్రాలు పోరాడే స్థాయికి చేరుకొన్నాయి. ఎన్టీఆర్ హయాంలో చరిత్రను తిరగరాసిన ఇటువంటి విప్లవాత్మక సంఘటనలు ఎన్నో ఉన్నాయి.


42 సంవత్సరాల తెలుగుదేశం పార్టీ చరిత్రలో ఎన్టీఆర్‌ది ఓ ఉజ్వల అధ్యాయం. అయితే, ఓ సందర్భంలో ఎన్టీఆర్ "నాతో పుట్టిన పార్టీ నాతోనే పోతుందేమో" అని నిర్వేదంగా అన్నారు. నిజానికి 1995 ఆగస్టులో నారా చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ నుంచి తెలుగుదేశం పార్టీ పగ్గాలను తీసుకోకపోయి ఉంటే ఆ తర్వాత ఏం జరిగేదో కానీ, సకాలంలో సరియైన నిర్ణయం తీసుకొని తెలుగుదేశం పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి తన విలక్షణ నాయకత్వంతో, పరిపాలనా సామర్థ్యంతో ఎన్టీఆర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకువెళ్లడంలో ఆయన విజయం సాధించారు. ఇందుకు అనేక ఉదాహరణలు కళ్లముందు కనిపిస్తాయి. తన రాజకీయ ప్రత్యర్థులు సృష్టించిన ఎన్నో అవరోధాలను, ఇబ్బందులను దాటుకొంటూ ఓ బలీయమైన రాజకీయ శక్తిగా తెలుగుదేశం పార్టీని మలిచి ప్రజల ఆదరాభిమానాలను చూరగొని తొమ్మిదేళ్ళపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు; ఐదేళ్ళపాటు విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ స్ఫూర్తితో రానున్న ఎన్నికలలో విజయం సాధించే దిశగా కృషి చేయడం కనిపిస్తోంది.

ఈ నేపథ్యంలోనే, క్రిందటేడాది 'శత జయంతి' సంవత్సరాన్ని జరుపుకొన్న ఎన్టీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం 'భారత రత్న' ప్రకటిస్తుందని చాలామంది భావించారు. రాష్ట్రానికి, దేశానికి ఎన్టీఆర్ చేసిన సేవల్ని పరిగణనలోకి తీసుకొన్నప్పుడు, అనితర సాధ్యమైన ఆయన నట జీవితాన్ని లెక్కలోకి తీసుకొన్నప్పుడు ఎన్టీఆర్‌కు 'భారత రత్న' లభించాలని కోరుకోవడం అత్యాశ కాబోదు. ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఇంకెప్పుడు అనే ప్రశ్న ప్రతి తెలుగువాడి మదిలో మెదులుతూనే ఉంది. అన్నట్టు దేశ రాజకీయాల్లోనే చిన్న అవినీతి మరక కూడా అంటని ఏకైక రాజకీయ నాయకుడు ఒక్క ఎన్టీఆరే!

• విక్రమ్ పూల
సీనియర్ జర్నలిస్ట్
(నేడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం)




గురువారం ఉష్ణోగ్రతలు | గరిష్టం : 38.0°C | కనిష్టం : 22.5°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.34 గం..
సహర్ : శనివారం ఉ : 4.50 గం..

కాంగ్రెస్‌లో వరంగల్ హీట్!



- ఎంపీ టికెట్ విషయంలో సీఎం వర్సెస్ మంత్రులు?
- ఏకాభిప్రాయం కుదరక ఎటూ తేల్చని అధిష్ఠానం
- వ్యవహారానికి తెరదించేందుకు ఏఐసీసీ నేతల ప్రయత్నాలు
- పొత్తులో భాగంగా టికెట్ తమకే కేటాయించాలని సీపీఐ పట్టు

వరంగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్‌లో వరంగల్ ఎంపీ టికెట్ వ్యవహారం హీట్ పెంచుతోంది. అభ్యర్థిత్వం విషయంలో అటు సీఎంకు ఇటు మంత్రులకు మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదని, తలా ఒకరి పేరు చూపుతుండటంతోనే జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి తనతో పాటు కాంగ్రెస్‌లోకి వచ్చిన దొమ్మాటి సాంబయ్యకు టికెట్ ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన ఇందిరకు టికెట్ ఇవ్వాలని మంత్రులు భట్టి, ఉత్తమ్ పట్టుబడుతున్నట్టు సమాచారం. దీంతో సీఎం, మంత్రుల మధ్య వరంగల్ సీటు విబేధాలకు బీజం వేస్తుందేమోనన్న చర్చ జరుగుతోంది. వరంగల్ స్థానం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నప్పటికి సరైన అభ్యర్థి లేరని సర్వేలు రిపోర్టులు వస్తుండటంతో ఎవరికి టికెట్ ఇవ్వాలో తేల్చుకోలేకపోతున్న అధిష్ఠానం అభ్యర్థిని ఖరారు చేయకుండా పెండింగ్‌లో పెడుతోందన్న ప్రచారం జరుగుతోంది. ఇదంతా ఇలా ఉంటే సీపీఐ రూపంలో కాంగ్రెస్‌కు మరో సమస్య ఎదురవుతోంది. పొత్తులో భాగంగా వరంగల్ సీటును తమకే కేటాయించాలని సీపీఐ కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తోంది. లేదంటే ఫ్రెండ్లీ పోటీ తప్పదని కమ్యూనిస్టులు కాంగ్రెస్ అధినాయకత్వాన్ని కంగారు పెట్టిస్తున్నారు.

సీటుపై కాంగ్రెస్‌లో భేదాభిప్రాయాలు..


వరంగల్ ఎంపీ సీటు సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రులకు మధ్య విభేదాలను తీసుకొస్తోందన్న చర్చ జరుగుతోంది. దొమ్మాటి సాంబయ్యకు ఇప్పించేందుకు రేవంత్‌రెడ్డి ప్రతిపాదనలు చేయగా.. మంత్రి కొండా సురేఖ తీవ్రంగా వ్యతిరేకించినట్టు ప్రచారం జరుగుతోంది. ఆమె జన్ను పరంజ్యోతికి టికెట్ ఇవ్వాలని కోరినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రేవంత్‌రెడ్డితో చర్చించిన అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సురేఖతో ఉన్న సత్సంబంధాలతో తెరపై దయాకర్ పేరు చక్కర్లు కొట్టింది. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘనపూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన శనిగపురం ఇందిర వరంగల్ ఎంపీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యుడు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క కూడా ఇందిర అభ్యర్థిత్వం వైపు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. సినీనటుడు శింబుతో కలిసి కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను బెంగళూరులో కలిసిన ఇందిర వరంగల్ టికెట్‌పై ఒత్తిడి తీసుకరాగా, డీకే కూడా ఇందిరా పేరును ప్రతిపాదిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు మాత్రం ఎన్నికల ఖర్చు తాము భరించే పరిస్థితిలో లేమని, ఆర్థిక, అంగ బలం ఉన్న వారిలో ఎవరికి టికెట్ ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని మెజార్టీ ఎమ్మెల్యేలు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షికి ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన అభిప్రాయ సేకరణలో తేల్చి చెప్పారట. వీరితో పాటు వైద్యులు రాగమల్ల పరమేశ్వర్, పెరుమాండ్ల రామకృష్ణ, సునితలతో పాటు ఆర డజను

మిగతా 8వ పేజీలో..

మాదిగలకే వరంగల్ అభ్యర్థిత్వం

రాష్ట్రంలో మూడు ఎంపీ సీట్లు ఎస్సీలకు రిజర్వు అవగా వీటిలో నాగర్‌కర్నూలు, పెద్దపల్లి ఎంపీ టికెట్లు మాల సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు ఇచ్చారు. ఇక మిగిలింది కేవలం వరంగల్ సీటు మాత్రమే. ఇది కచ్చితంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేతలకే టికెట్ ఇవ్వాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. దీంతో తొలుత వరంగల్ సీటుపై సీనియర్ నేత అద్దంకి దయాకర్‌కు మాట ఇచ్చిన కాంగ్రెస్.. మాల, మాదిగ సామాజిక వర్గాల సమీకరణల నేపథ్యంలో అద్దంకి విషయంలో పునరాలోచన చేస్తోందని తెలుస్తోంది. పైగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కూడా మాల సామాజిక వర్గం వ్యక్తే కావడంతో వరంగల్ సీటు కచ్చితంగా మాదిగ సామాజిక వర్గం నేతకే కేటాయించాలని అధిష్ఠానం భావిస్తోంది.

తెరపైకి కడియం..





వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిపై ఉత్కంఠ పెరుగుతుంది. ఇప్పటికే ఎవరికి వారు కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తుండటం, సీఎం, మంత్రులతో పాటు పీసీసీ, ఏఐసీసీ నేతల మధ్య అభ్యర్థుల విషయమై ఏకాభిప్రాయం రాకపోవడం లాంటి పరిణామాల నేపథ్యంలోనే.. బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం కావ్య ఎన్నికల బరి నుంచి తప్పుకోవటంతో కాంగ్రెస్ ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది. స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకవచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం.. కడియం శ్రీహరి కాంగ్రెస్‌లోకి వస్తే ఆయననే వరంగల్ ఎంపీ అభ్యర్థిగా బరిలో దించాలని యోచిస్తోంది. 2014లో కడియం శ్రీహరి వరంగల్ ఎంపీగా విజయం సాధించారు. దీంతో పాటు సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉండటంతో ఉమ్మడిజిల్లాలోని అన్ని పార్టీల నేతలతో శ్రీహరికి పరిచయాలున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీహరిని ఎంపీగా పోటీ చేయించి, ఆయన గెలిచిన తర్వాత స్టేషన్‌ఘనపూర్‌కు వచ్చే ఉపఎన్నికల్లో కడియం శ్రీహరి కుమార్తె కావ్యను ఎమ్మెల్యేగా పోటీ చేయిస్తారనే ప్రచారం జరుగుతుంది. ఒకవేళ శ్రీహరి పోటీ చేయకపోతే కావ్యనే ఎంపీ అభ్యర్థిగా బరిలో దింపవచ్చుననే చర్చ కూడా జరుగుతోంది. అయితే పార్టీ మారే విషయంలో తాము ఇంకా ఏం నిర్ణయం తీసుకోలేదని కడియం శ్రీహరి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దీంతో కాంగ్రెస్ టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న నేతల్లో కడియం ఎపిసోడ్ ఉత్కంఠ రేపుతోంది. వరంగల్ టికెట్ ఎవరికి దక్కుతుందనే టెన్షన్ నెలకొంది.

కావ్య లేఖతో బీఆర్‌ఎస్‌కు షాక్..

పార్లమెంట్ ఎన్నికల ముంగిట బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా ఖరారైన డాక్టర్ కడియం కావ్య తాను బీఆర్‌ఎస్ తరఫున ఎన్నికల్లో పోటీ చేయలేనని అధినేత కేసీఆర్ లేఖ రాయటం సంచలనంగా మారింది. ఇప్పటి వరకు నేతలు మాత్రమే పార్టీని వీడి వెళ్లగా.. ఇప్పుడు ఏకంగా ఎంపీ అభ్యర్థి తాను పోటీ చేయలేనంటూ ఎన్నికల బరి నుంచి తప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. అయతే కొన్ని రోజులుగా పార్టీ నాయకత్వంపై వస్తున్న అవినీతి, భూకబ్జాలు, ఫోన్ ట్యాపింగ్ లాంటి వ్యవహారాలు, లిక్కర్ స్కాం లాంటివి పార్టీ ప్రతిష్ఠను దిగజార్చాయని, జిల్లాలో నాయకుల మధ్య సమన్వయం, సహకారం లేదని, ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉన్నారని, ఇది పార్టీకి మరింత నష్టం చేస్తుందని, ఈ పరిస్థితుల్లో తాను పోటీ నుంచి విరమించుకోవాలని నిర్ణయించుకున్నానని, అభ్యర్థిగా అవకాశం ఇచ్చినందుకు కేసీఆర్‌కు ధన్యవాదాలని, తన నిర్ణయం పట్ల కేసీఆర్‌తో పాటు కార్యకర్తలు మన్నించాలని కడియం కావ్య ఆ లేఖలో కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- 146 కొనుగోలు సెంటర్ల ద్వారా కొనుగోళ్లు చేయాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 28: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో యాసంగి 2023-24 సంవత్సరంలో ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులు, మహిళా సమాఖ్య సంఘాల ప్రతినిధులు, లారీ ఓనర్ల సంఘం, రైస్‌మిల్లర్లతో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 1వ తేదీన జిల్లాలోని ప్రతీ మండలంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలు నిర్వహించాలని సూచించారు. ఏప్రిల్, మే నెలల్లో అన్నిచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య సదుపాయం అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నీడ ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. శుభ్రం చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, ఏ రోజు రైతు నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను అదే రోజు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మీ, డీఆర్‌డీఓ నాగ పద్మజ, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి..

కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో సీఎంఆర్ లక్ష్యాలు పూర్తి చేయడంపై రైస్ మిల్లుల యజమానులతో ఏర్పాటు చేసిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. మిల్లర్లు రోజువారి లక్ష్యాన్ని పూర్తిచేస్తేనే నిర్దేశించిన గడువు వరకు సీఎంఆర్‌ను పూర్తిచేయవచ్చునని అన్నారు. లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తిచేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారని తెలిపారు. సీఎంఆర్ లక్ష్యాన్ని పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని కలెక్టర్ మిల్లర్లకు సూచించారు. జిల్లా అడిషినల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎఫ్‌సీఐ వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డీఎస్‌ఓ వసంతలక్ష్మీ, సివిల్ సప్లై డీటీలు, రైస్‌మిల్లర్ల సమావేశంలో పాల్గొన్నారు.

ప్రశాంతంగా బార్ అసోసియేషన్ల ఎన్నికలు

- వరంగల్, హనుమకొండ కార్యవర్గాల ఎన్నికల
- న్యాయవాదులతో కోలాహలంగా అదాలత్ ప్రాంగణం

వరంగల్ లీగల్, మార్చి 28: వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. బార్ అసోసియేషన్లలో సభ్యులైన న్యాయవాదులు ఈ ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా అదాలత్ ప్రాంగణంలో జరిగిన ఈ ఎన్నికల పోలింగ్ ఉదయం ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగింది. అనంతరం ఓట్ల లెక్కింపును చేపట్టి విజేతలను ప్రకటించారు.

వరంగల్ బార్ అసోసియేషన్..





అధ్యక్షుడు టి.జీవన్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ముదాసిర్ అహ్మద్ ఖయ్యూం

వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా తీగెల జీవన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ముదసిర్ అహ్మద్ ఖయామి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో జీవన్ గౌడ్‌కు 254 ఓట్లు రాగా, తన సమీప అభ్యర్థి శ్రీరాఘవరావుకు 179 ఓట్లు వచ్చాయి. అదే విధంగా ముదసిర్‌కు 176 ఓట్లు రాగా, ఆయన సమీప అభ్యర్థి జి.శివకు 144 ఓట్లు పడ్డాయి. ఉపాధ్యక్షుడిగా పి.సుదర్శన్, అసోసియేషన్ మహిళా జాయింట్ సెక్రెటరీగా కె.గోపికారాణి, స్పోర్ట్స్, కల్చరల్ జాయింట్ సెక్రెటరీ జి.వెంకటరమణ, లైబ్రరీ జాయింట్ సెక్రెటరీగా పి.మురళీకుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బి.విక్రం, బి.అనిల్‌కుమార్, టి.అశోక్, ఎ.రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. తొమ్మిదిమంది బరిలో ఉండగా, వీరిలో నుంచి ఈ నలుగురు ఎన్నికయ్యారు. మహిళా కార్యవర్గ సభ్యురాలిగా ఎస్.శృతి ఎన్నికయ్యారు. 20 యేళ్ల సర్వీస్ గల న్యాయవాది కార్యవర్గ సభ్యుడిగా కె.రాజేందర్ ఎన్నికయ్యారు.

హనుమకొండ కార్యవర్గం..





అధ్యక్షుడు ఎం.రమేష్ బాబు | ప్రధాన కార్యదర్శి ఎల్.రమేష్

హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా మాతంగి రమేష్ బాబు, లాదే రమేష్ ఎన్నికయ్యారు. రమేష్ బాబుకు 478 ఓట్లు రాగా, తన సమీప అభ్యర్థి పి.సత్యనారాయణకు 254 ఓట్లు వచ్చాయి. అదే విధంగా ప్రధాన కార్యదర్శిగా ల్యాదే రమేష్‌కు 301 ఓట్లు రాగా, ఆయన సమీప అభ్యర్థి బి.శంకర్‌కు 164 ఓట్లు పడ్డాయి. ఉపాధ్యక్షుడిగా పి.రవీందర్, మహిళా జాయింట్ సెక్రెటరీగా జె.స్వప్న, స్పోర్ట్స్, కల్చరల్ జాయింట్ సెక్రెటరీగా బి.చిరంజీవి, కోశాధికారిగా జి.సదానందం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కె.రుత్విక్, ఎస్.సుహాస్, అనిల్ లాలానాయక్, టి.అచ్యుత్ కుమార్ ఎన్నికయ్యారు. మహిళా కార్యవర్గ సభ్యురాలిగా జి.రమాదేవి ఎన్నికయ్యారు.

లైసెన్స్‌డ్ తుపాకులను అప్పగించండి..

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల భగ్గు

- డీసీసీ భవన్ నుంచి ర్యాలీ, ప్లకార్డుల ప్రదర్శన
- పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు.. అరెస్టు చేయాలని డిమాండ్



ఎమ్మెల్యే కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేస్తున్న టీపీసీసీ నాయకుడు బత్తిని శ్రీనివాస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు

హనుమకొండ సిటీ, మార్చి 28: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. గురువారం సాయంత్రం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి హనుమకొండ పోలీస్‌స్టేషన్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. కేటీఆర్‌ను అరెస్టు చేయాలనే ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీగా తరలారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ర్యాలీగా వెళ్లిన అనంతరం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో కేటీఆర్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి అక్రమమార్గంలో వేల కోట్ల డబ్బులను వసూలు చేసి ఢిల్లీ అధిష్ఠానానికి పంపించారని కేటీఆర్ మాట్లాడడం సిగ్గు చేటన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన కార్యక్రమం, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ముఖ్యమంత్రిపై నిరాధారంగా కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్ అప్రజాస్వామికంగా మాట్లాడడం ఆయన తెలివి తక్కువతనాన్ని బయటపెట్టిందని మండిపడ్డారు. కొద్ది రోజులుగా రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ అవాస్తవమైన ఆరోపణలు చేస్తూ పిచ్చి పట్టినట్లు ప్రవరిస్తున్నారని దుయ్యబట్టారు.

లోకసభ ఎన్నికల తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్తారని కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమన్నారు. ముఖ్యమంత్రి ప్రతిష్ఠ, పరువుకు భంగం కలిగించిన కేటీఆర్‌ను కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధిని శంకిస్తూ కేటీఆర్ నోరు పారేసుకోవడం మానుకోవాలని హితవు పలికారు. లేకుంటే కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. లిక్కర్ కేసు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు, బీఆర్‌ఎస్ నేతల దోపిడీలు.. ఇలా ఒక్కొక్క అవినీతి బండారాలు బయటపడుతుండడంతో కేటీఆర్‌కు మతిభ్రమిస్తోందని శ్రీనివాస్ మండిపడ్డారు. రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం ఎంతగా దోచుకుందో ఆధారాలతో సహా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ముందు ఉంచుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షల కోట్లు స్వాహా చేసిన సంగతిని కేటీఆర్ మరిచినా ప్రజలు మరువలేదన్నారు. పారదర్శక పాలన సాగిస్తూ ప్రజాభిమానాన్ని, పార్టీ పెద్దల మన్ననలు పొందుతున్న రేవంత్‌రెడ్డిపై మరోసారి నోటికొచ్చినట్లు కేటీఆర్ మాట్లాడితే సహించేది లేదన్నారు. బీఆర్‌ఎస్ గుర్తింపునే రద్దు చేయాలని ఎలక్షన్ కమిషన్‌కు కూడా కోరుతామని తెలియచేశారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, సయ్యద్ విజయశ్రీ రజాలీతో పాటు టీపీసీసీ కార్యదర్శి ఈవీ శ్రీనివాస్, నాయిని లక్ష్మారెడ్డి, బంక సంపత్, రజాలీ, లీగల్ సెల్ అధ్యక్షుడు తోట వెంకటరాజ్‌కుమార్, జగన్మోహన్‌రెడ్డి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, పల్లకొండ సతీస్ యాదవ్, కుమార్ యాదవ్, స్రవంతి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్‌ల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 28: ఏనుమాముల మార్కెట్‌లో ఈవీఎంలను భద్రపరిచే గోడౌన్‌ల వద్ద పటిష్ఠ భద్రత కల్పించాలని వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నిర్వాహణలో భాగంగా గురువారం ఏనుమాముల మార్కెట్‌లోని ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మే 13న లోక్‌సభ ఎన్నికల జరుగనున్న దృష్ట్యా ఇక్కడ వర్ధన్నపేట, నర్సంపేటతో పాటు 106- వరంగల్ తూర్పు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఇక్కడే భద్రపరిచినట్లు వెల్లడించారు. ఎలాంటి అడ్డంకులు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు సుమారు కిలోమీటరు పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొన్ని ప్రాంతాల్లో రహస్య కెమెరాలు అమర్చి ఉంటాయని చెప్పారు. ఫైర్ సేఫ్టీ, అలారం, రిసెప్షన్ సెంటర్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇక్బాల్, డీటీ సుభాష్, ఆర్‌ఐ జలపతిరెడ్డిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 28: ప్రభుత్వ పాఠశాలల్లో రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. గురువారం హంటర్‌రోడ్‌లోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం రెండు జిల్లా శాఖల ఆధ్వర్యంలో 'ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు' అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరైన నర్సిరెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు చాలా తక్కువగా అవుతుండటంతో ప్రభుత్వ పాఠశాలలు ప్రమాదంలో పడుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచే ఆవశ్యకతను ఆయన వివరించారు. విద్యార్థుల నమోదు అవాంతరాలకు అనేక కారణాలున్నాయని, అయితే ప్రస్తుతం ఉన్న వనరులను ఉపయోగించుకొని విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకొని 75 నుంచి 100 మంది విద్యార్థులుండే విధంగా పాఠశాలలను విలీనం చేయాలని సూచించారు. ప్రతీ ప్రాథమిక పాఠశాలకు తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు ఉండేలా పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండు జిల్లాల నాయకులు ఎం.సదాశివరెడ్డి, మేరికి దామోదర్, పెండెం రాజు, సుజన్‌ప్రసాద్‌రావు, ఎం.అన్నాదేవి, ఎస్.జ్యోతి, ఎ.రావు, మల్లిక్, మోజెస్, లింగారావు, రమేష్, సదానందం, వెంకటేశ్వర్‌రావు, రవీందర్, కరుణాకర్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు.. డాక్టర్ అనే పదం వాడొద్దు

వరంగల్ మెడికల్, మార్చి 28: ప్రథమ చికిత్స చేసే వ్యక్తులు తమ పేరు ముందు డాక్టర్ అనే పదాన్ని వాడరాదని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నోటీసులు జారీ చేశారు. ఇలాంటి వ్యక్తులు చేసే వైద్య సహాయ కేంద్రం ముందు ఫస్ట్ ఎయిడ్ సెంటర్, ప్రథమ చికి త్స కేంద్రమని మాత్రమే రాయాలని సూచించారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 (రూల్ 2011) ఎవరూ అతిక్రమించినా చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి హెచ్చరించారు.



హనుమకొండ జూపార్క్‌లో ఆస్ట్రిచ్‌పక్షులకు నీరు కొడుతున్న సంరక్షకుడు



చిరుతపులి బ్యారక్‌ఎదుట కూలర్ ఏర్పాటు చేసిన దృశ్యం

వణ్యప్రాణులకు వేసవి తాపం

ఎండలు మండుతున్నాయి. జనమే కాదు పశుపక్షాదులూ ఎండతీవ్రతకు అల్లాడుతున్నాయి. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో సగటున గరిష్ఠంగా 38డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవగా.. మధ్యాహ్నం సమయంలో రహదారులు, కూడళ్లలో అంతగా జనసంచారం కనిపించలేదు. ఇక ప్రజలు శీతలపానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఈనేపథ్యంలో హనుమకొండలోని వనవిజ్ఞాన్ కేంద్రం జూపార్క్‌లో చిరుతపులి ఉండే బ్యారక్‌కు పరదాలు, కూలర్ ఏర్పాటు చేయగా.. ఆస్ట్రిచ్ పక్షులకు, ఇతర జంతువులు, పక్షులు ఉండే బోన్ల చుట్టూ పరదాలు కట్టి సంరక్షకులు నీటితో తడుపుతున్నారు.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్, హనుమకొండ

ఉద్యోగాల పేరిట మోసం

రూ.5కోట్ల వసూలు

పోలీసుల అదుపులో నిందితుడు?

వరంగల్ క్రైం, మార్చి 28: ఉద్యోగాల పేరిట మోసం చేసి రూ.5కోట్లు వసూలు చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నలుగురు ముఠాగా ఏర్పడి గ్రూప్-1 ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసి హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన పలువురు నిరుద్యోగుల నుంచి రూ.5కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై వరంగల్ పోలీసులకు సమాచారం అందడంతో నగరానికి చెందిన ఒక వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న నిందుతుడిని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. కమిషనరేట్ కార్యాలయం సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో పెట్టి నిందితుడి నుంచి వాస్తవాలు సేకరించినట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడి కుమారుడితోపాటు మరో ఇద్దరు ఈ మోసంలో భాగస్వాములుగా ఉన్నట్లు పోలీసుల తమదైన శైలిలో చేసిన విచారణలో బహిర్గతమైనట్లు సమాచారం. ఇంకా పూర్తిస్థాయి విచారణ చేసి శుక్రవారం పోలీసులు వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, మార్చి28: డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 22మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. గురువారం 22 మందిని కోర్టులో హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 18 మందికి రూ.22,100, డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులో ఐదుగురికి రూ.3,100 జరిమానాను న్యాయమూర్తి రమేశ్ విధించారన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

హనుమకొండ టౌన్, మార్చి28: ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం పోలీస్ హెడ్‌క్వార్టర్ ఎదుట చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. లోటస్ కాలనీ చెందిన ఎస్.ఉపేందర్ (65) బుధవారం హెడ్‌క్వార్టర్ జంక్షన్‌లో రోడ్డు క్రాస్ చేస్తుండగా మాడిశెట్టి షణ్ముక అనే వ్యక్తి ద్విచక్రవాహనంతో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఢీకొట్టగా ఉపేందర్‌కు కుడికాలు, చేతికి గాయాలయ్యాయి. బాధితుడి మనవడు సోమ సాయిశరత్ హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో మరిచిపోయిన చీరలను అందజేసిన పోలీసులు

హనుమకొండ టౌన్, మార్చి28: హనుమకొండ బస్టాండ్‌లో బస్సులో మరిచిపోయిన చీరల బ్యాగును తిరిగి బాధితుడికి పోలీసుల అందజేశారు. పోలీసులకు కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలుకు చెందిన ఓ ప్రయాణికుడు చీరెల బ్యాగుతో హైదరాబాద్‌కు వెళ్లేందుకు మంగవారం సాయంత్రం హనుమకొండ బస్టాండ్‌కు చేరుకున్నాడు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు ముందుగా శ్రీశైలం బస్సు ఎక్కి తర్వాత మరో బస్సు రాగానే చీరెల బ్యాగును మరిచిపోయి ఆ బస్సు ఎక్కాడు. అయితే చీరెల బ్యాగు గుర్తుకొచ్చి మొదటి బస్సు వద్దకు వెళ్లగా.. ఆ బస్సు వెళ్లిపోయింది. బాధితుడు వెంటనే హనుమకొండ పోలీసులను ఆశ్రయించగా సీసీ పుటేజీల ఆధారంగా బస్సును గుర్తించి డ్రైవర్‌కు సమాచారం చేరవేశారు. తిరగుప్రయాణంలో చీరెల బ్యాగును తీసుకొచ్చి పోలీసుల సమక్షంలో బుధవారం రాత్రి బాధితుడికి అందజేశాడు. కాగా చీరెల విలువ రూ.50,000 ఉంటుందని పోలీసులు తెలిపారు.

మృతదేహం లభ్యం

మడికొండ, మార్చి 28 : మడికొండలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. స్థానిక ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల మేరకు.. మడికొండలోని శ్రీరామ బార్ సమీపంలోని ఓ లాండ్రీ షాప్ వెనుక ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి డ్రాయర్ మాత్రమే ధరించి బట్టలు లేకుండా బోర్లా పడి మృతి చెంది ఉన్నాడు. అక్కడ ఉండే వారిని విచారించగా సదరు వ్యక్తి రెండు, మూడు రోజులుగా అక్కడే తిరుగుతున్నాడని, ఇతర రాష్ట్రానికి చెదిన వాడై ఉంటాడని, హిందీలో మాట్లాడేవాడని చెప్పినట్లు తెలిపారు. మృతుడు ఆహారం లేక అలసిపోయి శరీరంలో ఓపిక లేక అలాగే ముందుకు పడిపోయి చనిపోయి ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసి మార్చురీకి తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. ఆచూకీ తెలిసిన వారు సెల్. 87126 85123, 87126 85248 నెంబర్లకు సమాచారం అందజేయాలని కోరారు.

పని బారెడు.. జీతం చారెడు..

● ఉపాధి క్షేత్ర సహాయకులపై పని భారం ● పెరిగిన పంచాయతీలు.. పెరగని ఫీల్డ్ అసిస్టెంట్లు
● 1,680 పంచాయతీలకు 800 మందే విధులు ● ఒక్కొక్కరికి మూడు నాలుగు పంచాయతీలు




హనుమకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులపై పని భారం రోజు రోజుకు పెరుగుతోంది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,668 గ్రామ పంచాయతీలు ఉండగా, క్షేత్ర సహాయకులు మాత్రం 800 మంది వరకే ఉన్నారు. మొదట్లో 1,018 మంది క్షేత్ర సహాయకులు ఉండేవారు. కొందరు మధ్యలో ఉద్యోగం మానేశారు. మరికొందరు వివిధ కారణాల వల్ల ఉద్యోగాల నుంచి తొలగింపబడ్డారు. కొంత మంది మరణించారు. దీనితో క్షేత్రసహాయకుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఉన్నవారిపైనే పని భారం పడుతోంది.

క్షేత్ర సహాయకుల కొరత

గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీల పునర్విభజన చేపట్టింది. 500 మించి జనాభా కలిగిన తండాలను సైతం గ్రామ పంచాయతీలుగా మార్చింది. దీనితో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య 1080 నుంచి 1,668 వరకు పెరిగింది. పెరిగిన గ్రామ పంచాయతీలకు అనుగుణంగా క్షేత్ర సహాయకుల సంఖ్యను పెంచలేదు. గ్రామ పంచాయతీలు పెరగక ముందు గతంలో ప్రతీ పాత గ్రామపంచాయతీకి ఒక్కరు చొప్పున క్షేత్ర సహాయకులుఉ ఉండేవారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలను పెంచింది కానీ.. ఆ మేరకు క్షేత్ర సహాయకులను మాత్రం పెంచలేదు. ప్రస్తుతం పాత పంచాయతీల్లో పని చేస్తున్నవారికే కొత్తపంచాయతీల బాధ్యతలను కూడా అప్పగించింది. దీనితో ఒక్కో క్షేత్ర సహాయకుడు పెద్ద పంచాయతీలు అయితే రెండు, మూడు.. చిన్న పంచాయతీలైతే నాలుగైదు వరకు చూసుకోవలసి వస్తోంది. దీంతో వారిపై పని భారం పెరిగి సతమతమవుతున్నారు. ఉపాధి పనుల అమలును సరిగా పర్యవేక్షించలేని పరిస్థితి ఏర్పడుతోంది. క్షేత్రసహాయకుల కొరత వల్ల కొన్ని పంచాయతీల్లో కార్యదర్శులు కూడా ఉపాధి పనులను చూస్తున్నారు.

పని భారం

తమను క్రమబద్ధీకరించాలంటూ సమ్మెకు దిగిన క్షేత్ర సహాయకులను గత ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. వారు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో వీరిని మళ్లీ విధుల్లోకి తీసుకున్నది. అయినప్పటికీ పంచాయతీకి ఒకరు చొప్పున క్షేత్రసహాయకులను నియమించలేదు. ఒక్కడే క్షేత్ర సహాయకుడు మూడు నాలుగు గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పనులను పర్యవేక్షించాల్సి రావడం వల్ల కూలీల హాజరు నమోదు కష్టంగా మారుతోంది. కూలీల ఫొటోలను అప్‌డేట్ చేయలేకపోతున్నాడు. దీంతో క్షేత్రసహాయకులు చేసేది లేక ఒక గ్రామాన్ని వారు చూసుకుంటూ మిగిలిన గ్రామాల్లో హాజరు నమోదు బాధ్యతను కూలీల్లో ఒకరికి అప్పగిస్తున్నారు. ఇలా చేయడంతో పనులకు హాజరుకాని వారికి కూడా హాజరు వేసే అవకాశముంటుంది.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో తిప్పలు

ఉపాధి హామీ పథకంలో భాగంగా గతంలో రాష్ట్రప్రభుత్వం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించేవారు. అన్ని రాష్ట్రాల్లో సాఫ్ట్‌వేర్లు ఒకేలా ఉండాలని కేంద్రం ఆదేశించడంతో రెండేళ్లుగా కొత్తదానిని ఉపయోగిస్తున్నారు. ఈసాఫ్ట్‌వేర్‌తో గందరగోళ పరిస్థితి ఏర్పడుతోంది. పాత పంచాయతీ నుంచి విడిపోయి కొత్తగా ఆవిర్భవించిన వాటిలో కూలీలకు చెల్లింపులు ఆలస్యమవుతున్నాయి. కూలీల పేర్లు రెండు పంచాయతీల్లో నమోదు కావడంతో అధికారులు వాటిని వేరు చేశారు. అప్పుడు క్షేత్ర సహాయకులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులే పనులు పర్యవేక్షించారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్ ప్రకారం పంచాయతీలు యూనిట్‌గా పనులు గుర్తించారు. అలాంటప్పుడు ఈ పంచాయతీకి ఒకరు చొప్పున క్షేత్ర సహాయకుడు ఉండాలి. కానీ అలా జరగడం లేదు. అన్ని చోట్ల కూలీల హాజరు నమోదు, క్షేత్ర స్థాయిలో చిత్రాలను అప్‌లోడ్ చేయడం కష్టంగా మారుతోంది. క్షేత్ర సహాయకులు తమకు అప్పగించిన పంచాయతీలకు వెళితేనే ఆ సాఫ్ట్‌వేర్ కూలీల హాజరు నమోదు అవుతుంది. దీంతో ఒక క్షేత్ర సహాయకుడు తనకు అప్పగించిన మూడు నాలుగు గ్రామ పంచాయతీలకు స్వయంగా వెళ్లి ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా కూలీల హాజరు నమోదు చేయడం ఇబ్బందిగా మారుతోంది. ఈ మూడునెలలు ఉపాధి పనులు జోరుగా సాగుతాయి. పైగా వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు సరిగా పండక, పండిన పంటలు ఎండిపోయి వ్యవసాయ కూలీలకు పనులు దొరకని పరిస్థితులు ఏర్పడనున్న దృష్ట్యా ఉపాధి పనులకు ఎక్కువ మంది వచ్చే అవకాశం కూడా ఉన్నది.

వెట్టిచాకిరీ

చాకిరి బారెడు.. వేతనం చారెడు చందంగా ఉంది క్షేత్ర సహాయకుల పరిస్థితి. వారికి ఇచ్చే వేతనం అతి తక్కువ. కానీ పని భారం మాత్రం అధికంగా ఉంటోంది. ప్రస్తుతం క్షేత్ర సహాయకులకు రూ.10,500 ఇస్తున్నారు. ఇందులో కోతలు పోను వారి చేతికి అందేది రూ.8900 మాత్రమే. ఇందులోనూ కూడా ఇంకా కోతలు విధిస్తున్నారు. గ్రామ పంచాయతీలో 30 శాతానికిపైగా కూలీలు ఉపాధి పనులకు వచ్చేట్టు చేస్తేనే పూర్తి వేతనం ఇస్తారు. ఇది ఏ మాత్రం తగ్గిన వేతనంలో కోత పెడుతున్నారు. ఈ నిబంధన క్షేత్ర సహాయకులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగినప్పుడు ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య సహజంగానే తగ్గుతుంది. పైగా చిన్న పంచాయతీల్లో జాబ్ కార్డు కలిగిన కూలీలు తక్కువగా ఉంటారు కనుక పెద్దగా సమస్య ఉండడం లేదు. కానీ అదే 3500 నుంచి 4000 వరకు జాబ్ కార్డులున్న పెద్ద పంచాయతీల్లో 30శాతం మించి కూలీల హాజరు ఉండేట్టు చూడడం క్షేత్ర సహాయకులకు కష్టంగా మారుతోంది. ఈ నిబంధనను ఎత్తి వేయాలని వారు కోరుతున్నారు.

మూడు నెలలుగా వేతనాలు లేవు

క్షేత్ర సహాయకులకు వేతనాలు కూడా సకాలంలో అందడం లేదు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి వేతనాలను ఇప్పటివరకు చెల్లించలేదు. మార్చి నెల కూడా ముగుస్తోంది. తమకు ఇచ్చే వేతనాలే తక్కువ. అవి కూడా సకాలంలో చెల్లించకపోవడం వల్ల కుటుంబాలను పోషించుకోలేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని క్షేత్ర సహాయకులు ఆవేదన పడుతున్నారు.

రెగ్యులర్ చేసేదెప్పుడు ?

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు క్షేత్ర సహాయకులను రెగ్యులర్ చేస్తానని ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులు అయినా ఇప్పటి వరకు ఆ వాగ్దానం అమలు కాకపోవడం పట్ల క్షేత్ర సహాయకులు విచారం వ్యక్తం చేస్తు న్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమను ఏ మాత్రం పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం అయినా తమను ఆదుకోవాలలని క్షేత్ర సహాయకులు కోరుతున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక క్షేత్ర సహాయకుడిని నియమంచి పని భారం తగ్గించాలని, కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలని, 30శాతానికిపైగా కూలీల హాజరు తప్పనిసరి నిబంధనను తొలగించాలని, ప్రతీ నెల వేతనాలను చెల్లించాలని, ప్రస్తుతం బకాయి ఉన్న మూడు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని, తమ సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని క్షేత్ర సహాయకులు కోరుతున్నారు.

జాతీయ వైద్య సదస్సుకు డాక్టర్ కూరపాటి రమేష్‌కు ఆహ్వానం



వరంగల్ మెడికల్, మార్చి 28: ఢిల్లీలో ఈ నెల 29, 30 తేదీలల్లో జరుగనున్న హెర్నియా నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు వరంగల్‌కు చెందిన డాక్టర్ కూరపాటి రమేష్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు గురువారం డాక్టర్ కూరపాటి రమేష్ వివరాలను వెల్లడించారు. సంక్లిష్టమైన అడ్వాన్స్ లాపరోస్కోపిక్ ఆపరేషన్స్ నూతన వైద్య విధానంపై అవగాహన సదస్సులో ప్రసంగం ఉంటుందని పేర్కొన్నారు. నూతన వైద్యవిధానాల వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కాగా, డాక్టర్ రమేష్‌కు ఆహ్వానం అందడంపై ఐఎంఏ ప్రతినిధులు, వరంగల్ సర్జికల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో సభ్యుడిగా రియాజ్



హనుమకొండ సిటీ, మార్చి 28: కాంగ్రెస్ జాతీయ మేనిఫెస్టో కమిటీ సభ్యుడిగా టీపీసీసీ అధికార ప్రతినిధి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రియాజ్ నియమితులయ్యారు. హనుమకొండ జిల్లాకు చెందిన డాక్టర్ రియాజ్‌కు ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీలో స్థానం కల్పించారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా ఉన్న కమిటీ రానున్న లోక్‌సభ ఎన్నికల క్రమంలో ప్రజల వద్దకు వెళ్లనుంది. 15 రోజుల వ్యవధిలో ప్రజాభిప్రాయాలను సేకరించి ఏఐసీసీకి తెలియచేయనుంది.

మంద కృష్ణను కలిసిన అరూరి రమేష్

హనుమకొండ టౌన్, మార్చి28: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ గురువారం హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అరూరిని మంద కృష్ణ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.



అరూరిని సన్మానిస్తున్న మంద కృష్ణ

న్యూశాయంపేటలో కుక్కల స్వైర విహారం



గాయపడిన బాలిక

న్యూశాయంపేట, మార్చి 28: గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ 31వ డివిజన్ న్యూశాయంపేటలో గురువారం కుక్కలు స్వైర విహారం చేశాయి. న్యూశాయంపేటలోని పద్మశాలీ కాలనీకి చెందిన గుండు శరణ్య అనే బాలికను అలాగే రాసమల్ల వాడకు చెందిన పాలబిందల కనకలక్ష్మీ అనే వృద్ధురాలిపై గురువారం కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే బాధితులు స్థానిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. న్యూశాయంపేటలోని ప్రతీ కాలనీలో పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయని, మునిసిపల్ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు సిబ్బందిని పంపించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

చెన్నారావుపేట, మార్చి 28: మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన ఓ మహిళ ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైనట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ గురువారం తెలిపారు. వరంగల్ ఏనుమాములకు చెందిన దివ్యకు గురిజాలకు చెందిన దౌడు రాజుతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల , ఏడాది వయసున్న వర్షిణి, పప్పి ఉన్నారు. రాజు స్థానిక ప్రైవేటు స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. రాజు మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో గొడవకు దిగేవాడు. దీంతో విసుగు చెందిన దివ్య బుధవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండానే ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లిపోయింది. బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దివ్య తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పోచమ్మమైదాన్‌లో భారీ అగ్ని ప్రమాదం

● చౌరస్తా సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో చెలరేగిన మంటలు ● షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన బ్యాంకెట్ హాల్, ఇన్సూరెన్స్ కార్యాలయం



దగ్ధమవుతున్న షాపింగ్ కాంప్లెక్స్ లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పోచమ్మమైదాన్, మార్చి 28: వరంగల్ నగరం నడిబొడ్డున పోచమ్మమైదాన్ చౌరస్తా సమీపంలోని ఓ షాంపింగ్ కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా చెలరేగిన మంటలు... కాంప్లెక్స్‌లోని మూడు అంతస్థులకూ వ్యాపించాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తా సమీపంలోని జకోటియా షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండో అంతస్తులో ఉన్న ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. పొగరావడం గమనించిన సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. అనంతరం కాంప్లెక్స్‌లోని మిగతా షాపుల నిర్వాహకులను అప్రమత్తం చేశారు. కాసేపటికే ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయం పూర్తిగా మంటలు వ్యాపించి ఎగిసిపడ్డాయి. మూడో అంతస్థులో ఉన్న బ్యాంకెట్‌హాల్‌లోకి కూడా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని అర్ధరాత్రి వరకు మంటలను ఆర్పేందుకు యత్నించారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, డీసీపీ దేవేందర్‌రెడ్డితో పాటు ఐదుగురు సీఐలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. ప్రమాదం సంభవించిన చోట ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడటంతో వారిని అదుపుచేయడం కష్టంగా మారింది. దీంతో పోలీసులు పలుమార్లు స్థానికులను చెదరగొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే మంటలకు కాంప్లెక్స్‌లోని ఏసీ కంప్రెషర్లు అన్ని పేలగా.. ఆశబ్దాలకు జనం భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన అధికారులు వెంటనే విద్యుత్తు సరాఫరాను నిలిపివేశారు.

మూడు ఫైరింజన్లు, మునిసిపల్ వాటర్ ట్యాంకర్లతో....

మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఫైర్ సిబ్బంది శ్రమించారు. మూడు ఫైరింజన్లతో మూడు వైపులా నుంచి నీటిని చిమ్మినా మంటలు అదుపులోకి రాలేదు. ఈ క్రమంలోనే మునిసిపల్ వాటర్ ట్యాంకర్లతో సైతం నీటిని తీసుకువచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు యత్నించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. రెండు కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో స్థానికులు, పరిసరాల్లో నివాసం ఉండే వారు భయాందోళనకు గురవగా.. ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో పెట్రోల్ పంపులు కూడా ఉండటంతో అందరూ ఆందోళనకు గురయ్యారు.

ఘటనా స్థలానికి మంత్రి సురేఖ

ఘటనా స్థలాన్ని దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ సందర్శించారు. ఘటన విషయం తెలుసుకున్న మంత్రి హుటాహుటిన తరలివచ్చి అధికారులతో మాట్లాడారు. ప్రపమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. కలెక్టర్ ప్రావీణ్య, మునసిపల్ కమిషనర్ అశ్విని తానాజీవాకడే ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అస్వస్థతకు గురైన సీఐ గోపి

మంటలను అదుపుచేసే అక్రమంలో మట్వాడ సీఐ గోపి అస్వస్థతకు గురయ్యారు. ఎగిసిపడుతున్న మంటలను భారీ స్థాయిలో పొగలు విరజిమ్మడంతో శ్వాస సంబంధ సమస్య తలెత్తి అస్వస్థతకు గురవడంతో వెంటనే ఆయన్ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. గోపి చికిత్స పొందుతున్నారు.



కాంప్లెక్స్ వద్ద గుమికూడిన ప్రజలు




సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి కొండా సురేఖ, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

కాంగ్రెస్ టికెట్ దళిత క్రిస్టియన్లకే కేటాయించాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పాస్టర్ ఐజక్

వడ్డెపల్లి, మార్చి 28: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ దళిత క్రిస్టియన్ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు కేటాయించాలని ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ ఐజక్, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేను, ఏఐసీసీ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని కోరారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు పాస్టర్ జోసఫ్ ప్రభాకర్ మాట్లాడారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో దళిత క్రిస్టియన్లు అధికంగా ఉన్నారని, డాక్టర్ రామకృష్ణకు టికెట్ కేటాయిస్తే ఇతర సామాజిక వర్గాలను కలుపుకొని అధిక మెజారిటీతో గెలిపించుకుంటామని అన్నారు. సమావేశంలో ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ ప్రతినిధులు సువర్ణరాజ్, లాజరెస్, తాళ్లపెల్లి ప్రసంగి, డేవిడ్, పాస్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాష్టీకం

కూతురిని ప్రేమించాడని చితకబాదిన వైనం
టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు
వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన

నర్సంపేట టౌన్, మార్చి 28 : ప్రేమ వ్యవహారంలో ఓ దళిత యువకుడిని కొందరు వ్యక్తులు చితకబాదగా.. ఈ కేసులో వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన ముగ్గురిని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలావున్నాయి.

నర్సంపేట పట్టణానికి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన యువతి, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని చర్లపాలెం గ్రామానికి చెందిన ఓదళిత యువకుడు ధర్మవరపు ప్రకాష్‌రాజ్ కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో తరుచూ ఆ యువకుడు నర్సంపేట వెళుతూ పట్టణంలో నివాసం ఉంటున్న యువతిని కలిసే వాడు. ఈ క్రమంలో వీరి ప్రేమ వ్యవహారం యువతి ఇంట్లో తెలిసి ప్రకాష్‌రాజ్‌ను మందలించారు. అయినా వారిద్దరూ ప్రేమించుకుంటూనే ఉండటంతో యువతి తండ్రి ప్రకాష్‌రాజ్‌ను తన కూతురికి దూరం చేయాలని భావించి.. తన స్నేహితులైన మాజీ ప్రజాప్రతినిధి, రియల్ ఎస్టేట్ వ్యాపారితోపాటు మరో ఇద్దరు కలిసి పథకం రూపొందించారు.

ఈ నెల 24న యువతి సెల్‌ఫోన్ నుంచి ప్రకాష్‌రాజ్‌కు 'ఇంట్లో ఎవరూలేరని నీవు రా' అంటూ మెసేజ్ పంపారు. తన ప్రియురాలే ఆ మెసేజ్ చేసిందనుకొని నర్సంపేటకు వచ్చిన ఆ యువకుడిని యువతి తండ్రి, అతడి స్నేహితులు చావబాది, యువకుడితోనే 100కు డయల్ చేసి, తాను యువతి ఇంట్లోకి దొంగతనానికి వచ్చానని, ఇదే సందర్భంలో గాయాలయ్యాయని చెప్పాలని బెదిరించి మరీ పోలీసులకు ఫోన్ చేయించారు.

దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని యువకుడిని ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించి విచారణ చేయగా అతడు జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించాడు. పోలీసులు యువకుడి తండ్రికి సమాచారం అందించగా.. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో యువకుడి తండ్రి ఫిర్యాదు చేశారు. అయితే దళిత యువకుడిపై జరిగిన దాడిని పరువుదాడిగా భావించిన దళిత సంఘాలు పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. ఆ తర్వాత వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు యువకుడిని చితకబాదిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్న వారిని ప్రేమ వ్యవహారంతోపాటు భూ దందాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై సైతం టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణ చేస్తున్నట్లుతెలిసింది. ఈ విషయంపై స్థానిక టౌన్ సీఐ రమణమూర్తిని సంప్రదించగా.. ఈ ఘటన గురించి తన దృష్టికి రాలేదన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ వెంకటరత్నం

సాంకేతిక తోడ్పాటుతోనే వాణిజ్యాభివృద్ధి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 28: వాణిజ్యాభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ వెంకటరత్నం అన్నారు. గురువారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 'ఫిన్‌టెక్ రెవల్యూషన్' అనే అంశంపై జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ వెంకటరత్నం మాట్లాడుతూ... ఆధునిక సాంకేతిక రంగంలో వస్తున్న వినూత్నమైన టెక్నాలజీతో ప్రపంచ వర్తక, వాణిజ్య సులభతరమైందన్నారు. మారిన ప్రపంచానికి అనుగుణంగా వాణిజ్య రంగం రూపాంతరం చెందడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేవారు.

కేయూ మాజీ రిజిస్ట్రార్ సాయిలు మాట్లాడుతూ... కొవిడ్ తర్వాత ఆన్‌లైన్‌లో వర్చువల్ సదస్సులు నిర్వహించుకోవడాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో యూజీసీ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, రిటైర్డ్ ప్రొఫెసర్లు రాజిరెడ్డి, సక్రియా, కృష్ణమాచారి, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ కనకయ్య, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి, ప్రొఫెసర్లు కృష్ణారెడ్డి, రాజేందర్, అమరవేణి, డాక్టర్ ప్రగతి, డాక్టర్ రజని, డాక్టర్ సాయిచరణ్, డాక్టర్ సురేష్, డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ సునిత, డాక్టర్ సరిత, డాక్టర్ రమాదేవి, డాక్టర్ నిరంజన్, డాక్టర్ నరేందర్, పీఆర్వో ఆదిరెడ్డి పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, మార్చి 28: జిల్లాలోని పలుచోట్ల బెల్టు షాపులపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి రూ.1లక్ష విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. గురువారం టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ఆధ్వర్యంలో కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుబ్బాయిపల్లి, ఎల్కతుర్తి మండలం పరిధిలోని కేశవపూర్, దామెర గ్రామాల్లో దాడులు నిర్వహించారు. మద్యం స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఏసీపీ మధుసూదన్ ధృవీకరించారు.

వ్యక్తి అదృశ్యం

వరంగల్ క్రైం, మార్చి 28: కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని జవహర్‌కాలనీ వాస్తవ్యుడైన పూజారి శంబు ప్రసాద్(48) బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటిక వెళ్లి తిరిగిరాలేదు. ఈయనకు ఇటీవలే బ్రెయిన్ సర్జరీ జరగడంతో అనారోగ్యంతో ఉన్నాడు. అతడికి ఏమీ గుర్తుకు ఉండటం లేదు. ఈ విషయాన్ని కేయూ ఎస్ఐ దేవేందర్ ధృవీకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712685088 నంబర్‌కు తెలుపగలరని ఆయన సూచించారు.



వెంకట్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మందకృష్ణ మాదిగ, వీసీ తాటికొండ రమేశ్

వెంకట్‌కు మంద కృష్ణమాదిగ అభినందనలు

కేయూ క్యాంపస్, మార్చి 28: కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సంకినేని వెంకట్‌ను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. గురువారం కేయూ వీసీ లాడ్జ్ వద్ద కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, ఇతర ఎమ్మార్పీఎస్, సామాజిక ఉద్యమ నేతలు కలిసి శుభాభినందనలు తెలిపారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామానికి చెందిన డాక్టర్ సంకినేని వెంకట్.. రాజనీతిశాస్త్ర విభాగంలో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ అత్యున్నత డాక్టరేట్ పొందారని చెప్పారు.



అరూరిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన వారు

అరూరి రమేశ్‌ను కలిసిన బీజేపీ నాయకులు

మడికొండ, మార్చి 28: మడికొండకు చెందిన బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే, వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను ప్రశాంత్‌నగర్‌లోని ఆయన స్వగృహంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నాగవల్లి గోపికృష్ణ, గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి ధారావత్ సునిల్‌కుమార్, ఎలగొండ శివ, భైరపాక వెంకటేష్, తక్కళ్ళపల్లి నిఖిల్‌రావు, గడ్డం శ్రీధర్, మాచర్ల రంజిత్, గడ్డం కుమార్, దారంగుల రాజేష్, దూపెల్లి అరవింద్, పండుగ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి...

హనుమకొండ టౌన్: జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలంలోని వడ్డెగూడెం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం బీజేపీ పార్టీ చేరారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ నివాసంలో మండల పార్టీ అధ్యక్షుడు కోరుకొప్పుల నగేశ్ ఆధ్వర్యంలో పలువురి బీఆర్ఎస్ కార్యకర్తలకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బొడ్డు అశ్విని, విజయ, రాణి, రంగమ్మ, అంబిక, రేణుక, పద్మ, శోభ, శాంత, రాజు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుపతి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణగిరి కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

హనుమకొండ టౌన్, మార్చి28: నారాయణగిరి గ్రామంలోని ఓ షెడ్డు కూల్చివేతలో అధికారులకు సమాచారం లేకుండా సొంత నిర్ణయం తీసుకున్న పంచాయితీ కార్యదర్శి రఘుకు జిల్లా పంచాయితీ అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం ఆలస్యం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. నారాయణగిరి గ్రామంలో రోడ్డును ఆక్రమించుకొని ఓ షెడ్డును నిర్మించగా దాన్ని కూల్చివేయాలని గతంలోనే డీపీవో నోటీసులు జారీచేయగా కారదర్శి తొలగించడానికి వెళ్లగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఆ తర్వాత ప్రత్యేకాధికారి పంచాయతీ సిబ్బందితో వెళ్లి తొలగించారు. దీనిపై గ్రామస్థులు కోర్టును ఆశ్రయించగా కార్యదర్శి ఉన్నతాధికారికి సమాచారం ఇవ్వకుండానే గుర్తు తెలియని వ్యక్తులు షెడ్డును కూల్చారని, ఆ సమయంలో తాను గ్రామంలో లేనని కోర్టుకు సమాధానం చెప్పాడు. ఈ విషయంపై సంజాయిషీ ఇవ్వాలని డీపీవో మూడు రోజుల కిందట కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేశాడు.

కాంగ్రెస్‌లో వరంగల్ హీట్!

5వ పేజీ తరువాయి

మంది ఆశావహులు కాంగ్రెస్ పెద్ద చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ క్రమంలో టికెట్ ఆశిస్తున్న దొమ్మాటి సాంబయ్య, జన్ను పరంజ్యోతి, పసునూరి దయాకర్, ఇందిరతో పాటు మరో నలుగురైదుగురిని అధిష్ఠానం పిలిచి చర్చలు జరిపినట్టు సమాచారం. సునిల్ కనుగోలు సర్వే రిపోర్టు కూడా ఆశావహుల ముందుంచి పోటీపై వారి అభిప్రాయాలు సేకరించిందని, త్వరగా వరంగల్ సీటుపై తేల్చాలని సీఎం రేవంత్‌రెడ్డి కూడా సూచించినట్టు తెలిసింది.

వరంగల్ కోసం సీపీఐ పట్టు..: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పని చేసిన సీపీఐ లోక్‌సభ ఎన్నికల్లోనూ పొత్తు కొనసాగించాలని, అందులో భాగంగా తమకు వరంగల్ సీటు ఇవ్వాలని లేదంటే కరీంనగర్ ఇవ్వాలని, దీనిపై ఒక ట్రెండు రోజుల్లో తేల్చాలని కోరుతోంది. కానీ కాంగ్రెస్ జనరల్ స్థానమైన కరీంనగర్‌ను వదులుకునే అవకాశం లేకపోవటంతో ఎస్సీ రిజర్వుడు స్థానమైన వరంగల్ తమకు దక్కుతుందనే ధీమాలో కమ్యూనిస్టులున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థిత్వం నుంచి కడియం కావ్య తప్పుకోవడం, ఆమె తండ్రి కడియం శ్రీహరి, ఆమె త్వరలోనే కాంగ్రెస్‌లో చేరాతారన్న ప్రచారం నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఎవరికి దక్కుతుందోనన్న చర్చ జరుగుతోంది.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

అధికారులకు సూచించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 28: ఎండాకాలంలో గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎక్కడ కూడా సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ అధికారులు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన అన్ని మండలాల్లోని గ్రామాలలో తాగునీటికి సంబంధించిన బోర్లు, బావులు, చేతి పంపులు, మిషన్ భగీరథ నీటి సరఫరా, మోటార్లు, పైపులైన్ల మరమ్మతులపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించిన అధికారులు వేసవికాలం ముగిసేవరకు ప్రతిరోజు సమస్యల పరిష్కారానికి సమీక్ష నిర్వహించాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, జడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ లక్ష్మీరమాకాంత్, డీఆర్‌డీఓ నాగ పద్మజ, మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ ఇవ్వడంలో మాస్టర్ ట్రైనర్ల పాత్ర కీలకం

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలను ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడంలో మాస్టర్ ట్రైనర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మాస్టర్ ట్రైనర్లకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల విధులలో పాల్గొనే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ నిర్వహణకు సంబంధించిన అన్ని నియమ నిబంధనలను గురించి మాస్టర్ ట్రైనర్లు క్షుణ్ణంగా తెలియజేయాలన్నారు.

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ స్థానం పరిధిలోని ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు హనుమకొండలోని చైతన్య డిగ్రీ కళాశాలలో మార్చి 31, ఏప్రిల్ 1, 2, తేదీలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పరకాల నియోజకవర్గానికి సంబంధించి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఏప్రిల్ 1, 2 తేదీల్లో పరకాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12 దరఖాస్తు పత్రంతోపాటు ఓటరు గుర్తింపు(ఎపిక్)కార్డు జిరాక్స్‌ను జతపరచాలని తెలిపారు. అనంతరం పోలింగ్ నిర్వహణలో అధికారులు పాటించాల్సిన నియమ నిబంధనల గురించి మాస్టర్ ట్రైనర్లకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు రాధికా గుప్తా, వెంకట్ రెడ్డి, డీఆర్‌ఓ వైవీ గణేష్, హనుమకొండ, పరకాల ఆర్‌డీఓలు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే నాయిని ఇఫ్తార్ విందు

హనుమకొండ సిటీ, మార్చి 28: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుక్రవారం హనుమకొండలోని జక్రియా ఫంక్షన్ హాలులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లింలకు ఇఫ్తార్ విందుకు రాజేందర్‌రెడ్డి ఆహ్వానిస్తున్నారు. సాయంత్రం 5:30 గంటలకు ఇఫ్తార్ విందు ప్రారంభం కానుంది.

పుట్టుకతో వచ్చే లోపాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, మార్చి 28: వరంగల్ ఎంజీఎంలోని డీఐసీ సెంటర్‌లో పుట్టుకతో వచ్చే లోపాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజీఎం నర్సింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పుట్టుకతో వచ్చే లోపాల గురించి పీడియాట్రిషన్ డాక్టర్ మంజులనాయక్ అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిషన్ ఇమినేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాశ్, సూపర్‌వైజర్ నాగిరెడ్డి, డీఎస్‌సీ మేనేజర్ అనిల్ కుమార్, డీఐసీ సిబ్బంది పాపాల్గొన్నారు.

మహిమగల ధోనగుట్ట లక్ష్మీనరసింహస్వామి

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



నరసింహస్వామిని సందర్శించుకున్న అనంతరం మాట్లాడుతున్న మంత్రి సురేఖ

న్యూశాయంపేట, మార్చి 28: మహిమాన్విత క్షేత్రం ధోనగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. న్యూశాయంపేటలో వెలిసిన ధోనగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం జరిపించారు. మొదటి రోజు బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న మంత్రి సురేఖ ముందుగా లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. ధోనగుట్టలో అప్పట్లో జరిపించిన గోదా కల్యాణానికి రావడం వల్లే తన కుమార్తెకు తొందరగా వివాహం జరిగిందన్నారు. భక్తులు నిష్ఠతో దేవుళ్లను పూజిస్తే అనుకున్న ఫలితం తప్పకుండా వస్తుందన్నారు. మంత్రి సురేఖ వెంట ఆలయ చైర్మన్ గ్రంధి సత్యవతి, స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న పది పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 28: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం బయోలాజికల్ సైన్స్ పరీక్షకు వరంగల్ జిల్లాలో 99.85 శాతం మంది, హనుమకొండ జిల్లాలో 99.88శాతం విద్యార్థులు హాజరయ్యారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా 9,455 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 9,441 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 12,032 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 12,017 మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరయ్యారు. రెండు జిల్లాల డీఈవోలు డి.వాసంతి, డాక్టర్ అబ్దుల్ హై పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

అక్రమంగా నిల్వచేసిన డీజిల్ పట్టివేత



అధికారులు పట్టుకున్న డీజిల్

ఐనవోలు, మార్చి 28 : అక్రమంగా నిల్వ చేసిన 37 వేల లీటరు (168) బ్యారెల్ల డీజిల్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పంథిని శివారులోని ఒక గ్రానైట్ ఇండస్ట్రీలో అనుమతి లేకుండా సుమారు రూ.30 లక్షల విలువ చేసే 168 బ్యారెల్ల డీజిల్ నిల్వ చేసింది టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు గురువారం రాత్రి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అంత మొత్తం డీజిల్ ఎందుకు నిల్వ చేయాల్సి వచ్చిందో స్పష్టతలేదు. క్వారీ అవసరాల కోసం డీజిల్‌ను నిల్వచేసుకున్నట్లు నిర్వాహకులు చెబుతున్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేశారని పోలీసులు చెప్పుతున్నారు. డీజిల్ స్వాధీనం చేసుకున్న సమాచారాన్ని సివిల్‌సప్లయీస్ అధికారులకు చేరవేశారు. డీజిల్ ఎవరు తెచ్చారు ఇంత మొత్తంలో ఎందుకు నిల్వఉంచారో పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

లైసెన్స్‌డ్ తుపాకులను అప్పగించండి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, మార్చి 28: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని అనుమతులు ఉన్న తుపాకులను కలిగిన వ్యక్తులు, ప్రైవేటు సంస్థలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా తీసుకునే ముందస్తుచర్యల్లో భాగంగా ఆయుధాలను అప్పగించాలని ఆయన సూచించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 201 అనుమతి ఉన్న తుపాకులు ఉన్నాయన్నారు. హనుమకొండ జిల్లాలో 131, వరంగల్ జిల్లాలో 52, జనగామ జిల్లాలో 18 ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన ఆయుధాలను ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత తిరిగి ఇస్తామన్నారు. కాగా, జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బంది, గార్డు డ్యూటీలో ఉన్నవారికి మినహాయింపు ఉంటుందని అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

శ్రీభద్రకాళీ దేవాలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

వరంగల్ కల్చరల్, మార్చి 28: నగరంలోని శ్రీభద్రకాళీ దేవాలయంలో గురువారం హుండీలను దేవాదాయశాఖ కార్యాలయ పరిశీలకులు ఎం.అనిల్‌కుమార్ సమక్షంలో లెక్కించారు. రూ.39లక్షల33వేల240 ఆదాయం వచ్చింది. 387 అమెరికన్ డాలర్లు, 30 బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఫౌండ్స్, 31 మలేషియా రిజ్గేట్స్ లభించాయి. హుండీలో లభించిన వెండీ, బంగారంను తిరిగి హుండీలోనే చేశారు. కాగా ఆదాయాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దేవాలయం పేరుపై జమ చేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు, దేవాలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'రాజకీయ క్రీడ'కు సై

లోక్‌సభ బరిలో హ్యాండ్ బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్



వరంగల్ స్పోర్ట్స్, మార్చి 28: వరంగల్ మండలం పైడిపల్లి గ్రామానికి చెందిన అంతర్జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్ రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో హ్యాండ్‌బాల్ క్రీడలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభతో రాణించి జిల్లా కీర్తి ప్రతిష్ఠలు విశ్వవ్యాప్తం చేసిన క్రీడాకారుడు.. ఇప్పుడు ఎన్నికల బరిలో నిలబడుతున్నాడు.

పేదరికాన్ని జయించి..

వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ క్రీడకు ప్రసిద్ధి. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టులో వరంగల్ జిల్లాకు చెందిన క్రీడాకారులే ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. పోగుల అశోక్‌కు చిన్నతనం నుంచి హ్యాండ్‌బాల్ క్రీడపై ఆసక్తి ఉంది. పేదరికం అడ్డుగా నిలిచినప్పటికీ మొక్కవోని దీక్షతో హ్యాండ్‌బాల్‌లో ప్రావీణ్యం సంపాదించాడు. ఆపై జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటారు. అయితే ఇప్పుడు ఆ క్రీడ కడుపు నింపడం లేదు. పొట్టకూటి కోసం కూలీ పనికి వెళుతున్నాడు. ఈ క్రమంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించి పలువురి మన్ననలు పొందిన పోగుల అశోక్.. ప్రస్తుతం రాజకీయాలవైపు దృష్టి సారించారు. ఏ పార్టీతో సంబంధం లేకుండా స్వతంత్ర్య అభ్యర్థిగా వరంగల్ లోక్‌సభకు పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులతో పాటు క్రీడాభిమానులు, క్రీడా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాల మద్దతుతో వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తానని పోగుల అశోక్ అంటున్నారు. ఎలాగైనా ప్రజాప్రతినిధిగా ఎన్నికై పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని పోగుల అశోక్ స్పష్టం చేశారు.

కొమ్మాల జాతర ఆదాయం రూ.14.77లక్షలు



జాతర ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

గీసుగొండ, మార్చి 28: వారం రోజులుగా వైభవంగా జరిగిన కొమ్మాల శ్రీలక్ష్మి నరసింహస్వామి జాతర ఆదాయం రూ.14లక్షల 77వేల 9 వచ్చినట్లు ఆలయ ఈవో శేషగిరి తెలిపారు. గురువారం హుండీలను ఆదాయాన్ని లెక్కించారు. హుండీల ద్వారా రూ. 7,24,393 వచ్చినట్లు చెప్పారు. కొబ్బరికాయల వేలం ద్వారా రూ.63వేలు, కొబ్బరి చిప్పలు పోగు వేలం రూ. లక్షా41వేల16, పుట్నాలు,పేలాలు ద్వారా రూ.18వేల500 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల ట్రస్టీ చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, ఎస్ఐ వెంకన్న, అర్చకులు రామాచార్యులు, విష్ణుఫణీంద్ర, ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, ఎంపీటీసీ గోపాల్, వీరాటి లింగారెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.1.21కోట్లు



హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది, పర్యవేక్షిస్తున్న ఈవో, పరిశీలకులు

ఐనవోలు, మార్చి 28: ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం హుండీ లెక్కింపును గురువారం చేపట్టారు. 34 రోజులకు హుండీల ద్వారా రూ.27,74,129 ఆదాయం రాగా, వివిధ రకాల టికెట్లపై రూ. 93,47,267 లక్షల ఆదాయం సమకూరింది. మొత్తం రూ.1,21,21,396 కోట్ల ఆదాయం లభించినట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. వారాంతపు జాతరలకు వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులు హుండీల్లో కరెన్సీ నోట్లతోపాటు మిశ్రమ వెండి, బంగారు ఆభరణాలు స్వామి వారికి సమర్పించారు. లెక్కింపులో వాటిని పరిశీలించాక నోట్లు చిల్లర నాణేలను బ్యాంక్ అధికారులకు అందజేశారు. మిశ్రమ వెండి, బంగారంను తిరిగి హుండీలోనే భద్రపరిచారు. ఈ లెక్కింపును దేవాదాయశాఖ పరిశీలకులు జి.సంజీవరెడి పర్యవేక్షించారు. ఆర్ఐ. మల్లయ్య, కానిస్టేబుల్ రాజు బందోబస్తు నిర్వహించారు. మహబూబాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర సేవా సమితికి చెందిన మహిళలు, ఆలయ సిబ్బంది లెక్కింపు చేపట్టారు.

నిమ్మకాయల లారీ బోల్తా.. ఎగబడిన జనం

మిల్స్‌కాలనీ, మార్చి 28: నిమ్మకాయలతో లోడ్‌తో వెళుతున్న లారీ ఉర్సు గుట్ట సమీపంలో గురువారం ఉదయం డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. రాజమండ్రి నుంచి గోరక్‌పూర్‌కు వెళుతున్న లారీ ఉర్సు గుట్ట యూటర్న్ సమీపంలో ఓ ఆటోను తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. లారీలో నిమ్మకాయలు కొద్ది వరకు రోడ్డు మీద పడటంతో స్థానికులు నిమ్మకాయల కోసం స్థానికులు ఎగబడ్డారు. కార్పొరేటర్ ఎం.రవి ప్రమాద స్థలానికి చేరుకొని పరిస్థితి తెలుసుకున్నారు.

నిమ్మకాయలు ఎవరూ తీసుకెళ్లవద్దని ప్రమాదంలో ఉన్నవారికి సహాయ పడాలని కోరారు. అనంతరం నిమ్మకాయలు వేరే వాహనంలోకి తరలించారు. మిల్స్ కాలనీ సీఐ మల్లయ్య ఘటనా వివరాలను సేకరించారు.

పన్నుల వసూళ్లకు ప్రచారం సిద్ధం

వాహనాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం



జీపులకు మైకులు అమర్చుతున్న సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, మార్చి 28: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 66 డివిజన్‌లలో ఇక పన్నుల చెల్లింపుపై అధికారులు క్షేత్రస్థాయి అవగాహన కల్పించనున్నారు. చివరిదశలో అధికారుల్లో చలనం వచ్చినట్టయ్యింది. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఇంటి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్సు పన్నులు బకాయిదారులు చెల్లించాలని జీపుల ద్వారా ప్రచారం చేయనున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'పన్నులపై పట్టింపు ఏది' అనే శీర్షికన వార్త ప్రచురితం కావడంతో అధికారుల్లో చలనం వచ్చినట్టయ్యింది. పన్నులు వసూలు చేసేందుకు అధికారులు పరుగులు పెడుతున్నారు. బల్దియా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది ప్రచారంలో నిమగ్నం కానున్నారు.

ఈ మేరకు యేటా గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఇళ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, షాపింగ్‌మాల్స్, షాపుల యజమానులు వారి నిర్వహణ పరిధిని బట్టి పన్ను చెల్లించాలి. కానీ సంబంధిత బల్దియా అధికారులు నిర్లక్ష్యం వల్ల ప్రజలు పన్నులు చెల్లించడంలో జాప్యం చేశారు. కొత్తగా వచ్చిన కమిషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం 90 శాతం పన్నులు 90 శాతం వడ్డీ రాయితీతో వసూలు చేసే విధంగా ప్రజలకు అవగాహన కలిగించాలని ఆదేశించడంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన వాహనాల నిర్వాహకులను పిలిపించి ప్రచారం చేయాలని రంగం సిద్ధం చేస్తున్నారు.

12 వాహనాల్లో ప్రచారం

నగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్‌లలోని పలు కాలనీల్లో బల్దియా అద్దెకు తీసుకున్న 12 జీపులు ప్రచారానికి సిద్ధమయ్యాయి. ఎలాంటి టెండర్ లేకుండా కిందిస్థాయి అధికారులకు తెలిసిన వారిని పిలిపించి ప్రచారం చేసేందుకు సిద్ధమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. పన్నులు చెల్లించేందుకు ఈ నెల 31వరకు చివరి రోజుల కావడంతో ప్రజలకు అప్రమత్తం చేస్తున్నారు. ఒక్కో వాహనానికి రోజుకు డీజిల్‌తో సహా రూ.1200 చెల్లిస్తూ 12 జీపులను సిద్ధం చేశారు. గురువారం మున్సిపల్ ప్రధాన కార్యాలయం ముందు వాహనాలకు మైకులు, బ్యాటరీలు అమర్చి ప్రచారానికి కావలసిన పెన్‌డ్రైవ్‌లను అందించారు. మూడు రోజుల ప్రచారంలో ఏ మేరకు విజయం సాధిస్తారో వేచి చూడాల్సిందే మరీ..

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 29 మార్చి 2024

క్రీస్తు మరణించిన రోజును గుడ్ ఫ్రైడేగా, పునరుత్థానం చెందిన రోజును ఈస్టర్‌గా క్రైస్తవులు పాటిస్తారు. మరణించిన మహనీయుడు తిరిగి లేచిన రోజును కాకుండా... మరణించిన రోజును శుభమైనదిగా పాటించడం వెనుక లోతైన అంతరార్థం ఉంది.



ఆ త్యాగం స్ఫూర్తితో...

ఈ అనంత విశ్వాన్ని సృష్టించిన దేవుడు... ఆ సృష్టికి మకుటాయమానమైన మానవుణ్ణి కూడా సృష్టించాడు. తన సృష్టినంతటినీ అనుభవించమన్నాడు. అందుకోసం కొన్ని హద్దులు నిర్దేశించాడు. షరతులు పెట్టాడు. వాటిని పాటించ లేని మానవుడు గీత దాటాడు. అప్పటివరకూ దేవుని ఆజ్ఞకు బద్ధుడై ఉన్న మనిషి... సాతాను ప్రేరేపణతో... బలహీన క్షణాల్లో మాట మీరాడు. దానివల్ల దైవ ప్రేమను కోల్పోయాడు. "కష్టపడితే కాని నీకు కడుపు నిండదు. నీ సతితో వెళ్ళి, శ్రమించి, మనుగడ సాగించు" అంటూ దేవుడు ఆగ్రహించాడు. అలా దేవునికీ, మానవునికీ మధ్య వేల ఏళ్ళ ఎడబాటు సంభవించింది. అయితే మానవుణ్ణి దైవం పూర్తిగా విడిచిపెట్టలేదు. ఎడబాయక ఎప్పుడూ వెన్నంటే ఉన్నాడు. ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానైనా... అంటే ప్రవక్తల ద్వారా, భక్తులద్వారా, విశ్వాసుల ద్వారా... తన బిడ్డలైన మానవులను సన్మార్గంలో నడిపిస్తూనే ఉన్నాడు. తప్పకుండా వచ్చి

దైవమార్గం




రక్షిస్తానని మాట ఇస్తూనే ఉన్నాడు. ఆ వాగ్దానం ప్రకారమే తన ప్రియమైన కుమారుణ్ణి ఈ లోకానికి పంపాడు. ఆయన ఏసు క్రీస్తు.

ఈ లోకంలో సాధారణ మానవుడిగా జన్మించిన ఏసు ప్రజల్లో తిరిగాడు. వారిని అమితంగా ప్రేమించాడు. సన్మార్గాన్ని బోధించాడు. అద్భుతాలు చేశాడు, వ్యాధులు నయం చేశాడు. చివరకు మానవుల పాప విముక్తి కోసం తన ప్రాణాలను సమర్పించాడు. ఆ సమర్పణ ఒక మహా త్యాగానికి చిహ్నం. అది మామూలు మరణం కాదు, చిత్రవధ. నిర్దాక్షిణ్యంగా చేసిన హత్య. అటువంటి పరిస్థితుల్లోనూ "తండ్రీ! వీరేమి చేయుచున్నారో వీరెరుగరు, గనుక వీరిని క్షమించు" అని అన్నాడు. ఏసు జీవితం యావత్ లోకానికీ ఆయన అందించిన మహా సందేశం.

సాతాను ప్రభావంతో ఆయనను శిష్యుడు ఇస్కరియోతు యూదా పట్టి ఇవ్వడం, యూదా మత పెద్దలు, రోమన్ సైనికులు ఆయనను బంధించడం, తలపై ముళ్ళ కిరీటాన్ని నాటడం, కల్వరి గిరికి ఆయనతో శిలువ మోయించడం, శిలువపై ఆయనను ఉంచి మేకులు కొట్టడం... ఇవన్నీ ఏసు మరణానికి దారి తీసిన సన్నివేశాలు. ఇదంతా దైవప్రణాళికలో భాగమేననేది క్రైస్తవ లోకం విశ్వాసం. ఏసు మరణం... ప్రజల పాప విమోచనకు కారణమైన మరణం. కాబట్టి ఆ శుక్రవారం శుభదాయకమని క్రైస్తవులు నమ్ముతారు. రెండు దినాల తరువాత... ఏసు పునరుత్థానం చెందిన రోజును ఈస్టర్‌గా జరుపుకొంటారు. అది ఆదివారం వస్తుంది. నెలరోజుల పాటు ఉపవాసాలతో క్రైస్తవులు పాటించే శ్రమ దినాలు దీనితో ముగుస్తాయి. ఏసుక్రీస్తు ప్రాణత్యాగం స్ఫూర్తితో... కష్టాలను ధైర్యంగా స్వీకరిస్తూ, తోటి మానవులను ప్రేమిస్తూ జీవనం సాగించాలి. దానికి శుభ శుక్రవారం నాంది కావాలి.


• డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు
9866755024



నేడు గుడ్ ఫ్రైడే

భారతీయ మతాలు, వివిధ ధర్మాలకు సంబంధించిన అంశాలపై సాధికారత కలిగిన చరిత్రకారుల్లో **దేవదత్ పట్నాయక్** ఒకరు. ఆయన రాసిన అనేక పుస్తకాలు విశేష ప్రజాదరణ పొందాయి. తాజాగా ఆయన రాసిన 'బాహుబలి- 63 ఇన్‌సైట్స్ ఇన్ టూ జైనిజం' అనే పుస్తకంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో- ఆయన 'నివేదన'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ...

అతిథి



ఏ మత పురాణమైనా చెప్పేది ఒక్కటే

జైన మతంపై ప్రత్యేక దృష్టి సారించి ఈ పుస్తకం రాయడం వెనుక ఉద్దేశమేమిటి?

జైన మతం గురించి ఎవరికీ ఎక్కువగా తెలియదు. భారతీయ సంస్కృతి ఉద్దీపనలో జైనులకు ప్రత్యేకమైన పాత్ర ఉంది. అనేక రంగాల్లో వారి ప్రభావం ఈనాటికీ మనకు స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. కానీ దురదృష్ట వశాత్తు- జైనుల ప్రస్తావన వచ్చినప్పుడు- జైన్ ఫుడ్ గురించో, వారు ఉల్లిపాయలు తినరనే విషయం గురించో మాట్లాడుకుంటూ ఉంటారు. వైదిక మతం రాక ముందు భారత ఉపఖండంలో జైన మత ప్రభావం ఎక్కువగా ఉండేది. వారికి ఒక బలమైన తాత్విక పునాది ఉంది. తీర్థంకరులు, మహాపురుషులు, చక్రవర్తులు, వాసుదేవులు, ప్రతివాసుదేవులు- ఇలా అనేకమంది జైన మతంలో కనిపిస్తారు. వారందరూ భారతీయ తాత్విక చింతనను ప్రభావితం చేసినవారే! వీరితో పాటుగా- జైన మతంలోని 63 ప్రధానమైన ఆలోచనాధారలను ఈ పుస్తకంలో ప్రస్తావించా. ఈ పుస్తకం ద్వారా జైనమతం మన భారతీయ సంస్కృతిని పరిపుష్టం చేసిందనే విషయాన్ని చెప్పాలనుకున్నా. దానికి ఇంగ్లీషులో 'బాహుబలి- 63 ఇన్‌సైట్స్ ఇన్ టూ జైనిజం' అని పేరు పెట్టాను. దాన్నే హిందీలో కూడా విడుదల చేశాం.

ఈ పుస్తకానికి మూలంగా నిలిచిన గ్రంథాలేవైనా ఉన్నాయా?

జైన మత సిద్ధాంతాలకు సంబంధించిన అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కానీ దేనికైనా మూలం అనేది ఎక్కడా లభించదు. ఉదాహరణకు భగవద్గీతను తీసుకుందాం. భగవద్గీత మూలం కనుక్కోవాలంటే - కృష్ణుడి దాకా వెతుక్కుంటూ వెళ్లాలి. అర్జునుడికి కృష్ణుడు చెప్పినది, దాన్ని ధృతరాష్ట్రుడికి సంజయుడు వినిపించినది... వీటన్నింటికీ ఆధారాలేముంటాయి? ఒక గొప్ప ఆలోచన- కొన్ని వేల సంవత్సరాలను ప్రభావితం చేస్తున్నప్పుడు- దానికి అనేక వ్యాఖ్యానాలు వస్తాయి. దీన్ని నేను వేరే కోణం నుంచి చూస్తాను. సనాతన ధర్మంలో- "మనకు ఎంత జీర్ణమవుతుందో అంతే తినాలి" అని చెబుతారు. అంటే- మనకున్న ఆలోచనా శక్తి ఆధారంగా విజ్ఞానాన్ని గ్రహించగలుగుతాం. కొందరు సులభంగా ఆలోచిస్తారు. కొందరు సంక్లిష్టంగా ఆలోచిస్తారు. వారి వారి మేధో వైశాల్యాన్ని బట్టి విజ్ఞానం లభ్యమవుతుంది. అందువల్ల కొన్ని సందర్భాలలో మూలాల గురించి చర్చ జరపటం వల్ల ప్రయోజనం ఉండదు.

కానీ నిజం అనేది ఒకటి ఉంటుంది కదా... పురాణాలు సత్యం చెబుతాయా?

చరిత్ర గడిచిన గతాన్ని, వర్తమానాన్ని చెబుతుంది. పురాణాలకు కాలం ఉండదు. చరిత్ర సంఘటనలను చెబుతుంది. పురాణాలు ఆలోచనా విధానాన్ని కథల రూపంలో చెబుతాయి. ఇక 'నిజం' అనే భావన- పాశ్చాత్య సంస్కృతి వల్ల 200 ఏళ్ల క్రితం వ్యాపించింది. చరిత్రను ఈ కోణం నుంచి చూడటం మొదలుపెట్టారు. ఇదొక విధానం. ఇక పురాణాల విషయానికి వస్తే- ప్రతి మతంలోనూ కొన్ని పురాణాలు ఉంటాయి. అవి ఆ మత సిద్ధాంతాలను చెబుతూ ఉంటాయి. ఇక్కడ అందరం గమనించాల్సిన విషయమేమిటంటే- అన్ని మత పురాణాలూ చెప్పేది- 'మానవులు అందరూ ఒక్కటే. అందరినీ దయతో చూడాలి' అని. నా ఉద్దేశంలో ఇదే సత్యం.

ఆధునిక కాలంలో మతం ఉపయోగమేమిటనే ఇటీవల చర్చ జరుగుతోంది.. దీనిపై మీ అభిప్రాయమేమిటి?

మనిషి మనుగడకు మతం చాలా ముఖ్యం. ఎందుకంటే- మనిషి పుట్టుకతోనే అభద్రతతో ఉంటాడు. అతనికి ఆ అభద్రతను తొలగించేది మతం. అందుకే ఇన్ని వేల ఏళ్లు రకరకాల మతాలు తమ అస్తిత్వాన్ని కోల్పోకుండా ఉన్నాయి. కానీ క్రమేపీ ఏ మతం గొప్ప అనే వాదనలు మొదలయ్యాయి. నా ఉద్దేశంలో - ఈ వాదన- ఇద్దరు పిల్లలు- 'మీ నాన్న కన్నా మా నాన్న గొప్ప' అని దెబ్బలాడుకున్నట్లు అనిపిస్తుంది. అయితే ఇక్కడ సరదాగా ఒక విషయం చెబుతాను. ఇలాంటి వాదనలన్నిటి కన్నా కత్తి గొప్పది. కత్తి ఎవరి చేతిలో ఉంటుందో వాళ్లదే పై చేయి అవుతుంది.

మీ ఉద్దేశంలో సీరియల్స్, సినిమాల్లో వచ్చే రామాయణ, మహాభారత గాథలు ఎంతవరకు మూలానికి అనుగుణంగా ఉంటాయి?

సీరియల్స్, సినిమాలు తీసే వారి అజెండా టీఆర్‌పీలు, కలెక్షన్స్. నేను అనేక టీవీ సీరియల్స్‌కు పనిచేశాను. డైరక్టర్స్ వచ్చి- "ఇక్కడ కొంత డ్రామా కావాలండి" అని అడుగుతూ ఉంటారు. వాళ్లకు లక్ష్మీ కటాక్షం కావాలి.. అంతే! అయితే ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పదలుచుకున్నా. శాస్త్రం ఏ మనిషినీ ఉత్తేజితుణ్ణి చేయదు. అతనిలో ఆలోచన రేకెత్తిస్తుంది. ప్రశాంతత ఇస్తుంది. అంటే- మనం ఒక ధర్మశాస్త్రం చదివితే- మనకు ప్రశాంతత లభించాలి. అంతే తప్ప ఇతరులతో యుద్ధం చేయాలనే ఆలోచన రాకూడదు. ఒక వేళ అలాంటి ఆలోచనలు వచ్చాయంటే అది శాస్త్రం కాదు.

రైట్‌వింగ్, లెఫ్ట్‌వింగ్- ఈ రెండింటి మధ్య ఒక ఘర్షణ ఉంటుంది. ఈ రెండు భావజాలాలను మీరు ఎలా చూస్తారు?


సనాతన ధర్మంలో- కుడివైపు పురుష దేవుళ్లను పెడతాం. ఎడమవైపు దేవతలను ఉంచుతాం. కుడివైపు శివుడు ఉంటే, ఎడమవైపు శక్తిని ఉంచుతాం. వీరిద్దరూ కలిస్తేనే బ్యాలెన్స్ ఏర్పడుతుంది. ఈ రెండు భావజాలాలు అంతే! రెండూ కలిస్తేనే దేశం ముందుకు వెళ్తుంది.

మన ఆధునిక యువతకు పురాణాలు ఏ విధంగా ఉపయోగపడతాయి?

ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క సంస్కృతి ఉంటుంది. ఆ సంస్కృతి అభివృద్ధి చెందటానికి వెనక కొన్ని కారణాలు ఉంటాయి. ఆ కారణాలను ఆ ప్రాంతంలో ఉన్న కథలు, పురాణాలు చెబుతాయి. ఆధునిక సమాజంలో మానవుడికి ఎటువంటి ఎల్లలూ లేవు. కానీ వేరే ప్రాంతానికి వెళ్లినప్పుడు అక్కడ ఉన్న సంస్కృతి గురించి తెలుసుకుంటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఉదాహరణకు మనం చైనాతో వ్యాపారం చేయాలనుకున్నాం. వాళ్లు చేతులతో కాకుండా చాప్‌స్టిక్స్‌తో ఎందుకు తింటారు? వాళ్లు నమ్మే తాత్విక సిద్ధాంతాలేమిటి? అక్కడ ప్రచారంలో ఉన్న కథలేమిటి? మొదలైనవి తెలుసుకుంటే వాళ్లను కూడా కలుపుకొని పోగలుగుతాం.

• సివిఎల్ఎన్ ప్రసాద్

ఈ పుస్తకంలో అజీవికల గురించి ఉందా?



జైన మత ప్రభావం ఎక్కువగా ఉన్న రోజుల్లో అజీవికలు అనే వారు కూడా ఉండేవారు. వారికి జైనులకు మధ్య సైద్ధాంతిక విభేదాలు ఉండేవి. 'మనల్ని మనం నియంత్రించుకోం. మనల్ని నియంత్రించేది వేరే ఉంది' అనేది అజీవికల సిద్ధాంతం. మనను మనం నియంత్రించుకోగలమనేది జైనుల సిద్ధాంతం. ఈ నియంత్రణ కోసమే జైనులు ఉపవాసాన్ని ఒక ఆయుధంగా వాడుకోవటం మొదలుపెట్టారు. అయితే అజీవికల గురించి ఎక్కువ సమాచారం అందుబాటులో లేదు. ఈ పుస్తకంలో వీలైనంత సమాచారాన్ని అందించాను.

మీ దృష్టిలో రాముడెవరు?

రాముడి గురించి ఒక కథ చెబుతాను. రాముడు వనవాసానికి వెళ్లేటప్పుడు- అయోధ్యలో ప్రజలందరూ ఆయనతో పాటు నగరం పొలిమేరల దాకా వచ్చారు. అప్పుడు రాముడు- "మీరందరూ తిరిగి వెళ్లిపోండి. నా రాజ్యం, నా నగరం ఎప్పటిలాగానే సుభిక్షంగా, సిరిసంపదలతో తులతూగుతూ ఉండాలి" అన్నాడు. ప్రజలు వెనక్కి తిరిగి వెళ్లిపోవటం మొదలుపెట్టారు. 14 ఏళ్ల తర్వాత వనవాసం ముగించుకొని రాముడు అయోధ్యకు తిరిగి వచ్చాడు. కొందరు ఆ పొలిమేరల్లోనే నివాసం ఏర్పాటు చేసుకుని ఉన్నారు. వాళ్లను చూసి రాముడు- "అందరినీ రాజ్యానికి వెళ్లిపొమ్మన్నా కదా... మీరెందుకు ఉండిపోయారు?" అని అడిగాడు. అప్పుడు వాళ్లు - "రామా! నువ్వు నరనారీలందరినీ వెళ్లిపొమ్మన్నావు. కానీ మేము నరులం కాదు నారీలం కాదు. మేము శాకాహారులం కాదు, మాంసాహారులం కాదు. అలాంటప్పుడు మేము రాజ్యానికి ఎలా తిరిగి వెళ్తాం" అని ప్రశ్నించారు. అప్పుడు రాముడి దుఃఖంతో- "నేను తప్పు చేశాను. క్షమించండి. నాకు అందరూ సమానమే! మీరు లేని రాజ్యంలో నేను ఎలా ఉంటాను." అని వాళ్లను తీసుకొని నగర ప్రవేశం చేశాడు. నా రాముడు అందరినీ సమదృష్టితో చూస్తాడు. అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తాడు.

పొత్తులు ద్వాపరంలోనూ ఉన్నాయి

వందేభారతం



పొత్తులు తప్పేం కాదు. ఆకాశం తిరగబడినా... మోచేతులతో తోసేసి నిలబడగలం అనుకొనే వారికి కూడా చాలాసార్లు పొత్తులు అవసరమవుతాయి. పొత్తులకోసం వెళ్ళే వారికి కార్యం సాధించే విధానం, మాట్లాడే పద్ధతి తెలిసి ఉండాలి. సర్వం చక్కబెట్టుకురాగలిగే సామర్థ్యం ఉండాలి. పొత్తుకు వెళుతున్నప్పుడు ఒక్కొక్కరూ ఒక్కొక్క రకంగా మాట్లాడతారు. "మనకేం తక్కువ? ఒంటరి పోరు చెయ్యలేమా? మనం వెళ్తే... వాళ్ళందరికీ లోకువకామా? మనం అడగడం, వాళ్ళు "అవి ఇవ్వండి, ఇవి ఇవ్వండి" అని బేరాలాడడం అవమానం కాదూ? మనల్ని మనమే తక్కువ చేసుకోవలసిన అవసరం లేదు. ఎందరొచ్చినా మనం యుద్ధానికి తయారుగా ఉన్నాం, అంతే!" అంటూ అనవసరపు పౌరుషాలు ప్రదర్శించేవారు ఉంటారు. "మా బాగా చెప్పావు" అని నిప్పులో నెయ్యి పోసినట్టు ఎగదోసేవాళ్ళు ఉంటారు. సంధికో, పొత్తుకో వెళ్ళేవారు అందరికీ అనునయంగా నచ్చజెప్పాలి. ఇరుపక్షాలకూ మేలు కలిగే విధానం అవలంబించాలి.

ఒకసారి భారతాన్ని పరిశీలిస్తే... కురు-పాండవ యుద్ధ సమయం వచ్చింది. బలసమీకరణకోసం తమవారు, ఎదుటివారు అనే మీమాంస పెట్టుకోకుండా... యుద్ధంలో తమ పక్షాన నిలబడాలని కౌరవులు, పాండవులు తమకు మిత్రులనుకున్న రాజులందరినీ అభ్యర్థించారు. 'కృష్ణుడు మనవాడే కదా! అతణ్ణి కూడా సాయం అడగాలా?' అని పాండవులు అనుకోలేదు. శ్రీకృష్ణుడి దగ్గరకు అర్జునుడు వెళ్ళాడు. కృష్ణుడు వైరి పక్షంవాడని తెలిసి కూడా... అతని సాయం కోరడానికి దుర్యోధనుడే స్వయంగా ద్వారకకు వెళ్ళాడు. యుద్ధానికి వెళ్ళేవారు ఎప్పటికప్పుడు తమ బలం, ఎదుటివారి బలం బేరీజు వేసుకుంటూ ఉండాలి. మొండి పట్టుదలకు, దురభిమానానికి పోకుండా... సంధి చేసుకోవలసిన వారితో సంధి చేసుకోవాలి. పొత్తు మంచిదనుకున్నవారితో పొత్తు కుదుర్చుకోవాలి. దుర్యోధనుడివైపు బలశాలులైన పెక్కుమంది సోదరులతో పాటు... భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, శల్యుడు, అశ్వత్థామ, కృపుడు, బాహ్లికుడు, కృతవర్మ, భూరిశ్రవుడు, శకుని, అతని కుమారుడు ఉలూకుడు, సైంధవుడు లాంటి యోధానుయోధులు ఉన్నారు. అలాగే తూర్పు, దక్షిణ, ఉత్తర, పడమటి దేశాల రాజులు, అంగ, కేకయ, సింధు దేశాధీశులు, మాహిష్మతి, అవంతి, మద్ర, గాంధార ,కాంభోజ, ప్రాగ్జ్యోతిష రాజులు, యవనులు, త్రిగర్తలు, అంబష్ఠులు, మాళవులు, విందానువిందులు, సౌవీరులు... ఇలా ఎందరితోనో పొత్తు పెట్టుకొని పదకొండు అక్షౌహిణుల సైన్యాన్ని కౌరవులు ఏర్పరుచుకున్నారు.

అలాగే పాండవులు... వారిలో ఎవరు తక్కువ చెప్పండి! ధర్మరాజు, అతని సోదరులు... అందరూ అతిరథులు, మహారథులు. ఇక అర్జునుడి సంగతికి వస్తే... ఇలాంటివాడని చెప్పడానికి పోలిక కూడా లేదు. పైగా అతనికి జగత్పతి, జగదేకవంద్యుడు అయిన శ్రీహరి తోడు. అభిమన్యుడు కూడా సామాన్యుడు కాడు. అతనొక్కడే కృష్ణార్జునులకు సమానం. వీరుకాక సాత్యకి, ద్రుపదుడు, విరాటుడు, శిఖండి, ధృష్టద్యుమ్నుడు, ఘటోత్కచుడు, మల్లరాజులు, కాశీరాజులు, కుంతిభోజులు, చోళ, దక్షిణ నిషాద, ద్రవిడ, కుళింద, అశ్మక... ఇంకా మగధ చుట్టూ ఉన్న నిషాద రాజ్యాలు, నాగ రాజ్యానికి చెందిన ఇరావణుడు... ఇలా ఎందరో రాజులు, రాజ్యాలు, సామంత రాజ్యాలు, మిత్ర రాజ్యాలతో పాండవుల వైపున ఏడు అక్షౌహిణుల బలగం ఏర్పడింది. కాబట్టి పొత్తులు పెట్టుకోడం తప్పూ కాదు, బలహీనతా కాదు. ధరణిలో సహకారం, ఐక్యతే బలం.

అయితే... గాంధారి చెప్పిన 'యతో ధర్మస్తతో జయః' అనే మాట ఇక్కడ గుర్తుచేసుకోవాలి. ఎవరి పక్షాన ఎంతమంది ఉన్నారనేది ఎంత ముఖ్యమో... ఎంతమంది శ్రేయోభిలాషులు, రాజనీతిజ్ఞులు, నీతిమంతులు, యుద్ధనియమాలు తప్పనివారూ ఉన్నారనేది కూడా అంతే ముఖ్యం. పాలకులకు రెండు కళ్ళుంటే... పాలితులకు మూడు కళ్ళుంటాయి. వారు మూడో కన్ను తెరవకుండా ప్రభువులు జాగ్రత్తపడాలి.

> యుద్ధానికి వెళ్ళేవారు ఎప్పటికప్పుడు తమ బలం, ఎదుటివారి బలం బేరీజు వేసుకుంటూ ఉండాలి. మొండి పట్టుదలకు, దురభిమానానికి పోకుండా... సంధి చేసుకోవలసిన వారితో సంధి చేసుకోవాలి. పొత్తు మంచిదనుకున్నవారితో పొత్తు కుదుర్చుకోవాలి.

• ప్రయాగ రామకృష్ణ

సందేశం

ఫిత్రాతో ప్రక్షాళన

రంజాన్ మాసంలో ఉపవాసాలు, ఖుర్‌ఆన్ పఠనం, నమాజ్‌తో పాటు దానధర్మాలు కూడా విరివిగా చెయ్యాలనేది నియమం. మన కడుపు నింపుకోవడం, సుఖాలు అనుభవించడం అనేవి జీవిత ధ్యేయాలు కాకూడదనీ, వాటికన్నా విలువైన విషయాలు ఉన్నాయనీ ఉపవాసవ్రతం మనకు నేర్పుతుంది. పవిత్ర రంజాన్ మాసంలో అత్యధికంగా దానధర్మాలు చేయాలి. ఈ లక్ష్యం కోసమే ఫిత్రాను విధిగా ఇస్లాం ధర్మం నిర్ణయించింది. అంతిమ దివ్యగ్రంథమైన ఖుర్‌ఆన్ అవతరించిన రంజాన్ మాసంలో పేదలకు అందజేసే సాయాన్ని 'ఫిత్రా' (దానం) అంటారు. ఫిత్రా పేదల హక్కు. దాన్ని తప్పనిసరిగా నెరవేర్చాలి.

'ఫిత్ర్' అంటే ఉపవాసాలను విరమించడం లేదా పరిసమాప్తం చేయడం అని అర్థం. 'ఈద్-ఉల్-ఫిత్ర్' అంటే రంజాన్ రోజాలు (ఉపవాసాలు) ముగించి... సంతోషించే రోజు. ఆ రోజున పేదలకు తప్పనిసరిగా దానం చేయాలి. ఫిత్రా ముఖ్య ఉద్దేశాలు రెండు. ఉపవాస సమయంలో మనిషి ఎంత జాగ్రత్తగా మసలుకున్నా తెలిసీ తెలియని పొరపాట్లు జరుగుతాయి. మనిషి తన సంపద నుంచి కొంత మొత్తం దైవమార్గంలో ఖర్చు పెడితే... జరిగిన పొరపాట్ల క్షమాపణకు అది దోహదపడుతుంది. రెండోది సమాజంలోని నిరుపేదలు, అనాథలు, ఆర్తులు కూడా పండుగ చేసుకోవడానికి వీలు కలుగుతుంది.

"ఉపవాసి వల్ల జరిగే అవాంఛనీయ విషయాలను ప్రక్షాళన చేయడానికి, సమాజంలో నిరుపేదలను, అభాగ్య జీవులను ఆదుకోవడానికి ఫిత్రాదానాన్ని ఒక విధిగా చేయడం జరిగింది. నిరుపేదలకు పండుగ కన్నా ముందే ఫిత్రా దానం చేయడం చాలామంచిది దానివల్ల వారికి పండగ రోజున యాచించే అగత్యం ఏర్పడకుండా ఉంటుంది" అని వివిధ సందర్భాల్లో దైవ ప్రవక్త మహమ్మద్ స్పష్టం చేశారు.

ఆర్థిక స్థోమత కలిగిన పురుషులు యుక్తవయసు రాని తమ సంతానం తరపున ఫిత్రా చెల్లించాలి. యుక్తవయసులో ఉన్నవారు ఆర్థిక స్థోమత కలిగినట్ట



యితే... వారే చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే వారి తరపున తండ్రి చెల్లించాలి. తండ్రి లేని వారైతే ఆ బాధ్యత వారి తాతపై ఉంటుంది. ఆహార వస్తువుల్లో ఒక 'సా' పరిమాణంలో (రెండున్నర కిలోలు) ఫిత్రాను ఇవ్వాల్సి ఉంటుంది. ఆర్తులు, నిరుపేదలు, బాటసారులు ఫిత్రాకు అర్హులు. అలాగే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకోవడానికి, బానిసలను విముక్తి చేయడానికి, రుణగ్రస్తుల్ని రుణవిముక్తి చేయడానికి, దైవ మార్గంలో ఖర్చు చేయడానికి ఫిత్రాను వినియోగించవచ్చు. ఒక వ్యక్తి తన ఫిత్రాను ఒకరికీ, అంతకన్నా ఎక్కువమందికి ఇవ్వవచ్చు. అలాగే కొందరి ఫిత్రాలను కలిపి ఒకరికైనా, ఎక్కువమందికైనా ఇవ్వవచ్చు. రంజాన్ ఉపవాసాలు చేయడం వీలు కానివారు కూడా ఫిత్రా దానం చేయాలి. ఈద్ నమాజ్‌కు ముందే ఇవ్వాలి. ఈద్‌కు రెండు మూడు రోజుల ముందు ఈ దానం చేస్తే... ఆర్తుల అవసరాలకు ఉపయోగపడతాయి.

• మహమ్మద్ వహీదుద్దీన్

గీతాసారం

అదే అర్జునుడు... అదే బాణం

'అదే అర్జునుడు, అదే బాణం' అనేది ఒక సామెత. సమర్థుడైన వ్యక్తి ఎప్పుడైనా తన కర్మక్షేత్రంలో విఫలమైనప్పుడు... ఆ స్థితిని వివరించడానికి దీన్ని ఉపయోగిస్తారు. యోధుడిగా అర్జునుడు ఎప్పుడూ యుద్ధంలో ఓడిపోలేదు. కానీ అతని జీవితపు చరమాంకంలో... కొంతమంది కుటుంబ సభ్యులను బందిపోట్ల సమూహం నుంచి రక్షించడానికి చేసిన చిన్న యుద్ధంలో ఓటమిపాలయ్యాడు. అప్పుడు తన సోదరుడితో "ఏం జరిగిందో నాకు తెలీదు. నేను అదే అర్జునుణ్ణి. ఇవి కురుక్షేత్ర యుద్ధాన్ని గెలిచిన అవే బాణాలు. కానీ ఈసారి నా బాణాలు లక్ష్యాన్ని ఛేదించలేకపోయాయి. లేదా శక్తిని కోల్పోయాయి" అంటాడు. మనలో ఎవరికైనా ఇలా జరగవచ్చు. ప్రతిభావంతులైన క్రీడాకారులు కొంత కాలం తమ క్రీడా సామర్థ్యాన్ని (ఫామ్‌ను) కోల్పోతారు. ఒక నటుడు, గాయకుడు విఫలమవుతారు.



దురదృష్టం, చెడు సమయం లాంటివి వీటికి ఆపాదిస్తూ ఉంటారు. దీనికి శాస్త్రీయమైన వివరణ లేదు.

కర్మ - కర్మఫలాల మధ్య సంబంధాన్ని శ్రీకృష్ణుడు వివరిస్తూ దైవం (భగవంతుడి సహకారం/ సంకల్పం/ ఆశీస్సులు) కర్మను నెరవేర్చడానికి దోహదపడే అంశాల్లో ఒకటని తెలిపాడు. "కర్మపై నీకు హక్కు ఉంది కాని కర్మ ఫలం మీద కాదు" అని శ్రీకృష్ణుడు చెప్పడానికి కారణం అదే. హస్తసాముద్రికం, జ్యోతిషం, రాశిఫలాలు చెప్పడం లాంటి విద్యలను కొందరు అభ్యసిస్తారు. కానీ వాటిలో ఏదీ దైవం కాదు. అదే విధంగా దైవాన్ని అంచనా వేయగలిగే శాస్త్రీయ సిద్ధాంతం ఏదీ లేదు. సర్వశక్తిమంతుడు చేసిన గొప్ప రూపకల్పనలో (సృష్టిలో) మనం నిమిత్రమాత్రులం అనీ, చిన్న తునకలం అనీ శ్రీకృష్ణుడు మనకు గుర్తు చేస్తున్నాడు. విజయం మనలో అహంకారాన్ని పుట్టించకపోతే... వైఫల్యం మనల్ని బాధించదు. ఎందుకంటే రెండూ దైవం ద్వారానే ప్రభావితమవుతాయి.



కె. శివప్రసాద్
ఐఏఎస్

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శుక్రవారం • 29 మార్చి 2024
cinema@andhrajyothy.com

హుక్ స్టెప్‌తో .. ఇక నా మాటే!



శర్వానంద్ నటిస్తున్న 35వ చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కృతిశెట్టి కథానాయిక. 'ఇక నా మాటే' అంటూ సాగే ఫస్ట్ సింగిల్‌ను గురువారం విడుదల చేశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరాలు అందించారు. కృష్ణ చైతన్య రాసిన పాట ఇది. లండన్‌లోని అద్భుతమైన లోకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ పాటలో శర్వానంద్ హుక్ స్టెప్ యువతని విశేషంగా ఆకట్టుకొంటోంది. ఇంతకు మునుపెన్నడూ లేని స్టైలిష్ అవతార్‌లో శర్వానంద్ కనిపించారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

సరికొత్త ట్రెండ్ సృష్టిస్తుంది



నవీన్‌చంద్ర నటించిన వెబ్ సిరీస్ 'ఇన్‌స్పెక్టర్ రిషి'. సునయన, కన్నా రవి, శ్రీకృష్ణ దయాల్ కీలక పాత్రలు పోషించారు. క్రైమ్ హారర్‌గా తెరకెక్కిన ఈ వెబ్ సిరీస్‌కు జే.ఎస్ నందిని దర్శకత్వం వహించారు. సుఖ్‌దేవ్ లాహిరి నిర్మించారు. నేడు 'ఇన్‌స్పెక్టర్ రిషి' తెలుగు, తమిళ్, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో అమెజాన్ ప్రైమ్‌లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ "ఇన్‌స్పెక్టర్ రిషి' కథ విన్నప్పుడు ఎంతో ఎక్సైట్ అయ్యా. హారర్ థ్రిల్లర్స్‌లో ఇది సరికొత్త ట్రెండ్ సృష్టిస్తుంది" అని చెప్పారు. డైరెక్టర్ నందిని మాట్లాడుతూ "తెలుగు ప్రేక్షకులు మంచి కంటెంట్‌ను ఆదరిస్తారు. ఈ వెబ్ సిరీస్‌ను కూడా అలాగే ఆదరిస్తారనే నమ్మకముంది" అని చెప్పారు.

శశివదనుడి ప్రేమగీతం



రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ జంటగా నటిస్తున్న చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ దర్శకత్వంలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్‌రెడ్డి గోడల నిర్మిస్తున్నారు. గోదావరి నేపథ్యంలో లవ్, యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఏప్రిల్ 19న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ చిత్రం నుంచి యూనిట్ మరో పాటను విడుదల చేసింది. 'గోదారి అటువైపో నాదారి ఇటువైపో అమ్మాయి నీదారెటువైపో' అంటూ సాగే గీతాన్ని గురువారం మేకర్స్ విడుదల చేశారు. కిట్టు విస్సా ప్రగడ సాహిత్యం అందించగా, అనుదీప్‌దేవ్ స్వరాలు అందించడంతో పాటు ఆలపించారు. ఈ చిత్రంలో శ్రీమన్, దీపక్ ప్రిన్స్, రంగస్థలం మహేశ్ కీలకపాత్రలు పోషించారు.



ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకొన్న అల్లు అర్జున్ తాజాగా మరో ఘనతను సాధించారు. దుబాయ్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఆయన మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో అల్లు అర్జున్ పాల్గొన్నారు. 'ఎంతో ఉద్విగ్నంగా ఉంది, ఇదొక గొప్ప గౌరవం' అని బన్నీ పేర్కొన్నారు.



బాలకృష్ణ నట విశ్వరూపాన్ని ప్రదర్శించిన చిత్రం 'లెజెండ్'. 2014 మార్చి 28న విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసింది. పలు అవార్డులు రివార్డులు కొల్లగొట్టింది. ఇప్పుడు మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నెల 30న 'లెజెండ్'ను ప్రపంచవ్యాప్తంగా రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం 'లెజెండ్ బ్లాక్‌బస్టర్ టెన్ ఇయర్స్ సెలబ్రేషన్స్'ను చిత్రబృందం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణతో పాటు దర్శకుడు బోయపాటి శ్రీను, రామ్ ఆచంట, గోపీ ఆచంట, కథానాయిక సోనాల్ చౌహాన్, నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

మరింత ఎనర్జిటిక్‌గా ఉంటుంది

తెలుగు ప్రేక్షకులు ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్స్‌లో 'టిల్లు స్క్వేర్' ఒకటి. ఈ చిత్రం నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో సిద్ధు జొన్నలగడ్డ మీడియాతో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.



"డీజే టిల్లు విడుదల సమయంలో ప్రేక్షకుల్లో ఎలాంటి అంచనాలు లేవు. కానీ ఇప్పుడు సీక్వెల్‌పై అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. కాబట్టే కొంచెం ఒత్తిడికి లోనయ్యాం. అయితే ఆ ఒత్తిడిని జయించి బెటర్ అవుట్‌పుట్ ఇచ్చాం. ఇందులో నా పాత్ర మొదటి భాగానికి కొనసాగింపుగా ఉంటుంది. కథ కూడా కొంత కొనసాగుతుంది. కానీ మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగంలో నా పాత్ర మరింత ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఎందుకంటే ఈ సారి టిల్లు మరింత పెద్ద సమస్యలో ఇరుక్కుంటాడు. చాలా షాక్‌లు, సర్ప్రైజ్‌లు ఉంటాయి. సినిమా అంతా నవ్వుకుంటూనే ఉంటారు. టిల్లు పాత్ర నా ఆలోచనలు, నేను చూసిన అనుభవాల నుంచి పుట్టింది. టిల్లుకి, నాకు ఒక్కటే తేడా.

టిల్లు తన మనసులో ఉన్నవన్నీ బయటకు అంటాడు. నేను మనసులో అనుకుంటాను అంతే తేడా. సీక్వెల్‌లో రాధిక పాత్ర ఉంటుందో లేదో థియేటర్లో చూసి మీరే తెలుసుకోండి. ఈ సినిమాకు భీమ్స్ సంగీతం ప్రత్యేకాకర్షణ. ప్రస్తుతానికి నా ఫోకస్ అంతా 'టిల్లు స్క్వేర్' విడుదలపైనే ఉంది. పార్ట్-3 కోసం కొన్ని ఐడియాస్ ఉన్నాయి" అని చెప్పారు.

21 ఏళ్ల తర్వాత మళ్లీ అదే రోజున..



విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'ఫ్యామిలీ స్టార్' చిత్రం ట్రైలర్‌ను గురువారం ఉదయం హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "గీత గోవిందం' చిత్రం తర్వాత విజయ్, పరశురామ్ కలసి వర్క్ చేసిన సినిమా ఇది. విజయ్ పాత్ర చాలా స్పెషల్‌గా ఉంటుంది. ఇరవై ఒక్క ఏళ్ల క్రితం ఏప్రిల్ 5న విడుదలైన 'దిల్' సినిమాతో నేను నిర్మాతగా మారి, దిల్‌రాజునయ్యా. మళ్లీ ఇప్పుడు అదే ఏప్రిల్ 5న 'ఫ్యామిలీ స్టార్' చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ వేసవిలో మీకు వినోదాన్ని అందించే సినిమా ఇది. ఒక సూపర్ హిట్ చిత్రంతో మీ ముందుకు వస్తున్నాం' అని చెప్పారు. దర్శకుడు పరశురామ్ పెట్ల మాట్లాడుతూ 'ఈ సినిమానూ, హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌ను ప్రతి తెలుగు ప్రేక్షకుడు కొన్నేళ్ల పాటు గుర్తుంచుకుంటాడు. ఐ ఫీస్ట్ లాంటి సినిమా ఇది.' అని చెప్పారు.

పెళ్లి కాదు నిశ్చితార్థం?



హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావ్ హైదరీ తమ పెళ్లి విషయంలో ట్విస్ట్ ఇచ్చారు. బుధవారం వనపర్తిలోని గుడిలో వీరిద్దరి పెళ్లి జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే అక్కడ జరిగింది పెళ్లి కాదు నిశ్చితార్థం మాత్రమే అని అదితీ, సిద్ధార్థ్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. తమ నిశ్చితార్థపు ఉంగరాలను చూపుతూ ఇద్దరూ కలసి దిగిన ఫొటోను వారు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'ఆమె ఓకే చెప్పడంతో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాం' అని సిద్ధార్థ్ చెప్పారు. అయితే 'వీరిద్దరూ చెప్పినది నిజమేనా?' అనే సందేహాన్ని నెటిజన్లు వ్యక్తం చేస్తున్నారు. దీనికో కారణం ఉంది. అదితీరావ్ నటించిన 'హీరామండి: ద డైమండ్ బజార్' వెబ్‌సిరీస్ రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అదితి తప్ప నటీనటులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యాంకర్ సచిన్ కుంబర్ మాట్లాడుతూ 'ఈ రోజు అదితీరావ్ పెళ్లి చేసుకోబోతున్నారు. అందుకే ఆమె ఈ కార్యక్రమానికి రాలేదు' అని చెప్పడం గమనార్హం. దీంతో పెళ్లి విషయంలో ఈ జంట ఇంత డొంకతిరుగుడుగా వ్యవహరించడం ఎందుకో అర్థం కావడంలేదంటున్నారు నెటిజన్లు.

కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్‌పై సెబీ వేటు

రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ రద్దు

న్యూఢిల్లీ: కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్ (కేఐఎస్ఎల్)పై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరోసారి కొరడా ఝుళిపించింది. మర్చంట్ బ్యాంకర్‌గా ఆ సంస్థకు ఉన్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. గురువారం దీనికి సంబంధించి 24 పేజీల ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాది మార్చి 15-17 తేదీల్లో తాము జరిపిన తనిఖీల్లో సంస్థ పేర్కొన్న చిరునామాల్లో కార్యాలయాలు కూడా లేవని తెలిపింది. దీనికి తోడు మర్చంట్ బ్యాంకర్‌గా విధులు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఉద్యోగులు, పరికరాలు కూడా కంపెనీ వద్ద లేవని పేర్కొంది. రిజిస్ట్రేషన్ రద్దుతో కేఐఎస్ఎల్ మర్చంట్ బ్యాంకర్‌గా విధులు నిర్వహించే అవకాశాన్నీ కోల్పోయింది.

- హైదరాబాద్‌కు చెందిన సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ సంస్థ బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ లిమిటెడ్‌కు ఇండో డచ్ సైబర్‌సెక్యూరిటీ స్కూల్ (ఐడీసీఎస్ఎస్) నుంచి ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. ఆపరేషనల్ థ్రెట్స్, ఇంటర్నేషనల్ సైబర్ సెక్యూరిటీ అటాక్ వెక్టార్స్ చాలెంజ్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు గాను ఈ గుర్తింపును దక్కించుకుంది. తెలంగాణ ప్రభుత్వం, సైబర్ సెక్యూరిటీ సీఓఈ-డిజిటల్ సిగ్నేచర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఐడీసీఎస్ఎస్ దీన్ని సంయుక్తంగా నిర్వహించాయి.

- లూమినస్ పవర్ టెక్నాలజీస్.. ఉత్తరాఖండ్‌లో సోలార్ ప్యానల్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ ప్లాంట్‌లో కంపెనీ అత్యున్నత నాణ్యత గల సోలార్ మాడ్యూల్స్‌ను తయారు చేయనుంది. ప్రస్తుతం ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 250 మెగావాట్లుగా ఉంది. రుద్రపూర్‌లో నెలకొల్పిన ఈ ప్లాంట్‌ను కంపెనీ బ్రాండ్ అంబాసిడర్ సచిన్ టెండూల్కర్ ప్రారంభించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	67,310 ▲	61,700 ▲	80,500 ▲
ముంబై	67,252 ▲	61,603 ▲	74,127 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ



హైదరాబాద్	375	విజయవాడ	400
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	400	వరంగల్	377
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	122	గోదావరి	121
వరంగల్	122	విజయవాడ	121
కరీంనగర్	122	గుంటూరు	122
మహబూబ్‌నగర్	122	ఒంగోలు	122
కర్నూలు	123	చిత్తూరు	135
విశాఖపట్నం	117		

రూ.129 లక్షల కోట్లు

2023-24లో మార్కెట్ సంపద వృద్ధి ఇది..

ఏడాదిలో 14,660 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

సరికొత్త రికార్డు గరిష్ఠాలకు ఈక్విటీ సూచీలు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో స్టాక్ మార్కెట్ కొనుగోళ్ల జాతరలా కళకళలాడింది. సూచీల రికార్డులతో దలాల్ స్ట్రీట్ దద్దరిల్లింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 14,659.83 పాయింట్లు (24.85 శాతం) పుంజుకుంది. ఈ నెల 7న సూచీ 74,245.17 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, ఏడాది కాలంలో 4,967.15 పాయింట్లు (28.61 శాతం) లాభపడింది. గడచిన ఏడాది కాలంలో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏకంగా రూ.128.77 లక్షల కోట్లు పెరిగి మొత్తం రూ.386.98 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంది. భారత ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉండటంతో పాటు మార్కెట్లోకి పెట్టుబడులు భారీగా తరలి రావడం, కార్పొరేట్ కంపెనీల ఆశాజనక పనితీరు మార్కెట్ ర్యాలీకి ప్రధానంగా దోహదపడ్డాయి.

మార్కెట్ విలువపరంగా టాప్-5 కంపెనీలు

సంస్థ	రూ.లక్షల కోట్లు
రిలయన్స్ ఇండస్ట్రీస్	20.14
టీసీఎస్	14.05
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	11.00
ఐసీఐసీఐ బ్యాంక్	7.69
భారతీ ఎయిర్‌టెల్	6.99

స్మాల్, మిడ్‌క్యాప్‌లదే హవా

ఈ ఆర్థిక సంవత్సరంలో చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లు భారీగా పుంజుకున్నాయి. చాలా కంపెనీల షేర్లు ఇన్వెస్టర్లకు మల్టీ బ్యాగర్ రిటర్నులు పంచాయి. 2023-24లో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 70 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 60 శాతం వృద్ధి చెందడమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీలోని 1,000 కంపెనీల షేర్ల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ గడిచిన ఏడాది కాలంలో ఏకంగా రూ.26 లక్షల కోట్ల పెరుగుదలతో మొత్తం రూ.66 లక్షల కోట్లకు చేరుకుంది. స్మాల్, మిడ్‌క్యాప్ విభాగంలో బుడగ ఏర్పడుతున్నదని సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ చేసిన వ్యాఖ్యలతో పాటు చాలా షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో ఈ నెలలో స్మాల్, మిడ్‌క్యాప్ సూచీల్లోని షేర్లలో భారీగా అమ్మకాలు జరిగి, సూచీలు గణనీయంగా జారుకున్నాయి. అయినప్పటికీ, ఆర్థిక సంవత్సరం మొత్తానికి సూచీల్లో ఈ స్థాయి వృద్ధి నమోదు కావడం గమనార్హం. బీఎస్ఈలోని రంగాలవారీ సూచీలు సైతం ఈ ఏడాది భారీగా పెరిగాయి. రియల్టీ, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, ఆటో, ఎనర్జీ రంగాలు 135 శాతం నుంచి 70 శాతం వరకు వృద్ధి చెందాయి.

అంచనాలకు భిన్నంగా..

గత ఆర్థిక సంవత్సరం (2022-23)లాగే ఈసారీ మార్కెట్ పనితీరు అంతంత మాత్రంగానే ఉండవచ్చన్న అంచనాలకు భిన్నంగా సూచీలు బుల్ స్వారీ చేశాయి. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల పోటుతో పాటు అమెరికా సహా అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక మాంద్యం భయాలు, అంతర్జాతీయ రాజకీయ భౌగోళిక ఉద్రిక్తతలు తాత్కాలికంగా ప్రభావం చూపినప్పటికీ సెన్సెక్స్, నిఫ్టీ జోరును నిలువరించలేకపోయాయి. "భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సెంట్రల్ బ్యాంక్‌ల వడ్డీ రేట్ల పెంపు, ముడిచమురు ధరల పెరుగుదల వంటి ప్రతికూలతల్లోనూ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ ఆర్థిక సంవత్సరంలో మెరుగైన రిటర్నులు పంచాయి. ప్రైమరీ మార్కెట్లో పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ) జోరు పెరిగింది. ఎస్ఎంఈ సెగ్మెంట్లోనూ చాలా కంపెనీలు మార్కెట్లో లిస్టయ్యాయి. అంతేకాదు, ఈక్విటీల్లో రిటైల్ మదుపరుల పెట్టుబడులు గడిచిన కొన్నేళ్లలో భారీగా పుంజుకున్నాయ"ని మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అర్విందర్ సింగ్ నంద అన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సెన్సెక్స్ కేవలం 423 పాయింట్లు (0.72 శాతం) వృద్ధి చెందగా.. మార్కెట్ వర్గాల సంపద రూ.5.86 లక్షల కోట్ల మేర తరిగిపోయింది.

భారీ లాభాలతో ముగింపు

2023-24 చివరి ట్రేడింగ్ సెషన్‌లో సెన్సెక్స్ 655 పాయింట్లు అప్

ప్రామాణిక ఈక్విటీ సూచీలు ఈ ఆర్థిక సంవత్సరానికి భారీ లాభాలతో ముగింపు పలికాయి. ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ సెషన్ అయిన గురువారం సెన్సెక్స్ 655.04 పాయింట్ల లాభంతో 73,651.35 వద్ద స్థిరపడింది. ఒక దశలో 1,194 పాయింట్లు పెరిగి 74,190 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసినప్పటికీ.. చివర్లో జరిగిన లాభాల స్వీకరణ కారణంగా సూచీలు మళ్లీ జారుకున్నాయి. నిఫ్టీ 203.25 పాయింట్ల వృద్ధితో 22,326.90 వద్ద క్లోజైంది. గ్లోబల్ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అన్ని రంగాల షేర్లలో భారీగా కొనుగోళ్లకు పాల్పడటం నేటి ర్యాలీకి ప్రధానంగా దోహదపడింది. ప్రధాన కంపెనీలతో పాటు చిన్న, మధ్య స్థాయి షేర్లకూ కొనుగోళ్ల ఆదరణ లభించింది. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.62 శాతం వరకు పెరిగాయి. రంగాల వారీ సూచీలన్నీ పాజిటివ్‌గా ముగిశాయి. దాంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్క రోజులోనే రూ.3.33 లక్షల కోట్ల మేర పెరిగింది.

నేడు మార్కెట్లకు సెలవు

గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం (మార్చి 29) స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు పాటించనున్నాయి. ఏప్రిల్ 1 (సోమవారం)న మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

టెస్లాకు పోటీగా షామీ కారు..

- ఎస్‌యూ7 విక్రయాలు ప్రారంభించిన కంపెనీ
- ప్రారంభ ధర 2,15,900 యువాన్లు

టెస్లా మోడల్ 3 కంటే 30,000 యువాన్లు తక్కువ



బీజింగ్: చవక స్మార్ట్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు పేరుగాంచిన చైనా కంపెనీ షామీ.. ఎలక్ట్రిక్ వాహన రంగంలోకీ తనదైన శైలిలో అరంగేట్రం చేసింది. షామీ తన తొలి ఎలక్ట్రిక్ ప్రీమియం సెడాన్ కారు 'స్పీడ్ అల్ట్రా 7' (ఎస్‌యూ7) విక్రయాలను గురువారం ప్రారంభించింది. టెస్లా, బీవైడీ వంటి ప్రముఖ కంపెనీల ఈవీలకు పోటీగా మార్కెట్లోకి వస్తున్న ఈ కారు మూడు వేరియంట్లలో (స్టాండర్డ్, ప్రో, మ్యాక్స్), తొమ్మిది రంగుల్లో లభించనుంది. దీని ప్రారంభ ధర 29,870 డాలర్లు (చైనా కరెన్సీలో 2,15,900 యువాన్లు, మన కరెన్సీలో రూ.25 లక్షలు). టెస్లా మోడల్ 3 రేటు (2,45,900 యువాన్లు) కంటే 30,000 యువాన్లు తక్కువ ఇది. ప్రస్తుతం ఎస్‌యూ7ను చైనా మార్కెట్లో విక్రయించనున్న షామీ.. త్వరలో భారత్ సహా ఇతర మార్కెట్లలోకి అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది.

అదానీ-అంబానీ భాయ్ భాయ్

అదానీ పవర్ ఎంపీ యూనిట్‌లో అంబానీకి వాటా

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ. దేశంలో అత్యంత సంపన్నులైన పారిశ్రామికవేత్తలు. ఇద్దరూ గుజరాతీలు. ఇప్పుడు వీరిద్దరూ చేతులు కలిపారు. మధ్యప్రదేశ్‌లో అదానీ పవర్ అనుబంధ సంస్థ మహాన్ ఎనర్జెన్ లిమిటెడ్ (ఎంఈఎల్) ఈక్విటీలో ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) 26 శాతం వాటాను రూ.50 కోట్లకు కొనుగోలు చేస్తోంది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ పారిశ్రామిక దిగ్గజాలు చేతులు కలపడం ఇదే మొదటిసారి.

ఎందుకంటే: అదానీ పవర్ మధ్యప్రదేశ్‌లోని ఈ థర్మల్ పవర్ ప్రాజెక్టును 2,800 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తోంది. ఇందులో 500 మెగావాట్లను ఆర్ఐఎల్ తన సొంత అవసరాల కోసం వినియోగించుకోబోతోంది. అయితే ఏ ప్రాజెక్టు అవసరాల కోసం ఆర్ఐఎల్ ఈ విద్యుత్‌ను ఉపయోగించబోతోందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ ఒప్పందం కింద ఎంఈఎల్ 20 ఏళ్ల పాటు ఆర్ఐఎల్‌కు విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంటుంది. రెండు వారాల్లో ఈ ఒప్పందానికి రెగ్యులేటరీ సంస్థల అనుమతులు లభించే అవకాశం ఉందని రెండు సంస్థలు తెలిపాయి.

అంబుజా సిమెంట్స్‌లో అదానీకి మరింత వాటా: అంబుజా సిమెంట్స్ ఈక్విటీలో అదానీ గ్రూప్ వాటా 63.1 శాతం నుంచి 66.7 శాతానికి పెరిగింది. ఇందుకోసం రూ.6,661 కోట్లతో 21.2 కోట్ల వారంట్లను ఈక్విటీ షేర్లుగా మార్చుకుంది. అంబుజా సిమెంట్స్ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ నిధులతో 2028 నాటికి అంబుజా సిమెంట్స్ తన వార్షిక సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 14 కోట్ల టన్నులకు పెంచుకునేందుకు వీలవుతుందని భావిస్తున్నారు.

కాగా అదానీ గ్రూప్ రాగి (కాపర్) ఉత్పత్తిలోకి ప్రవేశించింది. గుజరాత్‌లో ముంద్రా వద్ద 5 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కచ్ కాపర్ పేరుతో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో ఉత్పత్తిని ప్రారంభించింది.

- టయోటా కిర్లోస్కర్ మోటార్ ఏప్రిల్ 1 నుంచి ఎంపిక చేసిన కొన్ని వాహనాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. నిర్వహణ వ్యయాలతో పాటు ఇన్‌పుట్ వ్యయాలు పెరిగిపోవటంతో ధరలను 1 శాతం మేర పెంచాల్సి వచ్చిందని వెల్లడించింది.
- టెక్స్‌టైల్స్, అపారెల్స్, లగ్జరీ ఉత్పత్తుల విభాగంలో 2023 సంవత్సరానికి గాను వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ (డబ్ల్యూఎల్ఎల్) అత్యుత్తమ ఈఎస్‌జీ రేటింగ్‌ను సాధించింది. ఎస్ అండ్ పీ గ్లోబల్ ఈఎస్‌జీ స్కోర్‌లో మొత్తంగా 66 స్కోర్‌ను సాధించినట్లు వెల్‌స్పన్ లివింగ్ తెలిపింది.
- పర్యావరణ పరిరక్షణ కోసం కర్బన ఉద్గారాలను తగ్గించటంలో ఇంటర్‌సిటీ ట్రావెల్ సర్వీస్ ప్రొవైడర్ ఫ్రెష్ బస్ ముందు వరుసలో ఉంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కర్బన ఉద్గారాలను తగ్గించటం కోసం క్లైమెట్ ఫైనాన్స్ కంపెనీ క్లైమ్స్‌తో జట్టు కట్టడం ఇందుకు ఎంతగానో కలిసివచ్చింది.



వార్నర్, స్టొయినిస్‌లకు నో కాంట్రాక్ట్

మెల్‌బోర్న్: క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తమ సెంట్రల్ కాంట్రాక్ట్ ఆటగాళ్ల జాబితాను ప్రకటించింది. ఈసారి 23 మంది ప్లేయర్లకు కాంట్రాక్ట్ ఇవ్వగా, ఇందులో స్టార్ ఆటగాళ్లు స్టొయినిస్, ఆస్టన్ ఏగర్‌లకు చోటు దక్కలేదు. అలాగే ఇప్పటికే వన్డే, టెస్టుల నుంచి వైదొలిగిన ఓపెనర్ డేవిడ్ వార్నర్ పేరును సైతం పరిగణనలోకి తీసుకోలేదు.

సింధు ముందంజ

స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ



మాడ్రిడ్: పీవీ సింధు స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో ముందంజ వేసింది. సింధు 21-14, 21-12తో హువాంగ్ యు స్యూన్ (తైపీ)ని ఓడించి క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. అలాగే సిక్కిరెడ్డి/సుమిత్ జోడీ మిక్స్‌డ్‌లో 22-20, 21-18తో స్మిత్/లీ (అమెరికా)ను ఓడించి క్వార్టర్స్ చేరింది. మహిళల డబుల్స్‌లో అశ్విని/తనీషా జోడీ 21-14, 21-18తో టిఫానీ/గ్రోన్యా (ఆస్ట్రేలియా)పై నెగ్గి రౌండ్-8లో ప్రవేశించింది. పురుషుల డబుల్స్‌లో అర్జున్/ధ్రువ్ కపిల జోడీ, అలాగే కృష్ణప్రసాద్/సాయి ప్రతీక్ ఓటమి పాలయ్యారు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఓడిన కిడాంబి శ్రీకాంత్ తొలిరౌండ్‌లోనే నిష్క్రమించాడు. కొ టకాహషి (జపాన్)తో జరిగిన మొదటి రౌండ్‌లో శ్రీకాంత్ 18-21, 15-21తో పరాజయం పాలయ్యాడు.

బస్ వద్దు...బైక్ ముద్దు

లఖ్‌నవూ వీధుల్లో రోడ్స్ రయ్..రయ్..



లఖ్‌నవూ: లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఫీల్డింగ్ కోచ్ జాంటీ రోడ్స్‌కు మోటార్ సైకిల్ ప్రయాణమంటే మహా సరదా. భారత్‌లోని పలు ప్రాంతాలను అతడు గతంలో బైక్‌పై చుట్టేసి వచ్చాడు. ఇక..ఐపీఎల్‌లో శనివారం ఇక్కడ జరిగే తదుపరి మ్యాచ్‌లో పంజాబ్‌ను లఖ్‌నవూ ఢీకొననుంది. ఈనేపథ్యంలో గురువారం జట్టు మొత్తం ప్రాక్టీస్ కోసం హోటల్‌నుంచి బస్సులో స్టేడియానికి వెళ్లగా..రోడ్స్ మాత్రం బుల్లెట్‌పై వచ్చి తన ప్రత్యేకతను చాటుకున్నాడు.

అమెరికా జట్టులో తెలుగమ్మాయి శాన్వి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అమెరికా మహిళల జాతీయ క్రికెట్ జట్టులో తెలుగమ్మాయి ఇమ్మడి శాన్వికి చోటు లభించింది. యూఏఈలో జరుగనున్న టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో తలపడే అమెరికా జట్టుకు శాన్వి ప్రాతినిధ్యం వహించనుంది. అండర్-15 ఎంఎల్‌సీ జూనియర్‌లీగ్‌లో కాలిఫోర్నియా కెప్టెన్‌గా వ్యవహరించింది. ఈ కుడి చేతివాటం లెగ్‌స్పిన్ ఆల్‌రౌండర్ శాన్ డియేగో టీ20 టోర్నీలో 10, జాతీయ సెలెక్షన్స్‌లో 9 వికెట్లు తీసి అమెరికా జట్టులో స్థానం సంపాదించింది. ఇక, సికింద్రాబాద్‌లో నివాసముండే శాన్వి కుటుంబం 1997లో అమెరికాకు వెళ్లి కాలిఫోర్నియాలో స్థిరపడింది.

విహారికి ఏసీఏ షోకాజ్ నోటీసు

కొత్తగా చెప్పాల్సిందేమీ లేదన్న హనుమ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆంధ్ర రంజీ జట్టు మాజీ కెప్టెన్, టీమిండియా క్రికెటర్ హనుమ విహారికి ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) మధ్య వివాదం షోకాజ్ నోటీసుకు దారితీసింది. గత వారంలో జరిగిన ఏసీఏ అపెక్స్ కౌన్సిల్‌లో విహారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని తీర్మానించారు. ఈనెల 25న ఈ-మెయిల్‌లో ఏసీఏ షోకాజ్ నోటీసులు పంపించింది. విహారికి తన సమస్యలను చెప్పుకోవడానికి ఇదొక అవకాశమని, తాను ఎదుర్కొన్న ఇబ్బందులను తెలియజేయాలని ఒక ఏసీఏ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. అసలేమి జరిగిందో తెలుసుకోవడానికే తాము ఈ నోటీసు ఇచ్చామని ఆయన తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అభివృద్ధిలో విహారి పాత్ర విలువైందని, అతడి సమస్యలు తెలియజేయడానికి ఇదొక అవకాశమని సదరు ఏసీఏ పెద్ద అభిప్రాయపడ్డారు. అయితే, దీనిపై విహారి స్పందిస్తూ తాను షోకాజ్ నోటీసుకు బదులిచ్చానని తెలిపాడు. ఈ సీజన్ రంజీ ట్రోఫీ క్వార్టర్స్‌లో ఆంధ్ర జట్టు ఓడిన రోజునే తాను చెప్పాల్సిందంతా చెప్పానన్నాడు. వచ్చే దేశవాళీ సీజన్‌లో తాను వేరే జట్టు తరఫున ఆడాలని నిర్ణయించుకున్నానని, ఇందుకోసం నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇవ్వాల్సిందిగా ఏసీఏను అడిగానని, వారి స్పందన కోసం వేచి చూస్తున్నానని విహారి తెలిపాడు. ఇక, ఈ సీజన్ రంజీ ట్రోఫీ తొలి మ్యాచ్ అనంతరం విహారి హఠాత్తుగా సారథ్య బాధ్యతల నుంచి తప్పుకోవడం, ఆ తర్వాత జట్టులోని 17వ నెంబర్ ఆటగాడు పృథ్వీరాజ్, అతడి తండ్రి తెచ్చిన ఒత్తిడిపై విహారి బహిరంగంగానే విమర్శలు చేయడం తెలిసిందే.

ఐపీఎల్ తొలిరోజు రికార్డు బద్దలు

న్యూఢిల్లీ: ఐపీఎల్ 17వ సీజన్ తొలిరోజు వ్యూయర్‌షిప్‌లో రికార్డులను బద్దలుకొట్టింది. టోర్నీకి మొదటి రోజైన ఈనెల 22వ తేదీన టీవీల్లో ఏకంగా 16.8 కోట్ల వ్యూస్ వచ్చాయని అధికారిక బ్రాడ్‌కాస్టర్ డిస్నీ స్టార్ పేర్కొంది. ఆ రోజు చెన్నై-బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్‌కు ముందు బాలీవుడ్ స్టార్ల ప్రదర్శనలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అలాగే తిలకించిన సమయం కూడా 1,276 కోట్ల నిమిషాలుగా నమోదైందట. ఇప్పటివరకు అన్ని సీజన్ల తొలి రోజుకు సంబంధించి ఇదే అత్యుత్తమం. గతేడాది ఇది 870 కోట్ల నిమిషాలుగా ఉందట. మొత్తంగా గతేడాదితో పోలిస్తే టీవీక్షణంలోనూ 16 శాతం పెరుగుదల నమోదైంది. ఇక డిజిటల్ ప్లాట్‌ఫామ్ జియో సినిమాకూ తొలి మ్యాచ్‌కు 11.3 కోట్ల వ్యూయర్‌షిప్ దక్కింది.

నేటి మ్యాచ్
బెంగళూరు x కోల్‌కతా
రాత్రి 7.30 గం. నుంచి

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (బి) ముఖేష్ 5, బట్లర్ (ఎల్బీ) కుల్దీప్ 11, శాంసన్ (సి) పంత్ (బి) ఖలీల్ 15, పరాగ్ (నాటౌట్) 84, అశ్విన్ (సి) స్టబ్స్ (బి) అక్షర్ 29, జురెల్ (బి) నోకియా 20, హెట్‌మయెర్ (నాటౌట్) 14, **ఎక్స్‌ట్రాలు 7: మొత్తం (20 ఓవర్లలో) 185/5 ; వికెట్లపతనం :** 1/9, 2/30, 3/36, 4/90, 5/142 ; **బౌలింగ్ :** ఖలీల్ 4-0-24-1, ముఖేష్ 4-0-49-1, నోకియా 4-0-48-1, అక్షర్ 4-0-21-1, కుల్దీప్ 4-0-41-1

ఢిల్లీ క్యాపిటల్స్: వార్నర్ (సి) సందీప్ (బి) అవేశ్ 49, మార్ష్ (బి) బర్గర్ 23, భుయ్ (సి) శాంసన్ (బి) బర్గర్ 0, పంత్ (సి) శాంసన్ (బి) చాహల్ 28, స్టబ్స్ (నాటౌట్) 44, పోరెల్ (సి) బట్లర్ (బి) చాహల్ 9, అక్షర్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు 5: మొత్తం (20 ఓవర్లలో) 173/5 ; వికెట్లపతనం :** 1/30, 2/30, 3/97, 4/105, 5/122 ; **బౌలింగ్ :** బౌల్ట్ 3-0-29-0, బర్గర్ 3-0-29-2, అశ్విన్ 3-0-30-0, అవేశ్ ఖాన్ 4-0-29-1, చాహల్ 3-0-19-2, సందీప్ శర్మ 4-0-36-0.

ఫటాఫట్ పరాగ్

మెరుపు అర్ధసెంచరీ

రాజస్థాన్‌కు రెండో గెలుపు ● ఢిల్లీకి నిరాశ



రియాన్ పరాగ్ (45 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 84 నాటౌట్)

జైపూర్: తాజా సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జోరు సాగిస్తోంది. యువ బ్యాటర్ రియాన్ పరాగ్ (45 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 84 నాటౌట్) మెరుపు ఆటతీరుతో ఐపీఎల్‌లో తన అత్యధిక స్కోరు సాధించగా.. బౌలర్లు సైతం తమ వంతు సహకారం అందించారు. దీంతో గురువారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్ఆర్ 12 పరుగుల తేడాతో నెగ్గింది. ఆఖరి ఓవర్‌లోనూ ఢిల్లీకి గెలిచే అవకాశం ఉన్నా.. పేసర్ అవేశ్ పదునైన యార్కర్లతో కట్టడి చేశాడు. శాంసన్ సేనకిది వరుసగా రెండో విజయం కాగా.. డీసీకిది రెండో ఓటమి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 185 పరుగులు చేసింది. అశ్విన్ (19 బంతుల్లో 3 సిక్సర్లతో 29), ధ్రువ్ (12 బంతుల్లో 3 ఫోర్లతో 20) వేగంగా ఆడారు. ఆ తర్వాత ఛేదనలో ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 173 పరుగులు చేసి ఓడింది. వార్నర్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 49), స్టబ్స్ (23 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 44 నాటౌట్) రాణించారు. చాహల్, బర్గర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రియాన్ పరాగ్ నిలిచాడు.



స్టబ్స్ (44 నాటౌట్)

ఆరంభం బాగున్నా..

భారీ ఛేదనను ఢిల్లీ ఆత్మవిశ్వాసంతో ఆరంభించినా.. తుదికంటా ఆ ఊపును కొనసాగించలేకపోయింది. కీలక సమయాల్లో రాయల్స్ బౌలర్లు వికెట్లు తీసి ఫలితాన్ని సాధించారు. చివర్లో స్టబ్స్ పోరాటం సరిపోలేదు. ప్రారంభంలో ఓపెనర్లు డేవిడ్ వార్నర్, మార్ష్ ఎడాపెడా బౌండరీలతో స్కోరు పది పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. రెండో ఓవర్‌లో మార్ష్ మూడు ఫోర్లు, మూడో ఓవర్‌లో రెండు ఫోర్లతో జోరు చూపాడు. కానీ నాలుగో ఓవర్‌లో పేసర్ బర్గర్.. మార్ష్ (23), భుయ్ (0)ల వికెట్లను తీశాడు. అటు వార్నర్ మాత్రం తగ్గకుండా బౌల్ట్ ఓవర్‌లో 6,6, బర్గర్ ఓవర్‌లో మరో 4,6తో పవర్‌ప్లేలో ఢిల్లీ 59/2తో పటిష్ఠంగానే కనిపించింది. అటు పంత్ (28) కూడా వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు సాధించాడు. అయితే హాఫ్ సెంచరీకి పరుగు దూరంలో వార్నర్‌ను పేసర్ అవేశ్ పెవిలియన్‌కు చేర్చాడు. అప్పటికే మూడో వికెట్‌కు 67 పరుగులు జత చేరాయి. ఓవర్ వ్యవధిలోనే కెప్టెన్ పంత్ వికెట్‌ను సైతం డీసీ కోల్పోవడం దెబ్బతీసింది. చాహల్ ఓవర్‌లో కట్ షాట్ ఆడబోయిన తను కీపర్ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఇక నాలుగు ఓవర్లలో 60 పరుగులు చేయాల్సిన వేళ ఢిల్లీపై ఒత్తిడి పెరిగింది. అటు రాజస్థాన్ బౌలర్లు ఆత్మవిశ్వాసంతో కనిపించారు. కానీ హిట్టర్ ట్రిస్టాన్ స్టబ్స్ ఎదురుదాడికి దిగడంతో లక్ష్యం వేగంగా కరిగింది. 17వ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాది 19 రన్స్ అందించడంతో డీసీ శిబిరంలో కాస్త జోష్ కనిపించింది. ఇక 19వ ఓవర్‌లోనూ తను 6,4 సాధించగా, సమీకరణం ఆరు బంతులు, 17 రన్స్‌కి మారింది. అయితే పేసర్ అవేశ్ అద్భుతంగా కట్టడి చేస్తూ 20వ ఓవర్‌లో కేవలం నాలుగు పరుగులే ఇవ్వడంతో డీసీకి రెండో ఓటమి తప్పలేదు.

డెత్ ఓవర్లలో దాడి

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ తొలి పది ఓవర్లలో 57 పరుగులే చేయగా.. ఆ తర్వాత పది ఓవర్లలో ఏకంగా 128 పరుగులు రాబట్టింది. ఇందులో యువ బ్యాటర్ రియాన్ పరాగ్ విజృంభణకు ఆఖరి ఆరు ఓవర్లలోనే 92 రన్స్ వచ్చాయి. మధ్య ఓవర్లలో అశ్విన్ వేగం కూడా ఉపయోగపడింది. పవర్‌ప్లేలో 31 పరుగులకే పరిమితమైన జట్టు ఓపెనర్ జైస్వాల్ (5), కెప్టెన్ శాంసన్ (15) వికెట్లను కోల్పోయింది. ఇక ఓపెనర్ బట్లర్ (11) పేలవ ఫామ్ ఈ మ్యాచ్‌లోనూ కొనసాగింది. 37/3 స్కోరుతో కష్టాల్లో పడిన ఆర్ఆర్‌ను అశ్విన్, రియాన్ జోడీ ఆదుకుంది. ఐదో నెంబర్‌లో బరిలోకి దిగిన అశ్విన్ హిట్టింగ్‌కు దిగి పదో ఓవర్‌లో సిక్సర్, తర్వాతి ఓవర్‌లో రెండు సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. అటు పరాగ్ సైతం కుల్దీప్ ఓవర్‌లో సిక్సర్ బాదడంతో ఆటలో కాస్త వేగం పెరిగింది. అయితే చక్కగా కుదురుకున్న అశ్విన్ భారీ షాట్‌కు వెళ్లి స్పిన్నర్ అక్షర్‌కు దొరికిపోయాడు. దీంతో నాలుగో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం పరాగ్ బ్యాట్ ఝుళిపిస్తూ ఖలీల్ ఓవర్‌లో 6,4,4.. ముకేశ్ ఓవర్‌లో 4,6 బాది 34 బంతుల్లో ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. అటు ధ్రువ్ జురెల్ (20)తో ఐదో వికెట్‌కు 52 పరుగులు జత చేశాడు. ఇక ఆఖరి ఓవర్‌లో రియాన్ విశ్వరూపం ప్రదర్శిస్తూ.. 4,4,6,4,6తో 25 పరుగులు సమకూర్చాడు. అటు తన చివరి 19 బంతుల్లో పరాగ్ 58 పరుగులు సాధించడం విశేషం.

లోక్‌సభ రెండోదశ ఎన్నికలకు నోటిఫికేషన్

» 88 స్థానాలకు మొదలైన నామినేషన్ల పర్వం

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల రెండో దశ పోలింగ్ నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. 12 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం పరిధిలోని మొత్తం 88 లోక్‌సభ నియోజకవర్గాలకు ఈసీ రెండో దశలో ఎన్నికలను నిర్వహించనుంది. అసోం, బిహార్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, మణిపూర్, జమ్మూ కశ్మీర్‌లోని పలు నియోజకవర్గాలకు రెండో దశలో పోలింగ్ జరగనుంది. నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచే ప్రారంభమైంది. నామినేషన్ల దాఖలుకు ఏప్రిల్ 4 చివరి తేదీ. ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుంది. జమ్మూ కశ్మీర్‌లో ఏప్రిల్ 6న నామినేషన్ల పరిశీలన ఉంటుందని, మిగిలిన 11 రాష్ట్రాల్లో ఏప్రిల్ 5న నామినేషన్ల పరిశీలన ఉంటుందని ఈసీ వెల్లడించింది.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఈరోడ్ ఎండీఎంకే ఎంపీ గణేషమూర్తి మృతి



చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నాలుగురోజులుగా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న తమిళనాడు ఈరోడ్ ఎండీఎంకే లోక్‌సభ సభ్యుడు గణేషమూర్తి గురువారం వేకువజామున మృతి చెందారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఎండీఎంకే కోశాధికారిగా ఉన్న గణేషమూర్తి డీఎంకే ఉదయసూర్యుడి గుర్తుపై పోటీ చేసి గెలిచారు. ఈసారి కూడా ఈరోడ్ నియోజకవర్గాన్ని డీఎంకే కూటమి కేటాయిస్తుందని, మళ్లీ పోటీ చేయవచ్చునని గణేష్‌మూర్తి ఆశలు పెట్టుకున్నారు. అయితే డీఎంకే అధిష్ఠానం ఎండీఎంకేకు ఈరోడ్ నియోజకవర్గానికి బదులుగా ఈసారి తిరుచ్చి నియోజకవర్గాన్ని కేటాయించింది. ఈరోడ్‌లో డీఎంకే పోటీ చేయనుంది. ఈ విషయం తెలిసినప్పటి నుంచి గణేష్‌మూర్తి మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. గత ఆదివారం మధ్యాహ్నం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను కోయంబత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గణేష్‌మూర్తి గురువారం మృతి చెందారు.

నా శవంపై ఎన్నికలు జరపాలనుకుంటున్నారు..

» బీజేపీపై మంత్రి ప్రియాంక్‌ఖర్గే ఆగ్రహం

బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ వాళ్లు తన శవంపై ఎన్నికలు జరపాలనుకుంటున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు, కర్ణాటక ఐటీబీటీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కలబురగిలో ప్రియాంక్ ఖర్గే గురువారం మీడియాతో మాట్లాడారు. పది రోజుల క్రితం తనకు బెదిరింపు లేఖ వచ్చిందని చెప్పారు. ఆ లేఖలో తనతో పాటు తన కుటుంబ సభ్యులను తీవ్రమైన పదజాలంతో దూషించారన్నారు. దీనిపై విధానసౌధ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. బెదిరింపు లేఖ వెనుక కుట్ర ఉందని అన్నారు. బీజేపీ నేతలపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

తొలిసారి గాల్లోకి ఎగిరిన తేజస్ మార్క్-1ఏ

» హాల్ ఆధ్వర్యంలో తొలి ప్రయాణం విజయవంతం

బెంగళూరు, మార్చి 28: స్వదేశీ తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్ మార్క్-1ఏ తన తొలి ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుంది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) దేశీయంగా తయారు చేసిన ఈ యుద్ధ విమానాన్ని బెంగళూరులో గురువారం తొలిసారిగా పరీక్షించారు. ఈ పరీక్షలో భాగంగా తేజస్ మార్క్-1ఏ 15 నిమిషాలపాటు గాలిలో ఎగిరిందని హాల్ అధికారులు తెలిపారు. పాకిస్థాన్ సరిహద్దు రాజస్థాన్‌లోని బికనీర్ వద్ద నాల్ వైమానిక స్థావరంలో ఈ యుద్ధ విమానాలను మోహరించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. రక్షణ వర్గాల సమాచారం మేరకు ఈ ట్విన్ సీటర్ ట్రైనర్ వెర్షన్ యుద్ధ విమానాలను ఈ నెల 31లోపు ఐఏఎఫ్‌కు అప్పగించాలని హాల్ ప్రయత్నిస్తోంది.

స్కైరూట్ రాకెట్ మోటార్ పరీక్ష సక్సెస్

హైదరాబాద్, మార్చి 28: హైదరాబాద్‌కు చెందిన అంతరిక్ష స్టార్టప్ కంపెనీ స్కైరూట్ ఏరోస్పేస్ ఈ ఏడాది చివర్లో విక్రమ్-1 రాకెట్ ద్వారా ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. అందులో భాగంగా రాకెట్‌లోని స్టేజ్-2 మోటార్ 'కలామ్-250'ను విజయవంతంగా పరీక్షించినట్లు ఆ సంస్థ గురువారం పేర్కొంది. స్టేజ్-2లోని హై-స్ట్రెంత్ కార్బన్ కాంపోజిట్ మోటార్ రాకెట్‌ను వాతావరణ దశ నుంచి అంతరిక్షంలోకి తీసుకెళ్తుందని స్కైరూట్ తెలిపింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలో ఇస్రోకు చెందిన ప్రొపల్షన్ టెస్ట్ బెడ్ వద్ద 'కలాం-250' మోటార్‌ను 85 సెకన్లపాటు మండించి పరీక్షించారు. "భారత అంతరిక్ష పరిశ్రమకు ఇదొక ముఖ్యమైన మైలురాయి. ప్రైవేటు రంగం రూపొందించిన కార్బన్-కాంపోజిట్-బిల్ట్ మోటారును ఇస్రోలో విజయవంతంగా పరీక్షించాం. ఈ సందర్భంగా ఇది అన్ని పారామితులను అందుకుంది. ఈ విజయం విక్రమ్-1 రాకెట్ ప్రయోగానికి మమ్మల్ని మరో అడుగు చేరువ చేసింది" అని స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో పవన్ చందన పేర్కొన్నారు.

ఆన్సర్ షీట్ చూపించలేదని కత్తితో పొడిచారు

» పదో తరగతి విద్యార్థిపై ముగ్గురు సహచరుల దాడి

భివాండి, మార్చి 28: బుద్ధిగా పరీక్ష రాసి, సెంటరు నుంచి బయటకొచ్చిన పదో క్లాసు విద్యార్థి కత్తిపోటుకు గురయ్యాడు! అతడిపై ఈ దాడికి తెగబడింది తోటి విద్యార్థులే! పరీక్ష గదిలో తాము అడిగినా జవాబు పత్రం చూపించడానికి నిరాకరించాడనే ఆగ్రహంతోనే వారు ఇంతటి దారుణానికి ఒడిగట్టారు. మహారాష్ట్రలోని ఠాణే జిల్లా భివాండీలో ఈ ఘటన జరిగింది. మంగళవారం పరీక్ష కేంద్రం గదిలో విద్యార్థి పరీక్ష రాస్తుండగా ఆన్సర్ షీట్‌ను చూపించాలని అతడిని ముగ్గురు సహచర విద్యార్థులు అడిగారు. ఇందుకు అతడు నిరాకరించాడు. ఫలితంగా ఆ విద్యార్థిపై కోపం పెంచుకున్న ముగ్గురు, కాస్త ముందే జవాబు పత్రాలను ఇచ్చేసి బయటకొచ్చేశారు. ఆ విద్యార్థి ఎగ్జామ్ సెంటర్ నుంచి బయటకు రాగానే కత్తితో పొడిచారు. గాయపడిన బాలుడిని చికిత్స కోసం వెంటనే ఆస్పత్రికి తరలించారు. అతడికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. దాడికి పాల్పడిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ మృతి

» అతనిపై 60కి పైగా క్రిమినల్ కేసులు

» ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక

» ప్రస్తుతం బాందాలో జైలు జీవితం



బాందా, మార్చి 28: ఉత్తరప్రదేశ్‌లోని బాందా జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ (63) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. అతన్ని జైలు అధికారులు బాందా మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. దీనికి ముందు మంగళవారం తెల్లవారుజామున అన్సారీకి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో ఇదే ఆస్పత్రిలో చికిత్స అందించారు. అదే రోజు సాయంత్రం డిశ్చార్జి చేయగా తిరిగి జైలుకు తరలించారు. గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ రాజకీయాల్లోకి అడుగుపెట్టి మవూ సదర్ నుంచి అయిదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాడు. అతనిపై 60 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్నేళ్లుగా యూపీ, పంజాబ్ రాష్ట్రాల్లో జైలు జీవితం గడుపుతున్నాడు. బీజేపీ ఎమ్మెల్యే కృష్ణానంద్ రాయ్ హత్య కేసులో కోర్టు ముఖ్తార్‌కు 2023లో పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఆయుధాల నకిలీ లైసెన్సు కేసులో ఇటీవల యావజ్జీవ కారాగార శిక్ష పడింది. అతని మృతితో యూపీలోని బాందా, మవూ, ఘాజీపూర్, వారాణసీ జిల్లాలో భద్రతను పెంచారు. పలు ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. ముఖ్తార్‌కు జైలులో విషం ఇచ్చి చంపారని అతని సోదరుడు, ఘాజీపూర్ ఎంపీ అఫ్జల్ అన్సారీ ఆరోపించారు. ముఖ్తార్.. మాజీ ఉప రాష్ట్రపతి మహమ్మద్ అమీద్ అన్సారీకి బంధువు.

అసలు కుంభకోణం ఈడీదే!

(మొదటి పేజీ తరవాయి)

ఇచ్చారని ఆరోపించారు. ఈడీకి నచ్చినంత కాలం తనను రిమాండ్‌లో ఉంచుకోవచ్చని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. విచారణకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా తనను ఇరికించడమే లక్ష్యంగా ఈడీ పని చేస్తోందని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో అరెస్టయిన కేజ్రీవాల్‌ను ఈడీ గురువారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచింది. మరో వారం రోజుల కస్టడీకి అనుమతించాలని కోరింది. సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా విచారణ నిర్వహించారు. కేజ్రీవాల్‌కు స్వయంగా వాదనలు వినిపించడానికి అవకాశం ఇవ్వాలని ఆయన తరపున సీనియర్ అడ్వొకేట్ రమేశ్ గుప్తా కోరారు. న్యాయమూర్తి అంగీకరించారు. కేజ్రీవాల్‌కు ఐదు నిమిషాలు అవకాశం ఇచ్చారు. దాంతో కేజ్రీవాల్ స్వయంగా హిందీలో వాదనలు వినిపించారు. ఈడీపై పలు కీలక ఆరోపణలు చేశారు. ఈడీ ఫైల్‌లో ఉన్న లక్ష పేజీలు తమకు అనుకూలంగా ఉన్నా రికార్డుల్లోకి తేవడం లేదన్నారు.

సీఎం అరెస్టుకు నలుగురి మాటలు చాలా?

కేజ్రీవాల్ మాట్లాడుతుండగా, మధ్యలో ఈడీ న్యాయవాదులు జోక్యం చేసుకోబోగా కోర్టు అనుమతించలేదు. ఈడీ దర్యాప్తు విధానం, అరెస్టులు తదితర అంశాలపై కేజ్రీవాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. "2022 ఆగస్టు 17న సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 2022 ఆగస్టు 22న ఈసీఐఆర్ నమోదు చేసింది. నన్ను అరెస్టు చేశారు. కానీ ఏ కోర్టు కూడా నన్ను దోషిగా నిర్ధరించలేదు. సీబీఐ 31,000 పేజీలు, ఈడీ 25,000పేజీల సమాచారాన్ని ఈ విషయానికి సంబంధించి కోర్టు ముందు ఉంచాయి. మీరు వాటిని కలిపి చదివారా? అసలు నన్ను ఎందుకు అరెస్టు చేశారు? సిటింగ్ సీఎంను అరెస్టు చేయడానికి నలుగురు వ్యక్తులు చేసిన ప్రకటనలు సరిపోతాయా?" అని కేజ్రీవాల్ న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసును ఈడీ తప్పుదారి పట్టిస్తోందని ఆరోపించారు. మనీశ్ సిసోడియా సమక్షంలో తనకు మద్యం విధాన పత్రాలు ఇచ్చారని సి.అరవింద్ చెప్పారని ఈడీ అంటోందని కేజ్రీవాల్ ప్రస్తావించారు. ప్రస్తుత సీఎంను అరెస్టు చేయడానికి ఇది కారణం అవుతుందా? అని ప్రశ్నించారు. రోజూ చాలామంది ప్రజాప్రతినిధులు వస్తారని, బయటికొచ్చాక చాలామంది చాలా ప్రకటనలు చేస్తారని కేజ్రీవాల్ ప్రస్తావించారు. తనకు వ్యతిరేకంగా మాగుంట శ్రీనివాసులురెడ్డి ఇచ్చిన ప్రకటనను ఆధారంగా చేసుకొని సీఎంను అరెస్టు చేస్తారా?అని ప్రశ్నించారు. మద్యం పాలసీ మీద మాగుంట చాలాసార్లు మాట్లాడారని, ఈ కేసులో ఆయన తనయుడు రాఘవను అరెస్టు చేశాకే, మాట మార్చి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇచ్చారని చెప్పారు. ఇవన్నీ చూస్తుంటే ఈడీ కేవలం తనను ట్రాప్ చేయడానికే కంకణం కట్టుకుందని అర్థం అవుతోందన్నారు. మూడు రకాల ప్రకటనలు ఇచ్చినపుడు తనకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యం ఒక్కటే ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి తొలి ఆరు ప్రకటనలు తనకు అనుకూలంగా ఇచ్చారని, మాట మార్చి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వగానే బెయిలు లభించిందని ప్రస్తావించారు. అతని వాంగ్మూలం తన అరెస్టుకు ఎలా ప్రామాణికం అవుతుందన్నారు. చివరగా అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి ప్రకటనను తన అరెస్టుకు ప్రాతిపదికగా వాడారన్నారు. ఆయన 2022 నవంబరులో అరెస్టయితే 2023 జూన్‌లో అప్రూవర్‌గా మారారని.. శరత్‌రెడ్డి మొదటి 11 ప్రకటనల్లో తన ప్రస్తావన చేయలేదన్నారు. 12వ ప్రకటనలో కూడా తాను కేజ్రీవాల్‌ను కలిశానని, హడావుడిగా ఉన్న సీఎం ఆప్ సమాచార విభాగం అధిపతిగా ఉన్న విజయ్‌నాయర్‌తో టచ్‌లో ఉండాలని చెప్పారని మాత్రమే శరత్‌చంద్రారెడ్డి పేర్కొన్నారని కేజ్రీవాల్ గుర్తు చేశారు. శరత్‌చంద్రారెడ్డి ఈ కేసులో అరెస్టయిన తర్వాతే బీజేపీకి రూ.55కోట్ల బాండ్లు కొన్నారని, పచ్చిగా చెప్పాలంటే బెయిలు కొనుక్కున్నారని సీఎం వ్యాఖ్యానించారు. ఈడీ ముడుపుల రాకెట్‌కు ఇంతకన్నా ఆధారాలేం కావాలని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన సీఎంను అరెస్టు చేసేందుకు ఈ 4 ప్రకటనలు సరిపోతాయా? అని ప్రశ్నించారు.



ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు వద్ద సీఎం కేజ్రీవాల్

సౌత్ గ్రూప్ హవాలాపై ఆధారాలున్నాయ్

కేజ్రీవాల్ ఆరోపణలను ఈడీ న్యాయవాది ఎస్వీ రాజు ఖండించారు. మద్యం విధానం కుంభకోణంలో స్వీకరించిన లంచాల మొత్తాలను ఆప్ గోవా ఎన్నికల్లో వినియోగించిందని రాజు ఆరోపించారు. సౌత్ గ్రూప్ నుంచి హవాలా రూపంలో డబ్బులు వచ్చాయని చెప్పడానికి ఈడీ దగ్గర సాక్ష్యాలున్నాయన్నారు. మద్యం కుంభకోణానికి బీజేపీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వచ్చిన రూ.55 కోట్లకు ఏ సంబంధంలేదని ఈడీ న్యాయవాది చెప్పారు. సీఎం అయినంత మాత్రాన అరెస్ట్ చేయకూడదనిలేదని రాజు కోర్టుకు వివరించారు. సీఎంకు భిన్నమైన ప్రమాణాలులేవని, సామాన్యుల లాగానే సీఎంను అరెస్ట్ చేసే అధికారం ఉందన్నారు. కేజ్రీవాల్ తరపు న్యాయవాది రమేశ్ గుప్తా స్పందిస్తూ ఎలక్టోరల్ బాండ్స్‌తో ఈ కేసుకు సంబంధం లేదంటే దీనిపై కూడా విచారణ జరిపేలా ఈడీకి ఆదేశాలివ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. వాదనలు విన్న స్పెషల్ జడ్జి కావేరి బవేజా తీర్పు రిజర్వ్ చేశారు. కేజ్రీవాల్ వాదనలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఆదేశించారు. సాయంత్రం 4గంటల తర్వాత ఇచ్చిన ఉత్తర్వుల్లో కేజ్రీవాల్‌కు ఏప్రిల్1వరకు ఈడీ కస్టడీకి ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆరోజు ఉదయం 11 గంటలకు తన ముందు హాజరుపరచాలని ఆదేశించారు.

కేజ్రీవాల్ సహకరించడం లేదు

కేజ్రీవాల్ కన్నా ముందు ఈడీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు, సీనియర్ న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు వినిపించారు. ఎస్వీ రాజు వాదనలు కొనసాగిస్తూ ఈడీ విచారణకు కేజ్రీవాల్ సహకరించడంలేదని ఆరోపించారు. ఈ కేసులో గోవాకు చెందిన పలువురికి ఈడీ సమన్లు జారీ చేసిందని చెప్పారు. ఆ వ్యక్తులతో కలిపి కేజ్రీవాల్‌ను విచారించాల్సి ఉందన్నారు. పంజాబ్‌కు చెందిన పలువురు సీనియర్ ఎక్సైజ్ అధికారులకు ఈడీ సమన్లు జారీ చేసిందని చెప్పారు. కేజ్రీవాల్‌ను 5 రోజులు విచారించి ఆయన చెప్పినవి రికార్డు చేశామని ప్రకటించారు. కేజ్రీవాల్ తప్పించుకునే సమాధానాలు చెబుతున్నారని కోర్టుకు నివేదించారు. కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగానే దర్యాప్తునకు సహకరించడంలేదని, ఆదాయ పన్ను రిటర్న్‌ల వివరాలను ఇవ్వడం లేదని చెప్పారు. డిజిటల్ పరికరాల పాస్‌వర్డ్‌లను సైతం కేజ్రీవాల్ వెల్లడించడంలేదన్నారు.

జైలు నుంచే కేజ్రీవాల్ పాలన

కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడాన్ని అడ్డుకోలేమని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా కొనసాగడానికి ఎలాంటి చట్టపర అడ్డంకులు లేవని తేల్చిచెప్పింది. మద్యం విధానం కేసులో కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసినందున, ఆయనను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. గురువారం ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగడం వల్ల న్యాయ ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని పిటిషనర్ వాదించగా ధర్మాసనం తోసిపుచ్చింది. పరిపాలన పరమైన అంశాల్లో తాము జోక్యం చేసుకోలేమని, పరిపాలన విభాగం, రాష్ట్రపతి పరిశీలించాలని స్పష్టం చేసింది. "ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ పరిశీలిస్తున్నట్లు ప్రసార మాధ్యమాల్లో చూశాం. ఇది రాష్ట్రపతి ముందుకు వెళ్లాల్సిన అంశం" అని తేల్చిచెప్పింది. ఈ పరిస్థితి గతంలో ఎప్పుడూ ఎదురు కాలేదని, తాము రాజకీయాల్లోకి పోదలచుకోలేదని ప్రకటించింది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	41.7	17.9
ఆదిలాబాద్	40.8	25.5
నల్లగొండ	39.5	24.2
మహబూబ్‌నగర్	39.2	25.0
ఖమ్మం	39.0	26.0
హైదరాబాద్	39.2	24.6

కేజ్రీవాల్ అరెస్టుపై మళ్లీ స్పందించిన అమెరికా

» తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్

న్యూఢిల్లీ, మార్చి 28: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా మరోసారి స్పందించింది. ఈసారి కేజ్రీవాల్ అరెస్టుతోపాటు కాంగ్రెస్‌పార్టీ బ్యాంకు ఖాతాల స్తంభన అంశాన్నీ ప్రస్తావించింది. వీటికి సంబంధించి నిష్పాక్షిక, పారదర్శక, నిర్దీత గడువుతో కూడిన న్యాయప్రక్రియ కొనసాగుతుందని ఆశిస్తున్నామని పేర్కొంది. అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ బుధవారం ఈ వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్ అరెస్టు అంశాన్ని పరిశీలిస్తున్నామని, ఆయన పట్ల నిష్పాక్షిక విచారణ జరగాలని కోరుకుంటున్నామని అమెరికా ఇటీవల వ్యాఖ్యానించటంపై కేంద్రప్రభుత్వం బుధవారం ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయ ఉప అధిపతిని పిలిచి తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. అయినా అమెరికా కేజ్రీవాల్ అరెస్టుపై తన వైఖరిని పునరుద్ఘాటించటం గమనార్హం. అమెరికా వ్యాఖ్యలపై స్పందిస్తూ... 'భారత ఎన్నికల, న్యాయ ప్రక్రియలపై ఏ విదేశీ శక్తుల ప్రభావాన్ని ఆమోదించేది లేదు. భారత్‌లో న్యాయ ప్రక్రియలు చట్టబద్ధపాలనకు అనుగుణంగా పని చేస్తాయి. ఇతరుల సార్వభౌమాధికారం, అంతర్గత వ్యవహారాలపట్ల దేశాలు గౌరవ భావంతో ఉండాలి' అని విదేశాంగశాఖ పేర్కొంది.

శివసేనలో చేరిన బాలీవుడ్ నటుడు గోవింద

ముంబై, మార్చి 28: బాలీవుడ్ సీనియర్ నటుడు గోవింద.. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన పార్టీలో చేరారు. గురువారం సీఎం షిండేను కలిసిన అనంతరం బాలాసాహెబ్ భవన్‌లో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. వాయవ్య ముంబై పార్లమెంట్ స్థానం నుంచి శివసేన తరఫున గోవింద పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. 2004లో కాంగ్రెస్‌లో చేరిన గోవింద ముంబై నార్త్ స్థానం నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత 2009లో ఆయన కాంగ్రెస్ పార్టీని వీడి రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

బీజేపీలోకి సావిత్రి జిందాల్

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యంత సంపన్నురాలైన హరియాణా మాజీ మంత్రి సావిత్రి జిందాల్ బీజేపీలో చేరారు. గురువారం హిస్సార్‌లో జరిగిన కార్యక్రమంలో హరియాణా సీఎం నయాబ్ సింగ్ సైనీ, మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ సమక్షంలో ఆమె బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం రాత్రి కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ఆమె ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఆమె కుమారుడు, పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ ఆదివారం బీజేపీలో చేరారు. ఆయనను కురుక్షేత్ర స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది.


ఈడీ సమన్లను నిరాకరించిన మాజీ ఎంపీ మహువా

కోల్‌కతా, మార్చి 28: లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు బహుమతులు తీసుకున్నారన్న కేసులో విచారణ నిమిత్తం హాజరుకావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇచ్చిన సమన్లను తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ ఎంపీ మహువా మొయిత్రా నిరాకరించారు. కృష్ణనగర్ లోక్‌సభ స్థానం నుంచి మళ్లీ లోక్‌సభకు పోటీ చేస్తున్న ఆమె గురువారం యథావిధిగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సమన్లు పంపించడం ఈడీ విధి..ప్రచారం చేయడం తన డ్యూటీ అంటూ ఆమె ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

న్యాయ వ్యవస్థపై రాజకీయ కుట్ర

కోర్టులపై విశ్వాసాన్ని తగ్గించేలా అసత్య ప్రచారం.. న్యాయస్థానాల ప్రతిష్ఠకు భంగం కలిగే ప్రమాదం

» సీజేఐకు 600 మంది సుప్రీంకోర్టు న్యాయవాదుల లేఖ



న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థపై రాజకీయ కుట్ర జరుగుతున్నదని పలువురు న్యాయవాదులు ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లతో న్యాయ వ్యవస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు సుమారు 600 మంది న్యాయవాదులు లేఖ రాశారు. ఈనెల 26వ తేదీన రాసిన లేఖ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజకీయ లక్ష్యాలతో కొన్ని ప్రత్యేక బృందాలు న్యాయ వ్యవస్థపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆ లేఖలో ఆరోపించారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేకించి రాజకీయ నేతల ఆర్థిక సంబంధాలకు సంబంధించిన కేసుల్లో పరోక్షంగా ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. న్యాయస్థానాలు, న్యాయమూర్తుల గురించి తప్పుడు సంకేతాలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కోర్టులపై ప్రజల్లో విశ్వాసాన్ని తగ్గించేందుకు న్యాయస్థానాల కీలక తీర్పులపై తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. "రాజకీయ ప్రముఖులు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి చెందిన కేసుల్లో నిందితులు న్యాయవ్యవస్థ స్వతంత్రతకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థతో పాటు న్యాయ వ్యవస్థపై కూడా ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. రాజకీయ నేతలు కొందరిపై అవినీతి ఆరోపణలు చేస్తారు. ఆ తర్వాత మళ్లీ వారే కోర్టుల్లో వాటిని సమర్థించుకుంటారు. కోర్టు నిర్ణయాలు తమకు అనుకూలంగా రాకపోతే వెంటనే బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేస్తూ న్యాయమూర్తులపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. న్యాయ వ్యవస్థ పనితీరును కించపరిచేలా స్వర్ణయుగం, బెంచ్ ఫిక్సింగ్ వంటి పదాలను కొందరు వ్యంగ్యంగా వినియోగిస్తున్నారు. న్యాయస్థానాలను అగౌరవ పరిచే ఇలాంటి పదజాలాన్ని ప్రయోగించే వారిని ఉపేక్షించకూడదు. వ్యక్తిగత, రాజకీయ కారణాలతో కోర్టు ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేస్తున్న ఇలాంటి ప్రయత్నాలను తిప్పికొట్టాలి. దీనిపై మౌనంగా ఉంటే న్యాయవ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. దీనినే అలుసుగా తీసుకుని వారు మరింత పెట్రేగిపోయే అవకాశముంది. ప్రత్యేకించి ఎన్నికల సమయంలోనే ఇలాంటివి ఉత్పన్నం అవుతున్నాయి. 2018-19 ఎన్నికల సమయంలోనూ ఇలాగే జరిగింది. మళ్లీ ఇప్పుడు అదే ప్రయత్నం జరుగుతోంది. వీటిని ఉపేక్షించడం మంచిది కాదు. అందుకే.. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరుతున్నాం" అని లేఖలో పేర్కొన్నారు. లేఖపై సంతకం చేసిన వారిలో హరీశ్ సాల్వే, మనన్ కుమార్ మిశ్రా, అదిష్ అగర్వాల, చేతన్ మిట్టల్, పింకీ ఆనంద్ తదితరులు ఉన్నారు.

ఇది పాతకాలపు కాంగ్రెస్ సంస్కృతి: మోదీ

సీజేఐకి న్యాయవాదుల లేఖపై ప్రధాని మోదీ స్పందించారు. ఇతరులను బుజ్జగించడం, వేధించడం పాత కాలపు కాంగ్రెస్ సంస్కృతి అని ఎక్స్ వేదికగా మోదీ ఆరోపించారు. ఐదు దశాబ్దాల క్రితమే కమిటెడ్ జ్యుడీషియరీ కోసం కాంగ్రెస్ పిలుపునిచ్చిందన్నారు. కాంగ్రెస్ వాళ్లు స్వార్థ ప్రయోజనాల కోసం దేనికైనా సిద్ధంగా ఉంటారన్నారు. ఇతరుల నుంచి నిబద్ధతను సిగ్గు లేకుండా కోరతారని, దేశం పట్ల నిబద్ధతకు మాత్రం దూరంగా ఉంటారని పేర్కొన్నారు. 140 కోట్ల మంది భారతీయులు వారిని తిరస్కరించడంలో ఆశ్చర్యమేమీ లేదని మోదీ వ్యాఖ్యానించారు.

మోదీ వ్యాఖ్యలు కపటత్వానికి పరాకాష్ఠ: ఖర్గే

ప్రధాని మోదీ వ్యాఖ్యలు కపటత్వానికి పరాకాష్ఠ అని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. ప్రజాస్వామ్యాన్ని ఏమార్చారని ఆరోపించింది. ప్రధాని దేశంలోని ప్రతీ వ్యవస్థ పైనా బలప్రయోగానికి పాల్పడ్డారని, రాజ్యాంగాన్ని దెబ్బ తీశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. నలుగురు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ప్రజాస్వామ్యం నాశనం అవుతోందని వ్యాఖ్యానించిన విషయం ప్రధాని గుర్తు చేసుకోవాలన్నారు. అది మోదీ ప్రధానిగా ఉన్నపుడే జరిగిందని చెప్పారు. అందులో ఒక న్యాయమూర్తి రాజ్యసభకు నామినేట్ అయ్యారని ప్రస్తావించారు.

'ఉపాధి' వేతనం పెంపు

» కూలీ రేట్లు సవరించిన కేంద్రం

» తెలుగు రాష్ట్రాల్లో 10% పెరుగుదల

న్యూఢిల్లీ, మార్చి 28: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీ రేట్లను సవరించారు. దీంతో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు వివిధ రాష్ట్రాలలో 4% నుంచి 10% వరకు కూలీ రేట్లు పెరగనున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి పొంది.. సవరించిన కూలీ రేట్లను ఈనెల 27వ తేదీన నోటిఫై చేసింది. ఆ నోటిఫికేషన్ ప్రకారం నైపుణ్యం లేని కార్మికులకు అత్యధికంగా హరియాణాలో రోజుకు రూ.374, అత్యల్పంగా అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాలలో రూ.234 చెల్లించనున్నారు. ఈ పథకం కింద కూలీలకు ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల పని కల్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కూలీ రేటు రూ.28 పెరిగి రూ.300కు చేరింది. నోటిఫికేషన్‌లోని వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, గోవాలలో సుమారు 10% వరకు కూలీ రేటును పెంచారు.



కనీసం రూ.400 అయినా చేయలేదు: కాంగ్రెస్..

ఉపాధి కూలీల వేతనాలను రూ.400 చేస్తామని 'శ్రామిక న్యాయ్' గ్యారెంటీలో తామ హామీ ఇచ్చామని, మోదీ ప్రభుత్వం కనీసం అంతకైనా పెంచలేదని కాంగ్రెస్ విమర్శించింది. 'ఉపాధి కూలీలకు శుభాకాంక్షలు. ప్రధానమంత్రి మీ వేతనాన్ని 7 రూపాయలు పెంచారు. అంత పెద్ద మొత్తంతో మీరు ఏం చేస్తారని బహుశా ఆయన మిమ్మల్ని అడగొచ్చు. మీ పేరుతో థాంక్యూ మోదీ ప్రచార కార్యక్రమాన్ని రూ.700 కోట్ల వ్యయంతో ప్రారంభించే అవకాశం కూడా ఉంది' అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే కార్మికులకు కనీస వేతనాన్ని రూ.400కు పెంచుతుందని ఆయన పేర్కొన్నారు.

నెట్ స్కోర్‌తో పీహెచ్‌డీలో చేరొచ్చు

వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమల్లోకి: యూజీసీ

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇకపై విద్యార్థులు యూనివర్సిటీల వారీగా పీహెచ్‌డీ అడ్మిషన్ పరీక్షలకు హాజరవ్వకుండా జాతీయ అర్హత పరీక్ష (నెట్) స్కోర్‌తో ప్రవేశాలు పొందవచ్చని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గురువారం పేర్కొంది. ఈ ఏడాది జూన్ సెషన్‌లో నిర్వహించే యూజీసీ-నెట్ పరీక్షలో కొత్త కేటగిరీని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. వచ్చే విద్యా సంవత్సరం (2024-25) నుంచే ఈ విధానం అమల్లోకి వస్తుంది. గతంలో జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్)-అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి అర్హతకు మొదటి కేటగిరీ, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి అర్హతకు రెండో కేటగిరీలో నెట్ పరీక్షలు నిర్వహించేవారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియామకానికి నెట్ అర్హత జీవితకాలం చెల్లుబాటయ్యేది. తాజాగా పీహెచ్‌డీలో ప్రవేశాలకు అర్హతను చేర్చారు. దీంతో మొదటి కేటగిరీ కేవలం జేఆర్ఎఫ్ లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హతకే పరిమితమౌతుంది. రెండో కేటగిరీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి, పీహెచ్‌డీలో ప్రవేశానికి అర్హతగా ఉంటుంది. కేవలం పీహెచ్‌డీ అర్హత కోసం మూడో కేటగిరీని పరిచయం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి అర్హతలో మొదటి రెండు కేటగిరీలు జీవితకాలం చెల్లుబాటులో ఉంటాయి. పీహెచ్‌డీలో చేరేందుకు ఏడాది కాలపరిమితి ఉంటుంది. "వేర్వేరు వర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు విద్యార్థులు ఆయా విశ్వవిద్యాలయాలు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు హాజరుకావాల్సి వచ్చేది. నెట్‌ను ప్రామాణికంగా తీసుకోవడం వల్ల ఆ ఇబ్బందులుండవు. ఏడాదిలో రెండుసార్లు నెట్ నిర్వహణ ఉంటుంది"అని యూజీసీ ఛైర్మన్ జగదీశ్‌కుమార్ తెలిపారు. తమ విశ్వవిద్యాలయంలో నెట్, జేఆర్ఎఫ్, తెలంగాణసెట్‌ను పీహెచ్‌డీ ప్రవేశాల్లో అర్హతగా పరిగణిస్తున్నామని, ఇవి లేనివారికి ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ వడ్డాణం శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ज्ञान-विज्ञान विमुक्तये
UGC - NET

హైకోర్టు జడ్జిగా మౌసమీ భట్టాచార్య ప్రమాణం

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మౌసమీ భట్టాచార్య గురువారం ప్రమాణస్వీకారం చేశారు. మొదటి కోర్టు హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ఆమెతో ప్రమాణస్వీకారం చేయించారు. అంతకుముందు రాష్ట్రపతి కార్యాలయం నుంచి వెలువడిన బదిలీ ఉత్తర్వులను, గవర్నర్ తరఫున చీఫ్ జస్టిస్ ప్రమాణస్వీకారం చేయించేందుకు వీలుగా జారీఅయిన జీవోను రిజిస్ట్రార్ జనరల్ చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. జస్టిస్ మౌసమీ భట్టాచార్య కలకత్తా హైకోర్టు నుంచి తెలంగాణ హైకోర్టుకు బదిలీపై వచ్చారు.

కాంగ్రెస్ పెట్టిన కేసు కొట్టివేయండి

- హైకోర్టులో 'నమస్తే తెలంగాణ' సీఎండీ దామోదర్‌రావు, ఎడిటర్ కృష్ణమూర్తి పిటిషన్

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ 'నమస్తే తెలంగాణ' పత్రిక చైర్మన్ కం మేనేజింగ్ డైరెక్టర్ డి.దామోదర్‌రావు, ఎడిటర్ టి.కృష్ణమూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 9న వీరిపై 505 (1)బీ, సీ, 505(2) రెడ్ విత్ 109 సెక్షన్‌ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగే విధంగా నిందితులు తమ పత్రికలో తప్పుడు కథనాలు రాశారని ఆరోపిస్తూ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ఫిర్యాదు చేశారు. అయితే, తమపై నమోదైన ఈ కేసును కొట్టేయాలని నమస్తే తెలంగాణ సీఎండీ, ఎడిటర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం వద్ద విచారణకు వచ్చింది. ఇందులో కొంతమంది తనకు తెలిసిన వాళ్లు ఉండటం వల్ల తాను ఈ కేసును విచారించలేనని, వేరే ధర్మాసనం ఎదుట కేసును లిస్ట్ చేసేందుకు వీలుగా చీఫ్ జస్టిస్ వద్ద ఈ కేసును ఉంచాలని రిజిస్ట్రీని జస్టిస్ లక్ష్మణ్ ఆదేశించారు.

సరిపడా విత్తనాలు సరఫరా చేయాలి:తుమ్మల

రాష్ట్రంలో రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాలు సరఫరా చేయాలని, ఇక్కడ సరిపోయిన తర్వాతే ఇతర రాష్ట్రాలకు విత్తనాలను ఎగుమతి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రైవేటు విత్తన కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండో ప్రధాన పంటగా పత్తి సాగవుతోందని, 121.06 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమవుతాయని, అందుకు తగ్గట్లు విత్తనాలు ఉత్పత్తి చేయాలని ప్రైవేటు విత్తన కంపెనీలకు ఆయన సూచించారు. అలాగే 16.50 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు, 48 వేల క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసినట్లు మంత్రి వెల్లడించారు. నాణ్యమైన విత్తనాల సరఫరా చేసేందుకు విత్తన కంపెనీలు సూచించిన ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామన్నారు.



తెలుగు వర్సిటీలో ప్రతిభాపురస్కారాల ప్రదానం

- నా హయాంలో జరగడం అదృష్టం: వీసీ టి. కిషన్‌రావు

రవీంద్రభారతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ఎందరో ప్రముఖులకు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా వివిధ పురస్కారాలను తన హయాంలో ప్రదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని వర్సిటీ వీసీ ఆచార్య టి.కిషన్ రావు అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో వివిధ రంగాల్లో కృషి చేసిన 12 మంది ప్రముఖులకు 2023 ఏడాదికి గాను ప్రతిభా పురస్కారాల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు చిత్ర నిర్మాత, దర్శకుడు, నటుడు బి. నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరై పురస్కారగ్రహీతలను అభినందించారు. సన్మానితులకు 20,116 నగదు, శాలువాతో సత్కరించారు.

పురస్కారగ్రహీతలు

వైద్యం వెంకటేశ్వరాచార్యులు (కవిత్వం), డా.డి. రాజారెడ్డి (పరిశోధన), అన్నవరం శ్రీనివాస్ (చిత్రలేఖనం), టి.గంగాధర్ (శిల్పం), డా.పసుమర్తి రామలింగశాస్త్రి (నృత్యం), డా.పప్పు వేణుగోపాలరావు (సంగీతం), ఆర్.దిలీప్ రెడ్డి (పత్రికా రంగం), బిహెచ్.కళ్యాణి (నాటకం), కొంకుల్ల ఎల్లయ్య (జానపద కళారంగం), డా.గంద్ర లక్ష్మణరావు (అవధానం), ఆచార్య కొలకలూరిమధుజ్యోతి (ఉత్తమ రచయిత్రి), దేవులపల్లి కృష్ణమూర్తి (నవల, కథ)లకు పురస్కారాలు ప్రదానం చేశారు.

రైతుల పేరిట స్టార్టప్ కంపెనీ మోసం

- రూ.కోట్ల రుణం తీసుకొని బోర్డు తిప్పేసిన వైనం
- 'ల్యాబ్ టు ల్యాండ్ అగ్రిటెక్ సొల్యూషన్స్'పై కేసు

రాయదుర్గం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతుల పేరిట కోట్లాది రూపాయల రుణాలు తీసుకుని బోర్డు తిప్పేసిన ఓ స్టార్టప్ కంపెనీపై రాయదుర్గం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదయ్యింది. రాయదుర్గం ఐటీ జోన్‌లోని టీ హబ్‌లో 'ల్యాబ్ టు ల్యాండ్ అగ్రిటెక్ సొల్యూషన్స్' అనే స్టార్టప్ సంస్థ.. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు సరఫరా చేస్తామని చెప్పి రెండు తెలుగురాష్ట్రాల్లో జిల్లాల వారీగా డీలర్లను నియమించుకుంది. వారి ద్వారా కొంతకాలంగా పురుగుమందులను రైతులకు అందజేస్తున్నది. రైతులను సభ్యులుగా చేర్చుకునే సమయంలో వారి కేవైసీ, ఆధార్ వంటి పత్రాలను ఈ కంపెనీ సేకరించింది. ఈ పత్రాల ఆధారంగా రైతుల పేరిట ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.కోట్ల లోన్ తీసుకుంది. ఈ క్రమంలో, తీసుకున్న లోన్లకు వాయిదాలు కట్టలేదంటూ పలువురు రైతులకు ఆ ఫైనాన్స్ కంపెనీ నోటీసులు పంపించింది. దీంతో ఆయా రైతులు స్థానికంగా ఉన్న డీలర్ల వద్దకెళ్లి నిలదీశారు. దీంతో పలు జిల్లాలకు చెందిన డీలర్లు విషయం తెలుసుకునేందుకు గురువారం టీహబ్‌లోని సంస్థ కార్యాలయానికి వచ్చారు. కార్యాలయం మూసి ఉండటంతో.. సంస్థ సీఈఓ ఆదిత్య దేశ్‌పాండే, కో ఫౌండర్ ఆదిత్య కేఎల్‌పై చర్యలు తీసుకోవాలని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులూ పబ్లిక్ సర్వెంట్లే!

- అవినీతి నిరోధక చట్టం కింద విచారించొచ్చు
- గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు కేసులో హైకోర్టు తీర్పు
- రమేశ్ గెల్లిపై విచారణకు సీబీఐకి అనుమతి

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ) గెల్లి రమేశ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుబ్రశ్రీ శ్రీధర్‌లను ప్రాసిక్యూట్ చేయడానికి హైకోర్టు సీబీఐకి అనుమతి మంజూరు చేసింది. ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులైనప్పటికీ వీరిని అవినీతి నిరోధక చట్టం కింద విచారించవచ్చని పేర్కొంది. వీరు ప్రభుత్వ ఉద్యోగులు కానందున అవినీతి నిరోధక చట్టం కింద విచారించలేమని పేర్కొంటూ 2010లో సీబీఐ కేసుల ప్రత్యేక న్యాయస్థానం కేసు నుంచి డిశ్చార్జి చేసింది. సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును తాజాగా కొట్టేసిన జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ధర్మాసనం .. ప్రైవేటు బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగులే అయినప్పటికీ వారు పబ్లిక్ సర్వెంట్ల కిందకే వస్తారని.. ఈ నేపథ్యంలో వారిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసులు పెట్టవచ్చని స్పష్టం చేసింది. బ్యాంకుల నియంత్రణ చట్టంలోని సెక్షన్ 46ఏ ప్రకారం ప్రైవేట్ బ్యాంకు ఎండీ, ఈడీలు రిజర్వు బ్యాంకు జారీ చేసిన లైసెన్స్ ప్రకారం పని చేయాల్సి ఉంటుంది కాబట్టి వారు పబ్లిక్ సర్వెంట్ల కిందికే వస్తారని స్పష్టం చేసింది. రమేశ్, శ్రీధర్ ఇతరులతో కలిసి కుట్రపూరితంగా బ్యాంకును మోసం చేయడం వల్ల రూ.10.25 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు 2005లో సీబీఐ కేసు నమోదు చేసింది. 2008లో అభియోగపత్రం దాఖలు చేయగా.. 2010లో నిందితులకు అవినీతి నిరోధక చట్టం వర్తించదని సీబీఐ కోర్టు పేర్కొంది. దీంతో సీబీఐ హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు తాజా తీర్పు ఇచ్చింది.

అన్నదాతలూ.. ఆత్మహత్యలు వద్దు

సర్కారు మెడలు వంచి పరిహారం తెచ్చుకుందాం.. రుణమాఫీ, బోనస్‌ను సాధించుకుందాం

రైతులను పరామర్శించే తీరిక ముఖ్యమంత్రి రేవంత్‌కు లేదు: కేటీఆర్

సిరిసిల్ల , మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాతలు ధైర్యంగా ఉండండి. ఆత్మహత్యలతో కుటుంబాలను ఇబ్బందుల పాలు చేయవద్దు. ధైర్యంగా ముందుకు వెళ్దాం. ప్రభుత్వంతో కొట్లాడుదాం. సర్కారు మెడలు వంచైనా బోనస్ తెచ్చుకుందాం. రుణమాఫీ, నష్టపరిహారం సాధించుకుందాం. మేడిగడ్డను రిపేరు చేసుకొని కాళేశ్వరం నీళ్లు మనకు వచ్చేటట్లు చేసుకుందాం. ఆత్మహత్యలు వంటి తీవ్రమైన చర్యలకు పాల్పడవద్దు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో ఎండిపోయిన పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి జరుగుతుందని ఆశించి రైతులు కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించుకుంటే.. ప్రస్తుత ముఖ్యమంత్రి, మంత్రులకు రైతులను పరామర్శించే తీరికే లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మి రైతులు, ప్రజలు మోసపోయారని అన్నారు. రైతులెవరూ అధైర్య పడొద్దని, తాము అండగా ఉంటామని అన్నారు. "డిసెంబరు 9న అధికారంలోకి వస్తున్నాం.. రుణాలు తీసుకోని వారు కూడా తీసుకోండి.. వెంటనే రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. కానీ, ఇప్పుడు రుణమాఫీ చేయకపోగా బ్యాంకుల ద్వారా రైతులకు లీగల్ నోటీసులు ఇచ్చి రుణాలకు కడతారా? చస్తారా? అనే విధంగా వ్యవహరిస్తున్నారు" అని మండిపడ్డారు. గత ఏడాది ఎండాకాలంలో మేడిగడ్డ నుంచి నీళ్ల ఎత్తిపోసి జిల్లాల్లోని చెరువులను నింపామని గుర్తు చేశారు. మేడిగడ్డ వద్ద మూడు పిల్లర్లు కుంగి మూడు, నాలుగు నెలలు అవుతున్నా.. రిపేరు చేయడానికి కాంగ్రెస్ సర్కార్‌కు టైమ్ సరిపోవడం లేదని దుయ్యబట్టారు. కేసీఆర్‌పై కడుపు మంటతో మేడిగడ్డకు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తీసుకొచ్చిన కరువని అన్నారు. ఇప్పటికే దాదాపు 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. రైతులపై ప్రేమ ఉంటే ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. మిగిలిన పంటనైనా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు రూ.2లక్షల మేర రుణమాఫీ, రైతు భరోసా కింద రూ.15వేలు ఇవ్వాలని, ఇందుకోసం అవసరమైతే ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని సూచించారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న కేటీఆర్

బీఆర్‌ఎస్‌కు బై బై

(మొదటిపేజీ తరువాయి)

కుదిరినట్లు సమాచారం. కడియం శ్రీహరితో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్‌ను వీడే ఎమ్మెల్యేల సంఖ్య భారీగానే ఉంటుందని, పలువురు ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతుండటం గమనార్హం. రెండు మూడు రోజుల్లోనే పలువురు ఎమ్మెల్యేలు బహిరంగంగా కాంగ్రెస్‌లో చేరేందుకు ముందుకు వస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అప్పుడు రంజిత్ రెడ్డి.. ఇప్పుడు కావ్య

పార్టీ కోరి కోరి టికెట్ ఇచ్చిన అభ్యర్థులు ఒక్కొక్కరుగా బీఆర్ఎస్‌ను వీడుతుండటం గమనార్హం. చేవెళ్ల స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డికే టికెట్ ఇస్తే, ఆయన కారు దిగి కాంగ్రెస్‌లో చేరారు. చేవెళ్ల నుంచే కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచారు. తాజాగా కావ్య కూడా అదే బాట పట్టడం గులాబీ పార్టీ శ్రేణులను కలవరపరుస్తోంది. అయితే బీఆర్ఎస్ నుంచి టికెట్ పొందిన అభ్యర్థుల్లో ఇంకొందరు కూడా కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు సమాచారం.

గందరగోళ పరిస్థితులతోనే..

వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో బీఆర్ఎస్‌లో నెలకొన్న గందరగోళ పరిస్థితులే కావ్య పోటీ నుంచి వైదొలగడానికి, పార్టీకి రాజీనామా చేయడానికి దారితీశాయని భావిస్తున్నారు. వరంగల్ టికెట్‌ను తొలుత అప్పటి బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆశించారు. అప్పటికే తన కుమార్తె కావ్యను రాజకీయాల్లోకి తీసుకరావాలనే ఆలోచనలో ఉన్న కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ టికెట్ తనకే ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారు. ఈ పరిణామాలను గుర్తించిన అరూరి రమేశ్.. తనకు టికెట్ రాదని భావించి బీజేపీ వైపు మొగ్గు చూపారు. తర్వాత నాటకీయ పరిణామాల మధ్య ఆరూరికే టికెట్ ఇస్తామని కేసీఆర్ ఆఫర్ ఇచ్చారు. అయితే తనకు టికెట్ ఇచ్చినా పార్టీలో ఎవరూ సహకరించరంటూ రమేశ్, కేసీఆర్ ఆఫర్‌ను తిరస్కరించారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నేతల సమక్షంలోనే ఈ నెల 13న కడియం కావ్యను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించారు. తర్వాత ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలను కావ్య కలుస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు కావ్యకు టికెట్ ఖరారు కావటంతో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ ఈ నెల 16వ తేదీన తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఆ మరుసటి రోజైన 17వ తేదీన వరంగల్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కీలక నేతలు పార్టీ వీడటం, కార్యకర్తల్లో గందరగోళం నెలకొడమే కావ్య రాజీనామా నిర్ణయానికి దారితీసినట్లు చెబుతున్నారు.

కేసీఆర్‌కు కావ్య రాజీనామా లేఖ (యథాతథంగా..)

శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుగారికి..

లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు. గత కొన్ని రోజులుగా పార్టీ నాయకత్వంపై మీడియాలో వస్తున్న అవినీతి, భూ కబ్జాలు, ఫోన్ ట్యాపింగ్ లాంటి వ్యవహారాలు, లిక్కర్ స్కాం లాంటి విషయాలు పార్టీ ప్రతిష్ఠను దిగజార్చాయి. జిల్లాల్లోని నాయకుల మధ్య సమన్వయం సహకారం లేకపోవడం.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరించడం పార్టీకి మరింత నష్టం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో నేను పోటీ నుంచి విరమించుకోవాలని నిర్ణయించుకున్నాను గౌరవనీయులైన కేసీఆర్ గారు, పార్టీ నాయకత్వం, బీఆర్ఎస్ కార్యకర్తలు నన్ను మన్నించ వలసిందిగా కోరుతున్నాను.

కేటీఆర్‌పై జీరో ఎఫ్ఐఆర్

- సీఎం రేవంత్‌పై అవినీతి ఆరోపణలే కారణం

హనుమకొండ టౌన్, మార్చి28: సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌పై హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. కాంట్రాక్టర్లు, బిల్డర్ల నుంచి రేవంత్ రూ.2,500కోట్లు వసూలు చేసి, ఢిల్లీకి పంపించారంటూ కేటీఆర్ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని.. ఆయనపై చర్యలు తీసుకోవాలని పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు గురువారం హనుమకొండ సీఐ సతీశ్‌కు ఫిర్యాదు చేశారు. సీఎంపై వ్యక్తిగత దూషణలు చేస్తూ.. ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. హనుమకొండ పోలీసులు న్యాయ నిపుణుల సలహా తీసుకున్న తర్వాత.. కేటీఆర్‌పై ఐపీసీలోని 504, 505 సెక్షన్ల కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీసులకు బదిలీ చేశారు.

నేడు టీపీసీసీ భేటీ

- హాజరుకానున్న సీఎం, డిప్యూటీ సీఎం

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వంద రోజుల్లో హామీల అమలు, సాధించిన విజయాలపై రూపొందించిన నివేదిక, తుక్కుగూడ సభ, లోక్‌సభ ఎన్నికల కార్యాచరణపై శుక్రవారం టీపీసీసీ కార్యవర్గ సమావేశం జరగనుంది. గాంధీభవన్‌లో జరిగే ఈ భేటీలో ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శులు తదితరులు పాల్గొంటారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనపై ఒక నివేదికను ప్రవేశపెడతారని సమాచారం. వంద రోజుల పాలన ఆధారంగానే లోకసభ ఎన్నికలకు వెళ్దామంటున్న కాంగ్రెస్.. దీనిపై ఒక నివేదికను రూపొందించినట్లు తెలిసింది. ఏప్రిల్ 6న తుక్కుగూడలో ఏర్పాటు చేయనున్న బహిరంగసభను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపైనా సమావేశంలో చర్చించనున్నారు. అలాగే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చిస్తారని తెలిసింది. అంతకుముందుగా మధ్యాహ్నం 3 గంటలకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ అధ్యక్షతన టీపీసీసీ ప్రచార కమిటీ సమావేశం జరగనుంది. సమావేశంలో దీపాదాస్ మున్షీ, ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు. కాగా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు చైర్మన్‌గా మేనిఫెస్టో కమిటీని టీపీసీసీ చీఫ్ రేవంత్ ఏర్పాటు చేశారు. దీనికి కన్వీనర్‌గా సీనియర్ నేత అల్దాస్ జానయ్య, సభ్యులుగా ఎ.శ్యామ్‌మోహన్, బి.కమలాకర్‌రావు, బీఎం వినోద్‌కుమార్, మహ్మద్ రియాజ్, జనక్‌ప్రసాద్‌లను నియమించినట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ మేనిఫెస్టో అంశాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మేనిఫెస్టోను ఎలా చేరవేయాలన్న దానిపై పార్టీకి 15 రోజుల్లో నివేదిక ఇవ్వనుంది.

దానం అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ పునరాలోచన..?

- ఆయన రాజీనామా విషయంలో అభిప్రాయ భేదాలు

సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ పునరాలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌కు సికిందరాబాద్ ఎంపీగా పోటీ చేసే అవకాశాన్ని పార్టీ కల్పించింది. అయితే ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన.. ఆ పదవికి రాజీనామా చేశాకే ఎంపీగా పోటీ చేయాలంటూ కాంగ్రెస్‌లో కొందరు నేతలు గళమెత్తారు. దానం ఎమ్మెల్యేగా రాజీనామా చేసి.. ఎంపీగా బరిలో దిగితేనే విజయవకాశాలు మెరుగ్గా ఉంటాయని కాంగ్రెస్ భావిస్తోంది. అయితే దానం మాత్రం ముందుగా రాజీనామా చేసేందుకు ససేమిరా అంటునట్లు సమాచారం. అదే జరిగితే ఆ స్థానం నుంచి మరొకరిని అభ్యర్థిగా పరిశీలించే అవకాశాలున్నాయి. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌తోపాటు ఇతర నేతల పేర్లను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎంపీ టికెట్ల కేటాయింపులో మాకు అన్యాయం

- ఏఐసీసీ కార్యాలయం వద్ద తెలంగాణ కాంగ్రెస్ మాదిగ నేతల ధర్నా
- పెద్దపల్లి అభ్యర్థిని మార్చాలంటూ డిమాండ్
- వరంగల్‌తో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ టికెట్లు ఇవ్వాలని పట్టు

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎంపీ టికెట్ల కేటాయింపులో తమ సామాజికవర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొంటూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మాదిగ నేతలు గురువారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం వద్ద భారీ నిరసన చేపట్టారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వుడు స్థానాలైన నాగర్‌కర్నూల్, పెద్దపల్లిలో మాదిగ జనాభా అధికంగా ఉన్నప్పటికీ మాల వర్గానికి చెందిన నేతలకు టికెట్లు కేటాయించారని, మరో స్థానమైన వరంగల్‌లో మాత్రమే మాదిగ అభ్యర్థిని దించాలని పార్టీ భావిస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మాలల జనాభా 18 లక్షలే ఉందని, మాదిగలు 80 లక్షలకుపైగా ఉన్నందున తమకు సీట్ల కేటాయింపు పరంగా న్యాయం చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని వారు డిమాండ్ చేశారు. పెద్దపల్లి అభ్యర్థిని మార్చి ఆ సీటును తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతానికి ఇవ్వాలని కోరారు. కంటోన్మెంట్ అసెంబ్లీ టికెట్‌ను తెలంగాణ ఉద్యమకారుడైన పిడమర్తి రవికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరంగల్‌ను మాదిగలకు కేటాయించాలన్నారు. శుక్రవారం మరోసారి పార్టీ ఆఫీస్ వద్ద 300 మందితో నిరసన చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంబేడ్కర్ సాధించిన రిజర్వేషన్ల వల్ల రాష్ట్రంలో రెండు మూడు కుటుంబాలే బాగుపడుతున్నాయని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. జనాభా దామాషాన అన్ని వర్గాల వారికి న్యాయం చేయాలని ఆయన కాంగ్రెస్ పార్టీకి విజ్ఞప్తి చేశారు.

రేపు కాంగ్రెస్‌లోకి కేకే

కుమార్తె గద్వాల విజయలక్ష్మితో కలిసి చేరిక.. పార్టీ మార్పుపై కేసీఆర్, కేకే మధ్య ఆసక్తికర చర్చ

- పార్టీలో మీకు ఏం తక్కువ చేశా?
- అవకాశవాద రాజకీయాలు తగవు
- మీ నిర్ణయాన్ని మార్చుకోండి: కేసీఆర్
- కాంగ్రెస్‌లోనే చచ్చే దాకా ఉంటా: కేకే



హైదరాబాద్/హైదరాబాద్‌సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, ఎంపీ కె.కేశవరావు(కేకే) ఆ పార్టీకి పెద్ద షాక్ ఇచ్చారు. కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి తగ్గట్టుగానే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు స్వయంగా ఆయనే ప్రకటించారు. తన కుమార్తె, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి హస్తం గూటికి చేరనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో శనివారం ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు ముహూర్తం కూడా ఖరారైంది. ఇదే సమయంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డితోపాటు జీహెచ్ఎంసీలోని కొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నారు. కాగా, కాంగ్రెస్‌లో చేరిక అంశంపై కేకే ప్రకటనకు ముందు పలు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో గురువారం మధ్యాహ్నం కేసీఆర్‌తో భేటీ అయిన కేకే.. పార్టీ మార్పుపై తన నిర్ణయాన్ని విస్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. దీనిపై కేసీఆర్ స్పందిస్తూ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. "మీకు, మీ కుటుంబానికి ఏం తక్కువ చేశా! బీఆర్ఎస్‌లో జనరల్ సెక్రటరీగా పోస్టిచ్చి నా తర్వాత మీకు అంత్యంత ప్రాధాన్యం కల్పించా. సీనియర్ నాయకుడిగా పార్టీ శ్రేణులు సైతం విమ్మల్ని గౌరవించాయి. మాతోపాటు పదేళ్లు అధికారం అనుభవించి ఇప్పుడు పార్టీ మారతానంటే ఎలా? రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తారు.. కాంగ్రెస్‌లో చేరాలన్న మీ నిర్ణయాన్ని మార్చుకోండి. కొద్ది రోజులుగా పార్టీ పరంగా.. బయట మీరు వ్యవహరిస్తున్న తీరు బాగోలేదు" అంటూ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ మేరకు కేకే స్పందిస్తూ తాను పార్టీ మారడం ఖాయమని, త్వరలోనే కాంగ్రెస్‌లో చేరుతానని కుండబద్దలు కొట్టినట్లు సమాచారం.

కాంగ్రెస్‌లోనే చచ్చిపోతా: కేకే

కేసీఆర్‌తో భేటీ తర్వాత హైదరాబాద్ చేరుకున్న కేకే మీడియాతో ఉద్వేగభరితంగా మాట్లాడారు. "సుదీర్ఘకాలం నేను కాంగ్రెస్‌లోనే పనిచేశా. 84ఏళ్ల వయసులో తిరిగి సొంత పార్టీకి వెళ్తున్నా. ఇక కాంగ్రెస్‌లోనే చచ్చిపోతా" అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ తనకు ఎంతో గౌరవం ఇచ్చారని, ఆయనంటే తనకూ గౌరవమేనన్నారు. తమ ఇద్దరి మధ్య పార్టీ అంతర్గత అంశాలపై చర్చ జరిగిందని, కవిత అరెస్టుపై కూడా చర్చించామని, ఆమెను అక్రమంగా అరెస్టు చేశారని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలు తనకు ఎంతో సహకరించారన్నారు. కాగా, బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని తన కుమారుడు విప్లవ్ నిర్ణయించుకోవడం మంచిదేనని, చివరి వరకూ తానూ కాంగ్రెస్‌లోనే ఉంటానని కేకే వెల్లడించారు. కాగా, తాను శనివారం కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు కేకే కుమార్తె, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రకటించారు. అధికార పార్టీలో ఉంటేనే సమస్యలు పరిష్కరించుకోగలుగుతామని ఆమె పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధి దృష్ట్యానే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వెల్లడించారు. కాగా, కేకేతో మాజీమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి గురువారం సాయంత్రం భేటీ అయ్యారు. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఇంద్రకరణ్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి 30న కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.


నేను బీఆర్ఎస్‌లోనే ఉంటా

"నాకు పార్టీ మారే ఆలోచన లేదు.. మానాన్న, సోదరి తీసుకునే నిర్ణయాలతో నాకు ఎటువంటి సంబంధం లేదు" అని కేకే కుమారుడు విప్లవ్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంపై ఎంతో నమ్మకం ఉందని, తమ కుటుంబ సభ్యులు కాంగ్రెస్‌లో చేరినట్లు ధ్రువీకరించుకున్న తర్వాతే.. అన్ని విషయాలపై మీడియాతో మాట్లాడతానని పేర్కొన్నారు.

మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తారా?

- అక్రమ అరెస్టులతో గొంతు నొక్కడమా?
- ఇందిరమ్మ పాలన అంటే ఇదేనా?
- చెంగిచర్ల బాధితులను పరామర్శిస్తే కేసులా?: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్/సిటీ/పీర్జాదిగూడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'ఇందిరమ్మ పాలన అంటే మతోన్మాదాన్ని ప్రోత్సహించడం.. అక్రమ అరెస్టులు, కేసులతో నోరు నొక్కడమా..?' అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. చెంగిచర్ల ఘటనలో బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, కార్యకర్తలను అడ్డుకోవడంతో పాటు అక్రమ కేసులు పెట్టడం.. ఎమ్మెల్యే రాజాసింగ్‌ను హౌస్ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. చెంగిచర్ల ఘటనలో దెబ్బలు తిన్నవారిపైనే కేసులు నమోదు చేయడం సబబు కాదని అన్నారు. అక్కడికి ఇతర పార్టీల నేతలు పోవచ్చు కానీ బీజేపీ నాయకులపై ఆంక్షలు విధించడం ఏంటని నిలదీశారు. "హోళీ పండుగ రోజు చెంగిచెర్లలో హిందువులపై దాడి జరిగింది. చాలా మంది మహిళలు, యువత గాయపడ్డారు. దాడి చేసిన వాళ్లను వదిలి.. ఆత్మరక్షణ కోసం అడ్డుకున్న వాళ్లపై హత్యాయత్నం కేసు పెడతారా..? చెంగిచర్ల ఏమైనా నిషేధిత ప్రాంతమా..? కబేళా నడుపుతున్న మాఫియాకు బారికేడ్లు పెట్టి మరీ వంతపాడటం ఎంతవరకు సమంజసం..?" అని కిషన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో నిలదీశారు. చెంగిచర్లలో అక్రమ కబేళాను తొలగించాలని.. బీజేపీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని, బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయాలని, బాధితులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.



బండి సంజయ్‌పై కేసు..

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై మేడిపల్లి ఠాణాలో కేసు నమోదైంది. హోలీ పండుగ సందర్భంగా చెంగిచర్ల పిట్టల బస్తీలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన బాధితులను పరామర్శించేందుకు మంగళవారం ర్యాలీగా వచ్చిన బండి సంజయ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘర్షణలో నాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. సీఐ నందీశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు బండి సంజయ్‌తో పాటు మరో 9 మందిపై కేసు నమోదైంది. కాగా, హోళీ పండగ రోజు చెంగిచర్లలో జరిగిన ఘటనలో పోలీసులు ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. దాడులు చేసిన వారిలో ఏడుగురిపై మాత్రమే కేసులు నమోదు చేసి విగతా వారిని వదిలేశారని మండిపడ్డారు. మరోవైపు బాధితులపై కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. బాధితులను పరామర్శించేందుకు బయలుదేరిన తనను హౌస్ అరెస్టు చేయడం సరికాదని అన్నారు.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి: లక్ష్మణ్

ఫోన్ ట్యాపింగ్ కేసులో సూత్రధారులెవరో తెలియాలంటే సీబీఐతో విచారణ జరిపించాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. తన ఫోన్ కూడా ట్యాప్ అయిందో లేదో తేల్చాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. "నేతలు చెబితేనే ట్యాపింగ్ చేశామని నిందితులు చెబుతున్నారు. ఒకరిద్దరి ఫోన్‌లు ట్యాప్ అయి ఉండొచ్చని కేటీఆర్ అంటున్నారు. మీ ప్రమేయం లేకుండా పోలీసులు ఫోన్‌లు ట్యాప్ చేశారా?" అని కేటీఆర్‌ను నిలదీశారు. ఎన్నికల వేళ ఆరు గ్యారెంటీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు సర్కారు ఫోన్ ట్యాపింగ్‌ను తెరపైకి తెచ్చిందనే అనుమానం కలుగుతోందని లక్ష్మణ్ అన్నారు.

బీజేపీ మేనిఫెస్టో కమిటీ భేటీలు

పార్లమెంటు నియోజకవర్గాల వారీగా బీజేపీ మేనిఫెస్టో సమావేశాలునిర్వహించనుంది. వచ్చే నెల 5లోగా ఈ సమావేశాలు పూర్తిచేయనుంది. ఈ సందర్భంగా ఆయా సెగ్మెంట్ల పరిధిలో రైతులు, మహిళలు, దళితులు, కార్మికులతో సమావేశమై వారి అభిప్రాయాలు తీసుకొని, జాతీయ నాయకత్వానికి నివేదించనుంది. గురువారం పార్టీ కార్యాలయంలో సమావేశమైన మేనిఫెస్టో కమిటీ పలు అంశాలపై చర్చించింది. కాగా, ఖమ్మం మాజీ అదనపు డీసీపీ అత్తలూరి సుభాష్ చంద్రబోస్ కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు.



చలివేంద్రం ప్రారంభంలో పాల్గొన్న ఏసీపీ దామోదర్‌రెడ్డి (ఫైల్)

జనగామ ఏసీపీపై బదిలీ వేటు!

జనగామ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జనగామ ఏసీపీ దామోదర్‌రెడ్డిపై బదిలీ వేటు పడింది. లోక్‌సభ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ ఆయనపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. ఈనెల 23న జనగామ మండలం పెంబర్తికి చెందిన గోదల కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వంశీధర్‌రెడ్డి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రం ప్రారంభ కార్యక్రమానికి కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలతో కలిసి జనగామ ఏసీపీ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా.. ఏసీపీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈనెల 24న సీ-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాలతో ఏసీపీపై బదిలీ వేటు వేస్తూ డీజీపీ రవిగుప్తా చర్యలు తీసుకున్నారు. ఏసీపీ దామోదర్‌రెడ్డి డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తిరుమల నడక మార్గంలో చిరుత సంచారం



తిరుమల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అలిపిరి నడక మార్గంలో మరోసారి చిరుత సంచారం కలకలం సృష్టించింది. ప్రస్తుతం గాలిగోపురం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు నడకమార్గానికి ఇరువైపులా ట్రాప్ కెమెరాలను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు వన్యమృగాల సంచారాన్ని గమనిస్తున్నారు. ఈ నెల 20వ తేదీ ఓ చిరుత నడకమార్గానికి సమీపంలో సంచరించడాన్ని గుర్తించారు. 25వ తేది రాత్రి 7.30 గంటల సమయంలో, 26వ తేదీ రాత్రి 12.10 గంటలకు మరో చిరుత నడకమార్గానికి 150 మీటర్ల దూరంలో సంచరించడం ట్రాప్ కెమెరాల్లో రికార్డయింది.

మిగిలిన ఉద్యోగాలను మెరిట్ ఆధారంగా భర్తీ చేయండి

» గురుకుల విద్యాసంస్థల్లో పోస్టులపై హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యోగాలకు ఎంపికైన కొందరు అభ్యర్థులు వాటిని వదిలేయడం వల్ల మిగిలిపోయిన పోస్టులను మెరిట్ ఆధారంగా తదుపరి వ్యక్తులతో భర్తీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, గురుకుల నియామక బోర్డుకు మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల్లో డిగ్రీ, జూనియర్ అధ్యాపకులు, పీజీటీ, టీజీటీ, లైబ్రేరియన్, పీడీ తదితర పోస్టులను గతేడాది ఏప్రిల్ 5న బోర్డు నోటిఫికేషన్‌లు జారీచేసింది. అన్ని పోస్టులకు ఒకేసారి ఎంపిక ప్రక్రియ చేపట్టడం వల్ల కొందరు అన్ని పరీక్షలు రాసి రెండు, మూడు ఉద్యోగాలకు కూడా ఎంపికయ్యారు. ఎక్కువ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు వదిలేయడం (రిలింక్విష్‌మెంట్) వల్ల దాదాపు 2 వేల పోస్టులు భర్తీకాకుండా మిగిలిపోయాయి. మిగిలిన ఆ పోస్టులను మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలని, తదుపరి మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులతో నింపవచ్చని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేస్తోందని పేర్కొంటూ అభ్యర్థి విజయ్ మనోహర్ సహా పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పిటిషనర్ల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలని.. ఫాల్ అవుట్ లేదా రిలింక్విష్‌మెంట్ సూత్రం ప్రకారం భర్తీ ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేసింది. తొలుత ఉన్నత పోస్టుల భర్తీని పూర్తి చేసి, అవరోహణ క్రమంలో కింది పోస్టులకు రావాలని సూచించింది. ప్రతివాదుల కౌంటర్‌ల కోసం తదుపరి విచారణను ఏప్రిల్ 22కు వాయిదా వేసింది.


వివేకాను ఎవరు చంపారో జగన్‌కు తెలుసు

» నిందితుడిని పక్కన పెట్టుకుని ఓటేయమని అడుగుతున్నారు

» భాస్కర్‌రెడ్డి, అవినాశ్ చంపించారని హంతకుడే చెబుతున్నా నమ్మవా? : వైఎస్ సునీత

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డిని ఎవరో చంపారో దేవుడికి, కడప జిల్లా ప్రజలతో పాటు తన సోదరుడు, ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డికి కూడా తెలుసునని వైఎస్ సునీతా రెడ్డి వ్యాఖ్యానించారు. తన చిన్నాన్న (వివేకా)ను చంపించిన వారెవరో తెలిసి కూడా జగన్ వాళ్లను రక్షిస్తున్నారని ఆరోపించారు. వివేకా హత్య వెనుక వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి ఉన్నారని హత్య చేసిన వాడే స్వయంగా చెప్తున్నా ఎందుకు నమ్మరని ప్రశ్నించారు. హత్య చేయించినవారితో జగన్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నాడని ఆరోపించారు. నిందితుడిని పక్కన పెట్టుకుని ఆయనకు ఓటు వేయమని చెప్పడం తప్పుగా అనిపించలేదా? అని జగన్‌ను ప్రశ్నించారు. వివేకా రక్తంతో వైసీపీ పునాదులు తయారు చేసుకుందని, ఆ పార్టీకి, తన సోదరుడికి (జగన్), హత్య చేయించిన ఎంపీ (వైఎస్ అవినాశ్‌రెడ్డి)కి ఓటు వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'వివేకా చిన్నాన్నను ఎవరు చంపారో ఆయనకు, దేవుడికి, కడప జిల్లా ప్రజలందరికీ తెలుసునని జగన్ చెప్పారు. ఆయన కరెక్ట్‌గా చెప్పారు. దేవుడికి, ప్రజలకు, మీకు (జగన్) కూడా తెలుసు. అందుకేనా చేయించినవారిని అంతగా ప్రొటెక్ట్ చేస్తున్నారు. దేనికి భయపడి ప్రొటెక్ట్ చేస్తున్నారు?' అని జగన్‌ను సునీత ప్రశ్నించారు. ఇద్దరు చెల్లెళ్లను ఇంకొరు నడిపిస్తున్నారని, వివేకాను చంపినోడే తాను హత్య చేశానని చెబుతున్నాడని, బయట తిరుగుతున్నాడంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. 'వివేకాను చంపినోడు నేను (దస్తగిరి) హత్య చేశానంటే నమ్ముతున్నారు. అదే వ్యక్తి ఎవరు చేశారో కూడా క్లియర్‌గా చెబుతున్నాడు. దీని వెనుక వైఎస్ భాస్కరరెడ్డి, వైఎస్ అవినాశ్ రెడ్డి ఉన్నారని చెప్పాడు. వైఎస్ జగన్ రెడ్డి, భారతీరెడ్డి వాళ్లను ప్రొటెక్ట్ చేస్తున్నారు. హంతకుడి చెప్పిన దాంట్లో ఒకటి నమ్ముతున్నారు. ఇంకొకటి నమ్మడం లేదా? నమ్మితే రెండూ నమ్మాలి కదా?' అని సునీత అన్నారు.

ఎన్ఎస్‌యూఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా అనులేఖ



రాహుల్‌గాంధీతో అనులేఖ

న్యూఢిల్లీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బుస అనులేఖ నియమితులయ్యారు. గురువారం కాంగ్రెస్ జాతీయ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ దేశవ్యాప్తంగా 8 మందిని ఎన్ఎస్‌యూఐ జాతీయ ప్రధాన కార్యదర్శులుగా, 48 మందిని కార్యదర్శులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ఆయన వెంట పాల్గొన్న భారతీయాత్రిలలో అనులేఖ ఒకరు. తన నియామకానికి సహకరించిన ఖర్గే, సోనియా, రాహుల్‌తో పాటు ఎన్ఎస్‌యూఐ ఇంచార్జ్ కన్హయ్యకుమార్‌కు అనులేఖ కృతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు 'బార్' అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది ఏ.రవీందర్‌రెడ్డి గురువారం ఘన విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా ఏ.దీప్తి, కార్యదర్శులుగా శాంతిభూషణ్ రావు, జీ.సంజీవ్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా నవీన్ కుమార్, కోశాధికారిగా కట్ట శ్రావ్య, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎస్ అభిలాష్, సీనియర్ కార్యవర్గ సభ్యుడిగా కోటగిరి శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా డీవీ శ్రీకాంత్, సుందరేశన్, కే.గణపతి, హబీబుద్దీన్ గెలుపొందారు.

కేసీఆర్ ఫాంహౌస్‌ను సీజ్ చేయాలి

» 'ఫోన్ ట్యాపింగ్' బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌ను తనిఖీ చేసి.. సీజ్ చేయాలని డీజీపీ రవి గుప్తాకు కాంగ్రెస్ నేతలు బండి సుధాకర్‌గౌడ్, తుమ్మేటి సమ్మిరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. 'హుజూరాబాద్ ఉపఎన్నికల సమయంలో ఫోన్ ట్యాపింగ్ చేసి తెరవెనుక అప్పటి మంత్రి హరీశ్ రావు (ఇన్‌చార్జి) పోలీస్ ఇంటెలిజెన్స్ అధికారులను వినియోగించుకుని రూ.వందల కోట్లు దోచుకున్న విషయాలు బహిర్గతమవుతున్నాయి. ప్రధానంగా కేసీఆర్ ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన వార్‌రూంను తక్షణమే తనిఖీ చేసి.. ఫాంహౌస్‌ను సీజ్ చేయాలి. నాటి సీఎం కేసీఆర్ రోజుల తరబడి అక్కడే ఉండి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి ప్రతిపక్షం, వ్యాపారులను బెదిరించి వారిపై అక్రమ కేసులు బనాయించారు. ఇటు సినీపరిశ్రమకు చెందిన వ్యక్తుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఈ కేసులోని అనుమానితులు, అరెస్టయిన వారి ఆస్తుల చిట్టా తీసి ఏసీబీ, ఈడీ సంస్థలతో దర్యాప్తు చేసి దాచుకున్న సొమ్ముపై సమగ్ర విచారణ జరిపించాలి. ప్రధానంగా కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, ఎంపీ సంతోష్ రావు తదితరుల పాత్రపై లోతుగా పరిశీలించి కఠిన చర్యలు తీసుకోవాలి' అని వినతి పత్రంలో కోరారు.

నా ఫోన్ ట్యాప్ చేశారు

ఆడియో 1,2,3 పేర్లతో సంభాషణలు బయటపెట్టారు

» బాధ్యులపై చర్యలు తీసుకోండి

» డీజీపీకి ఫిర్యాదు చేసిన నందకుమార్

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తన ఫోన్ ట్యాప్ చేశారని ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ప్రధాన నిందితుడు నంద కుమార్ పేర్కొన్నారు. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డీజీపీ రవి గుప్తాకు ఆయన ఫిర్యాదు చేశారు. గురువారం డీజీపీని ఆయన కార్యాలయంలో కలిసిన అనంతరం నంద కుమార్ మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సమయంలో తన ఫోన్ ట్యాప్ చేసి నేరుగా ఆడియో రికార్డులను ఆడియో-1, ఆడియో-2, ఆడియో-3 సంభాషణలు బయటపెట్టారని.. ఆ ఆడియోలు ఎలా వచ్చాయనేది నిగ్గుతేల్చాలని తాను డీజీపీని కోరానని వెల్లడించారు. అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ఉన్న రాధాకిషన్ రావు తనతోపాటు తన కుటుంబసభ్యులు, స్నేహితులను అక్రమంగా బంధించి కేసులు పెట్టారని, ఎవరి ఆదేశాల మేరకు అలా చేశారనేది తెలియాల్సి ఉందని చెప్పారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో అప్రూవర్‌గా మారనందుకు తన హోటల్‌ను ధ్వంసం చేశారని ఆరోపించారు. ట్యాపింగ్‌కు సంబంధించి డీజీపీ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పానని, ఎప్పుడు, ఎక్కడ ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే మొత్తం వివరాలు తెలియజేశానని వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి మిగతా కేసుల్లో ఆధారాల సంగతి ఎలా ఉన్నా.. తన కేసులో మాత్రం ఆధారాలు స్పష్టంగా ఉన్నాయని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరానని చెప్పారు.

ప్రభాకర్‌రావు ఆదేశించారు రాధాకిషన్ అమలు చేశారు

(మొదటిపేజీ తరువాయి)



తీసుకున్నారు. ఇప్పటికే ఈ కేసులో డీఎస్పీ ప్రణీత్ రావు, అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న అరెస్టయిన విషయం తెలిసిందే..! వీరిని విచారించిన సమయంలో రాధాకిషన్, గట్టుమల్లు పేర్లు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. బుధవారం రాత్రే వీరిద్దరినీ బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గురువారం ఉదయం నుంచి విచారించగా.. రాధాకిషన్ పాత్ర నిర్ధారణ అయ్యాకే.. ఆయనను అరెస్టు చేసినట్లు ప్రకటించారని తెలిసింది. ఎస్ఐబీ చీఫ్‌గా ప్రభాకర్‌రావు జారీ చేసిన ఆదేశాలను రాధాకిషన్ తూ.చ. తప్పకుండా పాటించినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఈ కేసులో ఫోన్‌ట్యాపింగ్ అనేది విపక్ష నేతలు, అధికారులకే పరిమితం కాకుండా.. నగల వ్యాపారులు, హవాలా ముఠాలకూ విస్తరించినట్లు ఇప్పటికే తేలిన విషయం తెలిసిందే. ఎస్ఐబీ చీఫ్‌గా ప్రభాకర్‌రావు చెప్పే నగల వ్యాపారులు, హవాలా ఆపరేటర్లను రాధాకిషన్‌రావు టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి రప్పించి, మాట్లాడినట్లు సమాచారం. ఆ కోణంపై దర్యాప్తు అధికారులు దృష్టిసారించారు. ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు కూడా రాధాకిషన్ వద్ద టాస్క్‌ఫోర్స్‌లో పనిచేశారు. వీరిద్దరినీ వేర్వేరుగా ప్రశ్నించి, వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే అరెస్టయిన తిరుపతన్న ఇచ్చిన వాంగ్మూలం మేరకు రాధాకిషన్‌రావును విచారిస్తున్నట్లు సమాచారం. ఈ కేసును జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరి నేతృత్వంలోని బృందాలు దర్యాప్తు చేస్తుండగా.. పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఎస్ఐబీ అధికారులు ఎప్పటికప్పుడు దర్యాప్తు పురోగతిని తెలుసుకుంటున్నారు.

అంటకాగిన వారిపై నజర్

రాధాకిషన్, గట్టుమల్లుతో అంటకాగిన కానిస్టేబుల్ మొదలు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులపై బంజారాహిల్స్ పోలీసులు దృష్టిసారించారు. ఇప్పటికే కొందరిని విచారించినట్లు తెలుస్తోంది. ఈ కోవలో రాధాకిషన్ వద్ద టాస్క్‌ఫోర్స్‌లోని వేర్వేరు జోన్ల బృందాల్లో ఎస్సైలుగా పనిచేసిన ప్రస్తుత ఇన్‌స్పెక్టర్లు ముగ్గురు, మరో ఇద్దరు ఎస్సైలను పలుమార్లు విచారించినట్లు సమాచారం. వీరిలో ఒకరు నాలుగేళ్లుగా టాస్క్‌ఫోర్స్‌లోనే ఉన్నారని, అక్కడే ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందగా.. ఆయన ఉన్న పోస్టును అప్‌గ్రేడ్ చేయించినట్లు తెలుస్తోంది. మరో ఎస్సై కూడా ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి రాగానే.. రాధాకిషన్‌కు సహకరించేందుకు ఎస్ఐబీకి బదిలీ అయినట్లు సమాచారం. రాధాకిషన్‌కు చిక్కడపల్లిలో ఓ హాస్టల్ ఉన్నట్లు గుర్తించిన దర్యాప్తు అధికారులు.. అక్కడే సెటిల్మెంట్లు జరిపినట్లు భావిస్తున్నారు.

రిటైర్డ్ అధికారుల పాత్రపై దృష్టి

గత ప్రభుత్వం అత్యంత కీలకమైన ఎస్ఐబీలో ఓ క్రమపద్ధతిలో రిటైర్డ్ అధికారులను నియమించినట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ దర్యాప్తు అధికారికి అమెరికా నుంచి ప్రభాకర్‌రావు ఫోన్ చేసిన విషయం తెలిసిందే. ఆ కాల్‌లో.. "రిటైర్ అయిన మమ్మల్ని ప్రభుత్వం విధుల్లో నియమించింది. మీరు ఇప్పుడు ఏవిధంగానైతే ప్రభుత్వం చెప్పిన పని చేస్తున్నారో.. మేము కూడా అప్పట్లో అదే చేశాం" అని చెప్పినట్లు సమాచారం. దీన్ని బట్టి.. విశ్రాంత పోలీసు అధికారులకు బాధ్యతలు అప్పగించి, చెప్పుచేతల్లో పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది. ఇలా రిటైర్డ్ అధికారులను ఓఎస్డీలుగా నియమించుకునే వ్యవహారమంతా ప్రభాకర్‌రావు నేతృత్వంలో సాగినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కోవలో ఒక డీఐజీ, ముగ్గురు ఎస్పీలు, నలుగురు అదనపు ఎస్పీలు, పలువురు డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు.. ఇలా మొత్తం 15 మందిని పదవీ విరమణ తర్వాత ఎస్ఐబీలో నియమించారని, ట్యాపింగ్ వ్యవహారంలో వీరే కీలకంగా వ్యవహరించారని దర్యాప్తు అధికారులు ఓ అంచనాకు వచ్చినట్లు తెలిసింది. అయితే.. ఇలా ఓఎస్డీలుగా నియమించిన వారిలో ఒకరిద్దరు ఈ వ్యవహారం నచ్చక 'గుడ్‌బై' చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం మారగానే.. మిగతావారు కూడా రాజీనామా చేశారు. ట్యాపింగ్ కేసులో వీరందరినీ విచారించేందుకు దర్యాప్తు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇక ఈ కేసుతో సంబంధం ఉండి.. ప్రస్తుతం సర్వీసులో ఉన్న అధికారులను కూడా అరెస్టు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రణీత్‌రావు ఎన్నికల ఫలితాల తర్వాతి రోజు హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేయడానికి ముందు సీసీ కెమెరాలను ఆఫ్ చేయించిన విషయం తెలిసిందే. అందుకు సహకరించిన ఎలక్ట్రీషియన్ తెలంగాణ స్పెషల్ పోలీసు బెటాలియన్(టీఎస్ఎస్‌పీ) కానిస్టేబుల్ అని తెలిసింది. ఆయనను కూడా దర్యాప్తు బృందాలు విచారించినట్లు సమాచారం.

పోలీసు కస్టడీకి భుజంగరావు, తిరుపతన్న

చంచల్‌గూడ జైలులో ఉన్న భుజంగరావు, తిరుపతన్న కస్టడీకి పంజాగుట్ట పోలీసులు వేసిన పిటిషన్‌పై నాంపల్లి కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పునిచ్చారు. పోలీసులు వారంపాటు కస్టడీ కోరగా.. న్యాయమూర్తి ఐదు రోజులకు అనుమతించారు. వీరిని శుక్రవారం నుంచి మంగళవారం వరకు పంజాగుట్ట పోలీసులు విచారించనున్నారు. ప్రణీత్‌రావు కస్టడీకి పోలీసులు వేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన కోర్టు.. పిటిషన్‌ను కొట్టివేసింది.

కేసీఆర్, ఆయన కుటుంబీకుల పాస్‌పోర్టులను స్తంభింపజేయాలి

» సీఎం, డీజీపీ, కేంద్ర హోంశాఖకు టీపీసీసీ నేత నిరంజన్ విజ్ఞప్తి

» దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బీజేపీ సర్కారు: సుజాతపాల్

» సింగరేణిలో 18 వేల కోట్లను దారి మళ్లించిన కేసీఆర్ సర్కారు: జనక్ ప్రసాద్

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేశం విడిచి పారిపోయే పరిస్థితి ఉన్నందున మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబసభ్యుల పాస్‌పోర్టులను స్తంభింపజేయాలని సీఎం, డీజీపీ, కేంద్ర హోంశాఖ ఉన్నతాధికారులకు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ విజ్ఞప్తి చేశారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్‌లో ఆరు వందల లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోందన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కార్యాలయం కేంద్రంగా సీఎం రిలీఫ్ ఫండ్‌లో పెద్ద ఎత్తున మోసం జరిగిందని.. ఈ విషయంలో హరీశ్‌ను సైతం పోలీస్‌స్టేషన్‌కు పిలిచి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కార్యాలయంలో ఇప్పటికీ సీఎం రిలీఫ్ ఫండ్ వ్యవస్థ సక్రమంగా లేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ సర్కారు ఈడీ, ఐటీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఏఐసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ మీడియా ఇన్‌చార్జి సుజాతపాల్ ఆరోపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఖాతాలు ఫ్రీజ్ చేశారని మండిపడ్డారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా జనం కాంగ్రెస్ వైపే ఉన్నారని.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ సర్కారు సింగరేణిలో 20 వేల ఉద్యోగాలు తొలగించడంతో పాటు, సింగరేణికి చెందిన రూ.18 వేల కోట్లు దారి మళ్లించిందని ఐఎన్‌టీయూసీ జాతీయ నేత జనక్ ప్రసాద్ ఆరోపించారు. కార్మికులకు జీతాలు కూడా సరిగా పెంచలేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 3 నెలల్లో కార్మికుల జీతాలు పెంచుతామని స్పష్టం చేశారు.

వేడి నీళ్లు పోసి.. రోకలి బండతో కొట్టి..

» వేధింపులకు గురిచేస్తున్నాడనే ఆగ్రహంతో భర్తను చిత్రహింసలు పెట్టి చంపిన భార్య

కరీంనగర్ క్రైం, మార్చి 28: పని మానేయడమే కాకుండా పూటుగా మద్యం తాగి తనను వేధిస్తున్నాడనే ఆగ్రహంతో భర్తను చిత్రహింసలు పెట్టి చంపిందో భార్య. తన ఇద్దరు స్నేహితులతో కలిసి భర్తను తాళ్లతో బంధించి.. ఒంటిపై వేడినీళ్లు పోసి.. కళ్లలో కారంపొడి చల్లి.. రోకలిబండతో కొట్టి ప్రాణాలు తీసింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన తోట రోహితి, హేమంత్ (39) భార్యాభర్తలు. రోహితి, జిల్లా ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం చేస్తోంది. హేమంత్ పెట్రోలు బంక్‌లో పనిచేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం అతడు పని మానేసి తాగుడుకు బానిసయ్యాడు. ఆ మత్తులో భార్య రోహితితో గొడవ పడుతుండేవాడు. మంగళవారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీన్ని మనసులో పెట్టుకున్న రోహితి.. భర్తను అడ్డు తొలగించుకోవాలనుకుంది. తనతో కలిసి పనిచేసే సాయి కిరణ్, నవీన్‌ను బుధవారం రాత్రి ఇంటికి పిలిపించుకుంది. ఆ ఇద్దరి సాయంతో ఇంట్లోనే భర్త హేమంత్‌ను తాళ్లతో కట్టేసింది. ముగ్గురు కలిసి హేమంత్ ఒంటిపై పొగలుగక్కుతున్న వేడినీళ్లు పోసి.. ఆపై కారంపొడి చల్లారు. ఆపై రోకలిబండతో తీవ్రంగా కొట్టడంతో అతడి తలపై తీవ్రగాయాలయ్యాయి. కొద్దిసేపటికి హేమంత్ స్పృహ కోల్పోవడంతో రోహితి స్వయంగా అంబులెన్స్‌కు ఫోన్ చేసి కరీంనగర్ జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లింది. అక్కడ చికిత్స పొందుతూ హేమంత్ మృతి చెందాడు. రోహితిని, ఆమెకు సాయపడిన సాయి కిరణ్, నవీన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు కరీంనగర్ టౌన్ ఏసీపీ జీ నరేందర్ తెలిపారు.

నిందితుల బెయిల్ రద్దు కోరే హక్కు అప్రూవర్‌కు ఉంటుంది

దస్తగిరి పిటిషన్‌ను తిరస్కరించలేం: హైకోర్టు

హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో 8వ నిందితుడిగా ఉన్న కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ 4వ నిందితుడు దస్తగిరి (అప్రూవర్) దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారించింది. అప్రూవర్‌కు బెయిల్ రద్దు కోరే హక్కు లేదని అవినాశ్ రెడ్డి తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి చేసిన వాదనలతో ఏకీభవించలేదు. ఇటీవల ఎన్ఐఏకు సంబంధించిన ఓ కేసులో బెయిల్ రద్దు కోరే అధికారం అప్రూవర్‌కు ఉందని డివిజన్ బెంచ్ స్పష్టం చేసిందని పేర్కొంది. దస్తగిరి పిటిషన్‌ను తోసిపుచ్చలేమని తేల్చిచెప్పింది. ప్రస్తుత పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 4వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ఉత్తర్వులిచ్చారు. కాగా... ఈ కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి బెయిల్ పిటిషన్లను వ్యతిరేకిస్తూ సీబీఐ కౌంటర్లు దాఖలు చేసింది. ఈ పిటిషన్లపై విచారణ ఏప్రిల్ 3కు వాయిదా పడింది. సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ ఏప్రిల్ 12కు వాయిదా పడింది.

తనఖా భూముల పాస్‌బుక్‌లకు విముక్తి

విడుదలకు అనుమతిస్తూ ప్రభుత్వ నిర్ణయం .. సబ్ రిజిస్ట్రార్లకు ప్రత్యేక అధికారాలు

» ఉత్తర్వులు జారీచేసిన సీసీఎల్ఏ

» ధరణి కారణంగా నిలిచిపోయిన మార్టిగేజ్ భూముల పాస్‌బుక్‌లు

» అప్పులు చెల్లించిన తర్వాత కూడా వేలాదిమంది రైతులకు తిప్పలు

» ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉపశమనం



హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ధరణి కారణంగా తనఖా భూముల పాస్‌బుక్‌లకు దూరమైన వేలాదిమంది రైతులకు ఉపశమనం కలిగించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. సదరు పాస్‌బుక్‌లను రిలీజ్ చేసే బాధ్యతలను రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించింది. ఈ నేపథ్యంలో తనఖా (మార్టిగేజ్) చేసిన డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్ (పట్టాదార్ పాస్‌బుక్) లను రిలీజ్ చేసేందుకు భూ పరిపాలన ముఖ్య కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్ ఈ నెల 13న సబ్ రిజిస్ట్రార్లకు ప్రత్యేక అధికారాలు అప్పగిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. పాస్‌బుక్‌ల కోసం కొన్నేళ్లుగా నిరీక్షిస్తున్న వేలాది మంది రైతుల కష్టాలు ఇక తీరనున్నాయి.

ఇదీ నేపథ్యం..

ధరణి రాక ముందు.. భూమిని తనఖా పెట్టి బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి అప్పులు తీసుకున్న రైతులు.. రుణం చెల్లించిన తర్వాత తమ భూముల పాస్‌బుక్‌లను సబ్ రిజిస్ట్రార్‌ల నుంచి తిరిగి తీసుకునేవారు. అయితే, ధరణి పోర్టల్ 2020 నవంబర్ 1న వచ్చినప్పటి నుంచి మార్టిగేజ్ చేసిన భూముల పట్టాదార్ పాస్‌బుక్‌ల రిలీజ్ ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయింది. వీటిని రిలీజ్ చేసే అవకాశం ఇటు ధరణి పోర్టల్‌లో లేదు. అటు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని సాఫ్ట్‌వేర్‌లోనూ లేదు. దీంతో తీసుకున్న అప్పులు చెల్లించిన తర్వాత కూడా తమ పాస్‌బుక్‌ల కోసం కొన్ని వేల మంది రైతులు గత మూడేళ్లకుపైగా వేచి చూస్తున్నారు. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రెవెన్యూశాఖ.. వ్యవసాయ భూములను, వ్యవసాయేతర భూములను, ఇతర స్థిరాస్తులను వేరు చేసింది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మార్టిగేజ్, పాస్‌పుస్తకాల రిలీజ్ అధికారాలను తహశీల్దార్లకు అప్పగించింది. వ్యవసాయేతర భూములు, ఇతర స్థిరాస్తులపై అధికారాన్ని సబ్ రిజిస్ట్రార్లకు ఇచ్చింది. అయితే, ధరణి కంటే ముందు అప్పుల కోసం తనఖా పెట్టిన భూముల పాస్‌బుక్‌లను రిలీజ్ చేసే ఆప్షన్ ధరణిలో లేదు. దీంతో పాస్‌బుక్‌లను రిలీజ్ చేసే అధికారం తమకు లేదని తహశీల్దారులు చేతులెత్తేశారు. అలాగే వ్యవసాయ భూములకు సంబంధించిన వ్యవహారం తమ పరిధిలోనిది కాదంటూ సబ్ రిజిస్ట్రార్లు చేతులు దులుపుకున్నారు. ఫలితంగా 2020 నవంబరు 1 నుంచి ఇప్పటి వరకు పట్టాదార్ పాస్‌బుక్‌లను రిలీజ్ చేసే ప్రక్రియ నిలిచిపోయింది. తీసుకున్న అప్పులు చెల్లించినప్పటికీ టైటిల్ డీడ్ పొందని రైతులు రాష్ట్రంలో దాదాపు 15 వేలకు పైగా ఉన్నట్లు అంచనా. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో వీరందరికీ ఇప్పుడు ప్రయోజనం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు.


అమరావతి రైతుల పాపమేంటి?

రాజధాని నిర్మాణానికి భూములిచ్చారు.. అంతే తప్ప వారేమీ నేరం చేయలేదు

» కేసులతో మహిళా రైతులకు ఇబ్బందులు

» దక్షిణ భారతంలోనే పెద్ద రైతు ఉద్యమం.. అమరావతి రైతుల పోరాటం

» కృష్ణామిల్క్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో జస్టిస్ ఎన్వీ రమణ



అమరావతి రైతులతో మాట్లాడుతున్న జస్టిస్ రమణ

విజయవాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అమరావతి రైతులు చేసిన పాపమేంటని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ప్రశ్నించారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇవ్వమని ఆనాటి ప్రభుత్వం అడిగితే ఇచ్చారే తప్ప... వారేమీ నేరం చేయలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ అక్కడి మహిళలపై కేసులు పెట్టి ప్రభుత్వం అనేక రకాల బాధలు పెట్టిన విషయం చూశామన్నారు. కృష్ణా జిల్లా వీరవల్లిలోని విజయా డెయిరీ ఆటోమేషన్ ప్లాంట్‌లో గురువారం కృష్ణా మిల్క్ యూనియన్ 32వ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అమరావతి రైతుల ఉద్యమం ఇటీవల కాలంలో దక్షిణ భారతదేశంలో జరిగిన పెద్ద పోరాటంగా అభివర్ణించారు. ఎయిర్‌పోర్టులో అమరావతి ప్రాంతానికి చెందిన రైతులు తనను కలిసి, రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చామని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో ఐదేళ్లుగా పడుతున్న ఇబ్బందులు, వారి కష్టాలను వివరించారని తెలిపారు. చట్టసభల్లో రైతు ప్రతినిధులు లేకపోవడంవల్ల అనేక రైతు వ్యతిరేక చట్టాలు పాస్ అవుతున్నా ప్రశ్నించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, ఇది వ్యవసాయ రంగానికి ఏమాత్రం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. పాడిపై వచ్చే ఆదాయంతో పిల్లలను చదివించుకుని విదేశాలకు పంపించే పరిస్థితులు ఏర్పడ్డాయని, ఇవన్నీ ఆనాటి రైతు నాయకుల దూరదృష్టి వల్లే సాధ్యమైందని తెలిపారు. పాడి పరిశ్రమను రక్షించాలని గుర్తించిన ఒకప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తరాదితో పోల్చుకుంటే దక్షిణ భారతంలో రైతు సంఘాల ఐక్యత చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు.

న్యాయ వ్యవస్థలోనూ అదే పరిస్థితి

న్యాయ వ్యవస్థలో రైతు కుటుంబాల నుంచి, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారు చాలా తక్కువ సంఖ్యలో ఉంటారని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. రైతుల గురించి చాలా దుర్మార్గంగా ఆలోచించే పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. 'ఒకసారి కోర్టులో నా పక్కన ఉన్న న్యాయమూర్తి ఒక రైతుకు సంబంధించి నష్టపరిహారపు కేసు వచ్చినపుడు... ఆ రైతు తాలూకా, జిల్లా, హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ఎందుకు వచ్చాడు? భూమిని ఆయనేమైనా సంపాదించాడా? తాతలు ఇచ్చిన భూమికి రూ.10 వేలు నష్టపరిహారం ఇచ్చారు కదా.. దీని కోసం కోర్టుకు వచ్చి యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏమిటి? అన్నపుడు తాను కలగజేసుకుని రైతుకు, భూమికీ ఉన్న సంబంధం తల్లికీ, బిడ్డకూ ఉన్న సంబంధమని, భూమి లేకపోతే ఆ రైతు నష్టపోతాడని నచ్చజెప్పటానికి ఒకరోజు సమయం పట్టింది' అని జస్టిస్ ఎన్వీ రమణ వివరించారు.


Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 29 మార్చి 2024

తిరుపతి ఐసర్‌లో పీహెచ్‌డీ

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)-పీహెచ్‌డీ (2024 ఆగస్టు సెషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మేథమెటిక్స్, ఎర్త్ అండ్ క్లయిమేట్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధనకు అవకాశం ఉంది. ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారు అన్ని విభాగాలకూ అప్లయ్ చేసుకోవచ్చు. నిర్దేశిత జాతీయ పరీక్షలో సాధించిన ర్యాంక్/ఫెలోషిప్ అర్హత, అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ఐసర్ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారిని నేరుగా ఇంటర్వ్యూలకు పిలుస్తారు. అభ్యర్థి వయసు ప్రోగ్రామ్ ప్రారంభం నాటికి 28 ఏళ్లు మించకూడదు.

బయాలజీ



పరిశోధనాంశాలు: కంప్యూటేషనల్ బయాలజీ అండ్ సిస్టమ్స్ బయాలజీ, బయోఫిజిక్స్, క్యాన్సర్ బయాలజీ, డిసీజ్ బయాలజీ, ఇమ్యూనాలజీ, కెమికల్ బయాలజీ, ఎకాలజీ అండ్ ఎవల్యూషనరీ బయాలజీ, డెవలప్‌మెంటల్ బయాలజీ అండ్ న్యూరో బయాలజీ, జీనోమ్ బయాలజీ, ఇన్ఫెక్షన్ బయాలజీ, ప్లాంట్ బయాలజీ, స్ట్రక్చరల్ బయాలజీ, సింగిల్ మాలిక్యూల్ బయాలజీ/న్యూక్లియక్ యాసిడ్ బయాలజీ, మైక్రో బయాలజీ
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/బయలాజికల్ సైన్సెస్/ఎకలాజికల్ సైన్సెస్/అగ్రికల్చరల్ సైన్సెస్/సైకాలజీ)/ఎంటెక్/ఎంవీఎస్సీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. జేజీఈఈబీఐఎల్ఎస్ 2023/గేట్ (లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ, కెమిస్ట్రీ, ఎకాలజీ అండ్ ఎవల్యూషన్‌లకు 200లోపు ర్యాంక్) అర్హత ఉండాలి. లేదా డీబీటీ జేఆర్ఎఫ్/ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/డీబీటీ బీఐఎన్‌సీ/యూజీసీ జేఆర్ఎఫ్/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/డీఎస్‌టీ ఇన్‌స్పయిర్ జేఆర్ఎఫ్ అర్హత ఉండాలి.

కెమిస్ట్రీ



పరిశోధనాంశాలు: ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, థియరిటికల్ అండ్ కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, ఫిజికల్ అండ్ మెటీరియల్స్ కెమిస్ట్రీ, కెమికల్ బయాలజీ, కెమిస్ట్రీ సంబంధిత ఇతర అంశాలు.
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో పీజీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ బయాలజీ)/ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ నుంచి ఎల్ఎస్/జేఆర్ఎఫ్ అర్హత లేదా ఇన్‌స్పయిర్ పీహెచ్‌డీ ఫెలోషిప్/ గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

మేథమెటిక్స్




పరిశోధనాంశాలు: అనలిటికల్ నంబర్ థియరీ, ఆల్జీబ్రిక్ నంబర్ థియరీ, గాలోయిస్ రిప్రజంటేషన్స్, హార్మోనిక్ అనాలిసిస్, ఆల్జీబ్రిక్ జామెట్రీ, ఆల్జీబ్రిక్ కే థియరీ, హోమోటోపీ థియరీ, రిప్రజంటేషన్ థియరీ, రిమాన్నియన్ జామెట్రీ, డిఫరెన్షియల్ అండ్ ఆల్జీబ్రిక్ టోపాలజీ
అర్హత: పీజీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/బయలాజికల్ సైన్సెస్) / ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ నుంచి జేఆర్ఎఫ్ అర్హత లేదా ఇన్‌స్పయిర్ పీహెచ్‌డీ/ఎన్‌బీహెచ్‌ఎం పీహెచ్‌డీ/ గేట్ అర్హత పొంది ఉండాలి.

ఎర్త్ అండ్ క్లయిమేట్ సైన్స్



పరిశోధనాంశాలు: సెస్మిక్ టోమోగ్రఫీ, సెస్మిక్ యానిసోట్రోపీ, ఎర్త్‌క్వేక్ ఫిజిక్స్ అండ్ గ్రౌండ్ మోషన్, ఎర్త్‌క్వేక్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్, ఇగ్నస్ పెట్రాలజీ, మినరాలజీ, రేర్ మెటల్ అండ్ రేర్ ఎర్త్ మినరలైజేషన్, అట్మాస్ఫిరిక్ సైన్స్, మెటియోరాలజీ, ఎకనామిక్ జియాలజీ, గోల్డ్ మెటలోజెనీ
అర్హత: మాస్టర్స్ డిగ్రీ(జియాలజీ/జియోఫిజిక్స్/ఫిజిక్స్/మెటియోరాలజీ/అట్మాస్ఫిరిక్ సైన్స్/స్పేస్ ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/ఆస్ట్రో ఫిజిక్స్/ప్లానెటరీ సైన్సెస్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. నెట్(ఎర్త్, అట్మాస్ఫిరిక్ ఓషన్, ప్లానెటరీ సైన్సెస్, ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్) లేదా గేట్(ఫిజిక్స్, జియాలజీ, జియోఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్) అర్హత ఉండాలి.



ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 3
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 10 నుంచి 15 మధ్య
- **ఇంటర్వ్యూలు:** మే 7 నుంచి 9 వరకు
- **ఫలితాలు విడుదల:** జూన్ 1 నుంచి 7 మధ్య
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** iisertirupati.ac.in


లిటిల్స్



మీకు తెలుసా?

- ఆల్ప్స్ పర్వతాలు, ఆస్ట్రియా, అజర్‌బైజాన్, ఫ్రాన్స్, బల్గేరియా, బోస్నియా, టర్కీ దేశాల్లోని కొండల్లో ఉండే ఈ జంతువును 'చామియోస్' అంటారు. ఇదో అడవి మేక.
- 107 సెం.మీ. నుంచి 137 సెం.మీ పొడవు, 80 సెం.మీ. ఎత్తు ఉంటాయివి.
- 25 కేజీలనుంచి 60 కేజీల లోపు ఉండే ఈ మేకలు కనీసం పదిహేనేళ్ల నుంచి 22 ఏళ్ల వరకూ జీవిస్తాయి.
- గంటకు 50 కి.మీ. వేగంతో పరిగెత్తుతాయివి.
- మధ్యాహ్నం వరకూ విశ్రాంతి తీసుకుంటాయి. సాయంత్రం పూట కదిలి రాత్రి పూట చురుగ్గా ఉంటాయి.
- ఇవి ఒక్కో మందలో 15 నుంచి 30 వరకు ఉంటాయి.
- ఆడజంతువుల కంటే మగ జీవులు పెద్దగా ఉంటాయి.
- వీటి గర్భధారణ సమయం 170 రోజులు. ఒక్క పిల్లను మాత్రమే కంటాయి.
- మనుషులతో పాటు చిరుతలు, పులులు, నక్కల వల్ల ఇవి చనిపోతుంటాయి.
- గడ్డి, పూలు, పండ్లను తింటాయి. చలికాలంలో మాత్రం మంచు ఎక్కువున్నప్పుడు ఆహారం దొరక్క రెండు వారాల పాటు అలానే ఉంటాయివి.
- రాళ్లమధ్య కింద పడిపోకుండా వేగంగా దూకగలవు. పరిగెత్తగలవు. రెండు మీటర్ల ఎత్తువరకూ ఎగరగలవు. ఆరు మీటర్ల దూరం దూకగలవు.






8 తేడాలను గుర్తించండి


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



ఏపీ పీఈసెట్ నోటిఫికేషన్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ)-'ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ పీఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఈ టెస్ట్ ద్వారా రెండేళ్ల వ్యవధి గల బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ప్రైవేట్/ అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత వివరాలు: బీపీఈడీ కోర్సులో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి.
- డీపీఈడీ కోర్సులో ప్రవేశానికి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి.
- ఇప్పటికే ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ)గా పని చేస్తున్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరు గుంటూరు జిల్లా-మంగళగిరి-ఆత్మకూరులోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏపీ పీఈసెట్ వివరాలు: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ ఉంటుంది. దీనికి 400 మార్కులు కేటాయించారు. పురుషులకు 100 మీటర్ల పరుగు, 6 కేజీల పుట్టింగ్ ద షాట్, 800 మీటర్ల పరుగు, లాంగ్ జంప్/ హై జంప్; మహిళలకు 100 మీటర్ల పరుగు, 4 కేజీల పుట్టింగ్ ద షాట్, 400 మీటర్ల పరుగు, లాంగ్ జంప్/ హై జంప్ ఉంటాయి. ఒక్కో ఈవెంట్‌కు 100 మార్కులు ఉంటాయి. రెండో పార్ట్‌లో స్కిల్ టెస్ట్ ఉంటుంది. బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, వాలీ బాల్ క్రీడల్లో ఒకదానిలో అభ్యర్థి క్రీడానైపుణ్యాన్ని పరీక్షిస్తారు. దీనికి 100 మార్కులు ఉంటాయి. హార్ట్ సంబంధిత సమస్యలు ఉన్నవారు, గర్భిణులు ఈ టెస్ట్‌లలో పాల్గొనడానికి అనర్హులు. ఏపీ పీఈసెట్ 2024లో అర్హత సాధించాలంటే కనీసం 30 శాతం మార్కులు రావాలి.
- ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్స్/ స్పోర్ట్స్ అసోసియేషన్స్/స్పోర్ట్స్ అథారిటీస్ నుంచి దేశం తరపున ప్రాతినిధ్యం వహించినవారికి 100 మార్కులు; నేషనల్ లెవెల్ మీట్స్/ఇంటర్ యూనివర్సిటీ మీట్స్/నేషనల్ స్కూల్ గేమ్స్‌లో మొదటి స్థానం సాధించినవారికి 75 మార్కులు, రెండో స్థానం సాధించినవారికి 50 మార్కులు, మూడోస్థానం సాధించినవారికి 30 మార్కులు, పాల్గొన్నవారికి 25 మార్కులు; స్టేట్/ఇంటర్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్, స్టేట్ స్కూల్ గేమ్స్‌లో మొదటి స్థానం సాధించిన వారికి 20 మార్కులు, రెండో స్థానం సాధించినవారికి 15 మార్కులు, మూడో స్థానం సాధించినవారికి 10 మార్కులు; ఎన్ఐఎస్‌లో ఏడాది కోర్సు లేదా యోగా/స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్/స్పోర్ట్స్ సైన్స్/స్పోర్ట్స్ జర్నలిజం/ఒలింపిక్ ఎడ్యుకేషన్‌లో ఏడాది డిప్లొమా లేదా డీపీఈడీ కోర్సు పూర్తిచేసినవారికి 5 మార్కులు; ఎన్‌సీసీ-సీ/బీ సర్టిఫికెట్ ఉన్నవారికి 5 మార్కులు అదనంగా ఏపీ పీఈసెట్ స్కోర్‌కు కలుపుతారు.


- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; బీసీ అభ్యర్థులకు రూ.800; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.700
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్:** మే 30, 31
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 4 నుంచి
- **టెస్ట్ సెంటర్:** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్యాంపస్, నాగార్జున నగర్, గుంటూరు
- **ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్‌లు, గేమ్ స్కిల్ టెస్ట్‌లు:** జూన్ 11 నుంచి
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

ఆర్ఐఈలో డిప్లొమా, పీజీ డిప్లొమా

బెంగళూరులోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్, సౌత్ ఇండియా (ఆర్ఐఈఎస్ఐ)- డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్ (డీఐఈసీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ (పీజీడీఈఎల్‌టీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని దూరవిద్య విధానంలో నిర్వహిస్తారు. ఒక్కో కోర్సు వ్యవధి ఏడాది.

డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ఫ్లూయెన్సీ, అక్యూరసీ, డిస్కోర్స్ మేనేజ్‌మెంట్ అనే మూడు మాడ్యూల్స్ ఉంటాయి. ఇంగ్లీష్ లాంగ్వేజ్ పెడగాగి, ఇంగ్లీష్ ఫర్ బిజినెస్, ఇంగ్లీష్ ఫర్ మీడియా అనే ఆప్షనల్ మాడ్యూల్స్ నుంచి ఒకదాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది.
బోధన: రెండు కంపల్సరీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ల ద్వారా తరగతులు నిర్వహిస్తారు. అక్టోబరులో మొదటి కాంటాక్ట్ ప్రోగ్రామ్ ఉంటుంది. ఇందులో రెండు రోజులపాటు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. రెండోది 2025 ఏప్రిల్, మే నెలల్లో ఉంటుంది. ఇందులో 18 రోజులపాటు ఆఫ్‌లైన్ తరగతులు ఉంటాయి. కమ్యూనికేషన్ స్కిల్స్, ఒకాబులరీ, ఫ్లూయెన్సీ ఇన్ స్పీకింగ్ అండ్ రీడింగ్, ఎఫెక్టివ్‌లీ రైటింగ్, బెటర్ లిజెనింగ్ మెథడ్స్ సంబంధిత అంశాలు వివరిస్తారు. కోర్సు ఫీజు రూ.4,000.
అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏ గ్రూపుతోనైనా ఇంటర్/ పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



పీజీ డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ప్రధానంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజెనింగ్ అండ్ స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, లాంగ్వేజ్ వర్క్, మెథడ్స్ అండ్ మెటీరియల్స్ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, టీచర్ డెవలప్‌మెంట్, ఇంగ్లీష్ టీచింగ్ ప్రాక్టీస్ వంటి అంశాలు ఉంటాయి. ఒక్కోదానిలో నాలుగు మాడ్యూల్స్, ప్రతి మాడ్యూల్‌లో మూడు/నాలుగు యూనిట్‌లు ఉంటాయి.
బోధన: కోర్సులో భాగంగా రెండు కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తారు. మొదటిది అక్టోబరులో ఉంటుంది. ఇందులో మూడు రోజులపాటు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. రెండోదాన్ని 2025 ఏప్రిల్, మే నెలల్లో నిర్వహిస్తారు. ఇందులో 22 రోజులపాటు ఆఫ్‌లైన్ తరగతులు ఉంటాయి. కనీసం 80 శాతం అటెండెన్స్ ఉంటేనే ఫైనల్ ఎగ్జామ్‌కు అనుమతిస్తారు. ఈ ప్రోగ్రామ్‌ని గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాలి. కోర్సు ఫీజు రూ.10,000.
స్టడీ మెటీరియల్: ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ తీసుకొన్న అభ్యర్థులకు ఆరు బుక్‌లెట్‌లతో కూడిన లెర్నింగ్ మెటీరియల్, 12 అసైన్‌మెంట్‌లకు సంబంధించిన వివరాలు-వాటి షెడ్యూల్, కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ల షెడ్యూల్, ఐడీ కార్డ్ పంపుతారు.
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఏప్రిల్ 1 నుంచి
- **రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన కాపీలు:** పదోతరగతి సర్టిఫికెట్; ఇంటర్, డిగ్రీ మార్కుల పత్రాలు; ఆధార్ కార్డ్; రెండు ఫొటోలు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూన్ 1 నుంచి
- **చిరునామా:** ద డైరెక్టర్, రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్, సౌత్ ఇండియా, జనభారతి క్యాంపస్, బెంగళూరు - 560056
- **వెబ్‌సైట్:** www.riesi.ac.in

SCHOLARSHIP ALERT

Directorate General of Trade Remedies (DGTR) Internship Program 2024

Description: Directorate General of Trade Remedies (DGTR) Internship Program 2024 is an opportunity offered by the Ministry of Commerce and Industry, Government of India to postgraduate students/research scholars. The objective of this program is to equip interested and motivated students with the knowledge and skills necessary to understand and engage in Trade Remedies Investigations and Trade Defence Measures.
Eligibility: Open for postgraduate students/research scholars from recognised universities/institutions.
Prizes & Rewards: A certificate of completion
Last Date to Apply: Round The Year
Application mode: via email or post: to the General Administration Section of DGTR
Short Url: www.b4s.in/aj/DGCI1

The Sonny and Gita Mehta Scholarship for Writers



Description: The Sonny and Gita Mehta Scholarship for Writers 2024 is an opportunity offered by the University of East Anglia (UEA) to support aspiring writers from the Indian subcontinent, the Middle East or North Africa to enable them to undertake study in the Department of Literature, Drama and Creative Writing at UEA.
Eligibility: Open for Indian writers who are native of India and demonstrate outstanding creative writing potential.
Prizes & Rewards: A tuition fee of £28,500 and maintenance fees
Last Date to Apply: 01-05-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SOIS6

ICRO Amrit Internship Programme 2024

Description: ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.
Eligibility: Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.
Prizes & Rewards: A monthly stipend of 6,000 and a certificate of completion
Last Date to Apply: 01-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ICRA1

buddy4study.com

డైలీ సుడోకు - 267

	4			9	2		7	
		3						4
			3	6	4	9		
		8						9
9	6						8	5
7						6		
		9	5	8	7			
8						3		
	7		1	4			9	

సుడోకు - 266 సమాధానం

1	7	3	9	5	8	2	6	4
5	2	4	3	7	6	9	8	1
9	6	8	2	4	1	3	7	5
7	9	1	8	2	4	6	5	3
2	4	6	5	9	3	7	1	8
3	8	5	1	6	7	4	9	2
4	1	9	6	8	2	5	3	7
8	5	7	4	3	9	1	2	6
6	3	2	7	1	5	8	4	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.